www.flashindianews.com

FLASH INDIA NEWS

# ఫ్లాష్ ఇండియా

తెలుగు దినపత్రిక

FLASH INDIA TELUGU DAILY

RNI NO.APTEL/2010/33229

సంపుటి : 17 | సంచిక : 134 | ఆదివారం 28.06.2026 | ఎడిటర్ : కొమరాజు శ్రీనివాసులు | పేజీలు : 08 | వెల రూ : 2/-

**విలేకరులు కావలెను**

18 సం॥ లుగా వెలువడుతున్న "ఫ్లాష్ ఇండియా" తెలుగు దిన పత్రికలో పనిచేయుటకు తెలంగాణ రాష్టంలోని జిల్లాలు, నియోజకవర్గాల, మరియు మండలాల వారీగా విలేకరులు కావలెను..

సెల్ నెంబర్: 9951494039

# తెలంగాణకు ప్రత్యేక ఉపాధి హామీ చట్టం..

## జూలై 2న రాష్ట్ర కేబినెట్‌లో తుది నిర్ణయం?



**అవసరమైతే సుప్రీంకోర్టు వరకు వెళ్తాం**

**కర్ణాటక, కేరళతో కలిసి ఉమ్మడి పోరాటానికి సిద్ధం**

- ఉపాధి హామీ చట్టం సవరణను యథాతథంగా అంగీకరించం
- రాష్ట్రాల హక్కులను హరించే చట్టాన్ని వ్యతిరేకిస్తాం
- అవసరమైతే సుప్రీంకోర్టులో కేంద్ర చట్టాన్ని సవాల్ చేస్తాం
- గ్రామీణ పేదల ప్రయోజనాలపై రాజీ పడేది లేదు
- కేంద్ర ప్రతిపాదనపై తెలంగాణ ప్రభుత్వం గట్టి అభ్యంతరం
- రాష్ట్ర హక్కుల కోసం ఇతర రాష్ట్రాలతో కలిసి పోరాటం
- 60 రోజుల ఉపాధి పరిమితిని తెలంగాణ తీవ్రంగా వ్యతిరేకించింది
- ప్రతి కుటుంబానికి 200 రోజుల ఉపాధి కల్పించాలని డిమాండ్
- ఉపాధి హామీ చట్టంపై జూలై 2న కేబినెట్‌లో నిర్ణయం
- తెలంగాణ ప్రయోజనాల కోసం అన్ని మార్గాలు పరిశీలనలో
- కేంద్రం ఏకపక్ష నిర్ణయాలను తెలంగాణ అంగీకరించదు

03

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :**

గ్రామీణ పేదల జీవనోపాధికి వెన్నెముకగా నిలిచిన మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని నిర్వీర్యం చేస్తూ, రాష్ట్రాల అధికారాలను హరిస్తున్న కేంద్ర ప్రభుత్వ ప్రతిపాదిత వీబీ-జీ రామ్-జీ చట్టం-2025ను తెలంగాణ ప్రభుత్వం ఎట్టి పరిస్థితుల్లోనూ యథాతథంగా అంగీకరించబోదని రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. శనివారం రాష్ట్ర సచివాలయంలో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అధ్యక్షతన రెండో మంత్రివర్గ ఉపసంఘం సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి మంత్రులు సీతక్క, తుమ్మల నాగేశ్వరరావు, గడ్డం వివేక్ వెంకటస్వామి, పంచాయతీ రాజ్ ప్రత్యేక కార్యదర్శి దానకిశోర్, పంచాయతీ రాజ్ రూరల్ డెవలప్మెంట్ కమిషనర్ డి.దివ్య తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడారు.. ఇది కేవలం ఉపాధి హామీ చట్టం సవరణ కాదని, భారత రాజ్యాంగంలోని సమాఖ్య స్ఫూర్తిపైనే జరుగుతున్న ప్రత్యక్ష దాడి అని తీవ్రంగా విమర్శించారు.

## తెలంగాణ సీఎంవోలో మరో వికెట్ అవుట్..

- సీఎం ప్రిన్సిపల్ సెక్రటరీగా శ్రీనివాస్ రాజు తప్పింపు
- సీఎంవో నుంచి రెరా ఛైర్మన్‌గా శ్రీనివాస్ రాజు బదిలీ
- సీఎంవోలో మరో కీలక వికెట్.. అధికార వర్గాల్లో చర్చ
- అజిత్ రెడ్డి తర్వాత శ్రీనివాస్ రాజుపైనా బదిలీ వేటు
- కొనసాగుతున్న కీలక మార్పులు

02

## 7 దశాబ్దాల నాటి భూవివాదానికి తెర

- 74 ఏళ్ల భూ వివాదానికి సుప్రీంకోర్టు ఫుల్‌స్టాప్
- 1957 భూ విక్రయ ఒప్పందం చెల్లుబాటు
- నాలుగు తరాలుగా సాగిన భూ పోరాటానికి ముగింపు
- 15.5 ఎకరాల భూమిపై యాజమాన్య హక్కులకు న్యాయం
- చిన్న సాంకేతిక లోపాలతో రిజిస్ట్రేషన్ పత్రాన్ని కొట్టివేయొద్దు

05

**1957లో నమోదైన సేల్ డీడ్ ద్వారా అప్పీలుదారుల పూర్వీకులు అప్పట్లో మైనర్లుగా ఉన్న సమయంలోనే 15.5 ఎకరాల భూమిని కొనుగోలు చేశారు. అప్పటి నుంచీ ఆ భూమిని తామే సాగుచేస్తూ వస్తున్నారు. 1984లో భూమిని తమ పేర్లపై మ్యుటేషన్ కూడా చేయించుకున్నారు. 1991లో భూ సమీకరణ.. అంటే కన్సాలిడేషన్ ప్రక్రియలో తమకు భూమిధార్ హక్కులు గుర్తించాలని కోరగా..**



## సారథే ఈ సేవలకు యజమాని

### మోడీ సహకార్ సే సమృద్ధి

**ప్రైవేట్ టాక్సీ యాప్‌ల దోపిడీకి చెక్**



- గుజరాత్‌లో 'భారత్ టాక్సీ' సేవలకు అమిత్ షా శ్రీకారం
- దేశంలో తొలి సహకార ఆధారిత రైడ్-హెయిలింగ్ ప్లాట్‌ఫామ్ ప్రారంభం
- మహాత్మా మందిరంలో ఘనంగా ప్రారంభోత్సవ కార్యక్రమం
- మోడీ 'సహకార్ సే సమృద్ధి' దృష్టితో కొత్త సేవలు
- ప్రైవేట్ టాక్సీ యాప్‌ల దోపిడీకి చెక్: అమిత్ షా
- 'డ్రైవర్లే యజమానులు'.. భారత్ టాక్సీ ప్రత్యేకత ఇదే
- సహకార రంగంలో రవాణా విప్లవానికి నాంది
- డ్రైవర్లు, వినియోగదారుల ప్రయోజనాలే లక్ష్యంగా కొత్త ప్లాట్‌ఫామ్
- వేలాది మంది డ్రైవర్ల సమక్షంలో సేవల ప్రారంభం

02




## తెలంగాణ ప్రభుత్వ నిర్ణయంపై ట్రంప్ ఫిదా!

- డొనాల్డ్ ట్రంప్ అవెన్యూ'పై ట్రంప్ ఆనందం
- హైదరాబాద్ ఇచ్చిన గౌరవానికి ట్రంప్ కృతజ్ఞతలు
- 'ఇది అపూర్వమైన గౌరవం' అంటూ ట్రూత్ సోషల్‌లో పోస్ట్
- తెలంగాణ ప్రభుత్వం రోడ్డుకు 'డొనాల్డ్ ట్రంప్ అవెన్యూ' నామకరణం

02



## ఆ ప్రచారం నమ్మొద్దు..

**ఏపీలో మాదిరిగా కాకూడదనే**

- 14 గంటల చర్చలతో ఏకగ్రీవ నిర్ణయాలు తీసుకున్న ప్రభుత్వం
- 32 డిమాండ్లలో 29 అంశాల పరిష్కారానికి చర్యలు ప్రారంభం
- జూలై జీతాల నుంచే 11 శాతం పీఆర్సీ అమలు
- గుర్తింపు సంఘాల ఎన్నికల తర్వాతే విలీన కమిటీ ఏర్పాటు
- విలీన కమిటీలో కార్మిక ప్రతినిధులకు తప్పనిసరి స్థానం
- ఏపీ తరహా సమస్యలు రాకుండా జాగ్రత్తలు: మంత్రి పొన్నం

03

## ముగ్గురు సీఎంల చీకటి ఒప్పందాలేంటి?

- ముగ్గురు సీఎంల రహస్య భేటీ వివరాలు వెల్లడించాలి
- కర్ణాటకతో రేవంత్ కుమ్మక్కయ్యారనే అనుమానం
- తెలంగాణ ప్రయోజనం ఏమిటో అసెంబ్లీలో చెప్పాలి
- కర్ణాటక ఒప్పందాలపై అఖిలపక్ష సమావేశం నిర్వహించాలి
- రాష్ట్ర భవిష్యత్తును తాకట్టు పెడుతున్నారంటూ విమర్శలు
- నదీ జలాల విషయంలో సీఎం వైఖరిపై బీఆర్ఎస్ ఆగ్రహం

03

**ఉత్తమ్ కుమార్ రెడ్డిని బయటే ఉంచి ఏం చర్చించారు?**




కర్ణాటకతో ఒప్పందాలపై అఖిలపక్ష సమావేశం నిర్వహించాలని హరీశ్ రావు డిమాండ్ చేశారు. రాష్ట్ర భవిష్యత్ సీఆర్ పాటిల్ చేతిలో ఎలా పెడతారని ప్రశ్నించారు. చంద్రబాబు ఏది చెబితే కేంద్రం అదే వింటుందని, చంద్రబాబు పలుకుపడితో ఏపీ వ్యక్తిని కేంద్ర ఇరిగేషన్ అధికారిగా నియమించారని ఆరోపించారు. నదీ జలాలపై కనీస అవగాహన లేని ముఖ్యమంత్రి అజ్ఞానం.. నేడు తెలంగాణకు మరణ శాసనంగా మారిందన్నారు.



## మీరు గుండెలు బాదుకున్న ఎస్ఐఆర్ ఆగదు

**డూప్లికేట్, దొంగ ఓట్ల తొలగింపుకే ఎస్ఐఆర్**

**వాళ్ల పప్పులు ఉడకవనే విమర్శలు**

02

- ఎస్ఐఆర్‌పై కాంగ్రెస్, బీఆర్ఎస్ అనవసర రాద్ధాంతం
- డూప్లికేట్, దొంగ ఓట్ల తొలగింపుకే ఎస్ఐఆర్
- ఓటర్ల జాబితా సవరణను రాజకీయంగా చూడొద్దు
- ఎలక్షన్ కమిషన్ రాజ్యాంగబద్ధమైన స్వతంత్ర సంస్థ
- ఎస్ఐఆర్ ప్రక్రియను ఎవరూ అడ్డుకోలేరు
- రాహుల్ గాంధీ ఈసీపై తప్పుడు ప్రచారం చేస్తున్నారు



## గులాబీ జెండా ఎగరడం ఖాయం

**కాంగ్రెస్ పోవాలె.. కేసీఆర్ రావాలె**

**కేసీఆర్ పాలనలో సంక్షేమం.. కాంగ్రెస్ పాలనలో కుంభకోణాలు**

**రేవంత్‌పై ఘాటు విమర్శలు.. 'రెన్యూవల్ సీఎం' అంటూ ఎద్దేవా**

- మహేశ్వరంలో బీఆర్ఎస్ కార్యకర్తల్లో జోష్ నింపిన కేటీఆర్
- వచ్చే ఎన్నికల్లో బీఆర్ఎస్ విజయం ఖాయం
- కాంగ్రెస్ పాలనలో అభివృద్ధి కాదు.. విధ్వంసమే
- రేవంత్ రెడ్డికి 'హిట్లర్ రెడ్డి' అంటూ కేటీఆర్ వ్యాఖ్యలు
- 420 హామీలతో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చింది
- కేసీఆర్ చేసిన అప్పులతోనే రాష్ట్ర అభివృద్ధి సాధ్యమైంది
- రెండున్నరేళ్లలో నాలుగు లక్షల కోట్ల అప్పు చేసి ఒక్క పని చేయలేదు

03

# 51 వేల మంది మిస్సింగ్!

--వెనిజులా : దక్షిణ అమెరికా దేశం వెనిజులాలో ఈ నెల 24న వరుసగా రెండు భారీ భూకంపాలు సంభవించాయి. ఈ జంట భూకంపాలు సృష్టించిన బీభత్సం కారణంగా నేటికి సహాయక చర్యలు కొనసాగుతూనే ఉన్నాయి. ఇప్పటి వరకు 920 మంది ప్రాణాలు కోల్పోయినట్లు స్థానిక ప్రభుత్వం అధికారికంగా ప్రకటించగా.. షాకింగ్ నిజాలు వెలుగులోకి వస్తున్నాయి. భూకంపం సంభవించి మూడు రోజులు గడుస్తున్నా క్షేత్రస్థాయిలో పరిస్థితి అత్యంత దారుణంగా మారింది. ఈ ఘోర ప్రకృతి విపత్తు కారణంగా వందలాది భవనాలు, అపార్టుమెంట్లు కుప్పకూలాయి. భూకంపం అనంతరం అక్కడి దృష్యాలు అందరినీ తీవ్ర దిగ్భ్రాంతికి గురి చేస్తుండగా.. ఓ షాకింగ్ విషయం వెలుగులోకి వచ్చింది. కూలిపోయిన ఇళ్లు, భారీ అపార్ట్‌మెంట్ల శిథిలాల క్రింద చిక్కుకుని ఏకంగా 51,000 మందికి పైగా ప్రజలు గల్లంతైనట్లు అంతర్జాతీయ వార్తా సంస్థలు వెల్లడించాయి. ప్రస్తుతం భూకంప ప్రభావిత ప్రాంతాల్లో సహాయక చర్యలు ముమ్మరంగా సాగుతున్నాయి. వందలాది విపత్తు నిర్వహణ బృందాలు, రెస్క్యూ టీమ్స్ రాత్రింబవళ్లు శ్రమిస్తూ అత్యాధునిక పరికరాల సహాయంతో కూలిపోయిన కాంక్రీట్ కట్టడాల శిథిలాలను తొలగిస్తున్నారు. సమయం గడుస్తున్న కొద్దీ శిథిలాల క్రింద చిక్కుకున్న వారు ప్రాణాలతో బయటపడే అవకాశాలు క్షీణిస్తుండటంతో బాధితుల కుటుంబాలలో తీవ్ర ఆందోళన వ్యక్తమవుతోంది. మరణాల సంఖ్య ఇంకా భారీగా పెరిగే అవకాశం ఉందని, క్షతగాత్రులకు తాత్కాలిక శిబిరాల్లో అత్యవసర వైద్య సేవలు అందిస్తున్నామని స్థానిక అధికారులు పేర్కొన్నారు.

# నాకు ఏం జరిగినా రేవంత్ రెడ్డిదే బాధ్యత



హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా : తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి లక్ష్యంగా బీఆర్ఎస్ సీనియర్ నేత, మాజీ ఐపీఎస్ అధికారి ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ తీవ్ర విమర్శలు గుప్పించారు. రాష్ట్ర ప్రభుత్వం తనపై కక్షగట్టి వేధిస్తోందని ఆయన ఆరోపించారు. శనివారం మీడియా ముఖంగా ఆయన మాట్లాడిన పలు వ్యాఖ్యలు ప్రస్తుతం రాష్ట్ర రాజకీయాల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారాయి. ప్రజా సమస్యలపై నిరంతరం గొంతెత్తుతూ, విపక్ష నేతగా ప్రభుత్వాన్ని నిలదీస్తున్నందుకే తనను అధికార పక్షం టార్గెట్ చేసిందని ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ మండిపడ్డారు. ప్రజల పక్షాన నిలబడటమే తాను చేసిన తప్పా అని ఆయన ప్రశ్నించారు. తనకు కనీస ముందస్తు సమాచారం ఇవ్వకుండానే ప్రభుత్వం భద్రతను (సెక్యూరిటీ) తొలగించిందని ఆయన తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఒక మాజీ ఉన్నతాధికారిగా, ప్రజా ప్రతినిధిగా ఉన్న తనకు రక్షణ లేకుండా చేయడం వెనుక ఉన్న అంతరార్థం ఏంటని ప్రశ్నించారు. ఈ క్రమంలోనే ఆయన సీఎం రేవంత్ రెడ్డిపై కీలక వ్యాఖ్యలు చేస్తూ.... "నాకు భవిష్యత్తులో ఏం జరిగినా, నా ప్రాణానికి ఏ హాని తలపెట్టినా దానికి ముమ్మాటికీ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిదే పూర్తి బాధ్యత" అని స్పష్టం చేశారు.

**అంతా ప్రజల కోసమే: ఆర్ఎస్పీ**

తాను చేస్తున్న పోరాటాల వెనుక ఎటువంటి వ్యక్తిగత స్వార్థం లేదని ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ తేల్చి చెప్పారు. "నేను ఏం చేసినా, ఏ నిర్ణయం తీసుకున్నా అది కేవలం ప్రజల కోసమే. నాకంటూ ఎలాంటి సొంత ఎజెండాలు లేవు" అని ఆయన పేర్కొన్నారు. భద్రతను తొలగించినంత మాత్రాన భయపడేది లేదని, ప్రజల తరపున తన గొంతుక మరింత బలంగా వినబడుతుందని ఆయన స్పష్టం చేశారు. ప్రభుత్వ నిర్ణయంపై బీఆర్ఎస్ శ్రేణులు సైతం అసంతృప్తి వ్యక్తం చేస్తుండటంతో, ఈ సెక్యూరిటీ ఉపసంహరణ వ్యవహారం రాబోయే రోజుల్లో ఎలాంటి రాజకీయ మలుపులు తీసుకుంటుందో చూడాలి.

# మీరు గుండెలు బాదుకున్న ఎస్ఐఆర్ ఆగదు



హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా : ఎస్ఐఆర్ అంటే కాంగ్రెస్, బీఆర్ఎస్ గుండెలు బాదుకుంటున్నాయని మీరు గుండెలు బాదుకున్న ఈ ప్రక్రియ ఆగదని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి అన్నారు. కాంగ్రెస్ అధికారంలో ఉన్నప్పుడు కూడా ఎస్ఐఆర్ చేశారని కానీ ఇప్పుడు జరుగుతున్న సవరణపై ప్రతిపక్షాలు తప్పుడు ప్రచారం చేస్తున్నాయని దుయ్యబట్టారు. ఎస్ఐఆర్ చేసిన రాష్ట్రాల్లో పోలింగ్ శాతం భారీగా పెరిగిందన్నారు. ఎలక్షన్ కమిషన్ రాజ్యాంగ బద్ధమైన స్వతంత్ర కమిషన్ అని అది తన పని తాను చేసుకుంటూ వెళ్తోందన్నారు. డూప్లికేట్ ఓట్లు, దొంగఓట్లను తొలగించేందుకే ఈసీ సర్ ప్రక్రియను చేపట్టినట్లు వివరించారు. ఎలక్షన్ కమిషన్ మీద బురదజల్లే ప్రయత్నం రాహుల్ గాంధీ చేస్తున్నారన్నారు. ఎలక్షన్ కమిషన్ విషయంలో ప్రళయం సృష్టిస్తానని చెప్పిన రాహుల్ గాంధీ ఏ రకంగా నవ్వుల పాలయ్యారో దేశమంతా చూసిందన్నారు.

**వాళ్ల పప్పులు ఉడకవనే విమర్శలు:**

ఓటర్ల జాబితా సవరణ అనేది నిరంతర ప్రక్రియ అని దీన్ని రాజకీయం చేయాలని చూడటం దురదృష్టకరం అన్నారు. ఎస్ఐఆర్ లో ప్రజలంతా స్వచ్ఛందంగా పాల్గొనాలని పిలుపునిచ్చారు. ప్రతిపక్షాల విమర్శలన్నీ నిరాధారమైనవని బాధ్యతారాహిత్యమైనవన్నారు. రాష్ట్ర ప్రభుత్వం బీఎల్ఓల చేత ఇందిరమ్మ చీరలు పంపిణీ చేయిస్తున్నారని దీనిపై తాము ఎలక్షన్ కమిషన్ కు ఫోటోలతో సహా ఫిర్యాదు చేశామన్నారు. దీనిపై ఈసీ కఠినంగా వ్యవహరించాల్సిన అవసరం ఉందన్నారు. బీఎల్ ఓలకు ఐడీ కార్డులు ఈసీ నుంచి రావాలని కానీ కొన్ని చోట్ల తెలంగాణ ప్రభుత్వం పేరుతో ఇస్తున్నారన్నారు. జిల్లా కలెక్టర్లు, ఉన్నతాధికారులు ధైర్యంగా ఎస్ఐఆర్‌ను నిర్వర్తించాలని పిలుపునిచ్చారు. అధికారులకు ఎదైనా సమస్యలు ఉంటే వారికి బీజేపీ అండగా ఉంటుందన్నారు. లండన్‌లో వెళ్లి బారిస్టర్ చదివిన అసదుద్దీన్ ఓవైసీ రాజ్యాంగం గురించి అబద్ధాలు ఎలా చెప్పాలో నేర్చుకుని వచ్చారని, ఎస్ఐఆర్ సక్రమంగా జరిగితే మా పప్పులు ఉడకవని ఓవైసీ, కాంగ్రెస్, బీఆర్ఎస్ ఈ రకంగా మాట్లాడుతున్నారన్నారు.



# పరారీలో "గోల్డ్ మ్యాన్"..

హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా : గోల్డ్ మ్యాన్ సూర్య భాయ్‌ను పోలీసులు అరెస్ట్ చేశారు. హైదరాబాద్ నుంచి షాద్‌నగర్ పారిపోతుండగా పోలీసులు పట్టుకున్నారు. తక్కువ ధరకే బంగారం ఇప్పిస్తానంటూ అమాయకులను సూర్య భాయ్ బురిడీ కొట్టించాడు. తమ డబ్బులు తిరిగి ఇవ్వాలని అడిగితే.. ఏకంగా బాధితులపై కేసు పెట్టాడు. చివరకు అసలు రంగు బయటపడటంతో పారిపోయేందుకు ప్రయత్నిస్తుండగా గోల్డ్ మ్యాన్‌ను పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు.

**అసలు ఏం జరిగిందంటే..?**

మార్కెట్ రేటు కంటే చాలా తక్కువ ధరకే బంగారం అందిస్తానని నమ్మబలికిన "గోల్డ్ మ్యాన్" సూర్యా భాయ్ చివరకు తన అసలు రంగు బయటపెట్టాడు. నమ్మి వచ్చిన అమాయక బాధితులకు ఆశ చూపి, ఏకంగా 30 లక్షల రూపాయల మేర భారీ మోసానికి తెరలేపాడు. డబ్బులు చేతికి అందాక, గోల్డ్ ఇవ్వకుండా.. అడిగితే రిటర్న్ ఇవ్వకుండా సతాయిస్తూ, ఏకంగా బాధితులపైనే ఎదురు కేసులు పెట్టి బుకాయించే ప్రయత్నం చేశాడు. అయితే, ఈ కేటుగాడి మోసాలు ఎక్కువ కాలం సాగలేదు. పోలీసులు రంగంలోకి దిగి లోతుగా దర్యాప్తు చేయడంతో సూర్యా భాయ్ అసలు మోసాల గుట్టు రట్టయింది. విషయం తీవ్రం కావడంతో, అరెస్ట్ భయంతో ఈ గోల్డ్ మ్యాన్ తన ఇంటికి తాళం వేసి రాత్రికి రాత్రే పరారయ్యాడు. మొదట అత్తాపూర్ పోలీస్ స్టేషన్‌లో నమోదైన ఈ కేసు, ఘటన తీవ్రత దృష్ట్యా తదుపరి విచారణ కోసం నారాయణగూడ పోలీస్ స్టేషన్‌కు బదిలీ చేయబడింది. ప్రస్తుతం నారాయణగూడ పోలీసులు ఈ ఘరానా మోసగాడి కోసం గాలింపు చర్యలను ముమ్మరం చేశారు. నిందితుడు షాద్ నగర్ వైపు వెళ్లినట్టు పోలీసులకు బలంగా అనుమానాలు ఉండటంతో, అతడిని పట్టుకునేందుకు ప్రత్యేక బృందాలు రంగంలోకి దిగాయి. త్వరలోనే ఈ సూర్యా భాయ్‌ని అరెస్ట్ చేసి కటకటాల వెనక్కి నెడతామని పోలీసులు ధీమా వ్యక్తం చేస్తున్నారు.

# లారీ ఢీకొని మహిళ మృతి..



చేగుంట,ఫ్లాష్ ఇండియా : రోడ్డు దాటుతున్న సమయంలో లారీ అతివేగంగా ఢీకొనడంతో మహిళ అక్కడికక్కడే మృతి చెందిన సంఘటన చేగుంట 44వ జాతీయ రహదారిపై శనివారం చోటుచేసుకుంది. చేగుంట ఎస్సై చైతన్యకుమార్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం... చేగుంట పట్టణానికి చెందిన కర్నే మంజుల (35) వ్యవసాయ పొలం వద్దకు రోజు మాదిరిగా వెళ్లి తిరిగి రోడ్డు దాటి ఇంటికి వస్తుండగా హైదరాబాదు నుంచి నిజామాబాద్ వైపు వెళుతున్న లారీ అతివేగంగా ఢీకొనడంతో మంజుల అక్కడికక్కడే మృతి చెందింది. మృతురాలు మంజులకు ఇద్దరు కూతురులు కొడుకు ఉన్నారు. భర్త కర్నె లచ్చయ్య ఫిర్యాదు మేరకు ఎస్సై కేసు నమోదు చేసుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తూప్రాన్ ఏరియా ఆసుపత్రికి తరలించి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వెల్లడించారు.

# ఉప్పల్ బాలు 'రీల్స్' రచ్చ..

అనంతగిరి,ఫ్లాష్ ఇండియా : సోషల్ మీడియాలో లైకులు, వ్యూస్ కోసం యువత ఎంతటి ప్రమాదకర స్టంట్స్ చేయడానికైనా వెనుకాడట్లేదు. తాజాగా ప్రముఖ సోషల్ మీడియా పర్సనాలిటీ 'ఉప్పల్ బాలు' వికారాబాద్ అనంతగిరి కొండల్లో చేసిన వింత చేష్టలు తీవ్ర దుమారం రేపాయి. ప్రశాంతమైన అటవీ, పుణ్యక్షేత్ర వాతావరణంలో రొడ్డుపై ఆగి ఉన్న కారుపైకెక్కి బాలు చేసిన రీల్స్‌పై అటవీ శాఖ అధికారులు సీరియస్ అవ్వడంతో.. చివరకు క్షమాపణలు చెప్పాల్సిన పరిస్థితి ఏర్పడింది.

**అసలేం జరిగిందంటే..?**

ప్రముఖ పర్యాటక ప్రాంతం, పుణ్యక్షేత్రమైన అనంతగిరి ఘాట్ రోడ్డుపై ఉప్పల్ బాలు తన అనుచరులతో కలిసి హల్ చల్ చేశాడు. దట్టమైన అటవీ ప్రాంతంలో మహీంద్రా థార్ కారు టాప్, బోనెట్ మీద కూర్చొని రీల్స్ చేశాడు. రొడ్డుపై రీల్స్ చేయడంతో ఆ ప్రాంతంలో చాలా మంది గుమిగూడారు. అతను రీల్స్ చేసే సమయంలో ఒక బైకర్‌కు అడ్డుగా వెళ్లినట్లు వీడియోలో కన్పిస్తోంది. ఈ వీడియోలు కాస్తా సోషల్ మీడియాలో విపరీతంగా వైరల్ కావడంతో స్థానికులు, భక్తులు మండిపడ్డారు. రొడ్డుపై హల్ చల్ చేసిన బాలుపై కఠిన చర్యలు తీసుకోవాలని నెటిజన్లు సైతం డిమాండ్ చేశారు.

**రంగంలోకి అటవీ అధికారులు.. కేసు నమోదు!**

ఈ వ్యవహారంపై వికారాబాద్ అటవీ శాఖ అధికారులు తక్షణమే స్పందించారు. అభయారణ్య పరిధిలోకి వచ్చే అనంతగిరి కొండల్లో ఇలాంటి ప్రమాదకరమైన స్టంట్స్ చేయడం చట్టవిరుద్ధమని స్పష్టం చేస్తూ.. ఉప్పల్ బాలుపై అధికారికంగా కేసు నమోదు చేసినట్లు సమాచారం. అంతేకాకుండా, వీడియోలో ఉన్న కారును గుర్తించి, దానికి సంబంధించిన వ్యక్తులను కూడా విచారించే పనిలో పడ్డారు. వ్యూస్ కోసం పర్యాటకుల భద్రతకు, పర్యావరణానికి ముప్పు తెస్తే ఏమాత్రం ఉపేక్షించేది లేదని అధికారులు గట్టి హెచ్చరికలు జారీ చేశారు.

# తెలంగాణ ప్రభుత్వ నిర్ణయంపై ట్రంప్ ఫిదా!

హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా : హైదరాబాద్ నగరంలో తన పేరు మీద ఒక రోడ్డుకు నామకరణం చేయడంపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సంతోషం వ్యక్తం చేశారు. భారతదేశం తనకు అందించిన ఈ గౌరవంపై స్పందిస్తూ, ఇది ఒక "అపూర్వమైన గౌరవం" అని అభివర్ణించారు. ఈ మేరకు ట్రంప్ తన సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ 'ట్రూత్ సోషల్' లో ఒక పోస్ట్‌ను పంచుకున్నారు. హైదరాబాద్‌లో జరిగిన ప్రారంభోత్సవ వేడుకకు సంబంధించిన ఓ ఫోటోను షేర్ చేస్తూ.. "భారతదేశంలోని హైదరాబాద్‌లో కొత్తగా ఏర్పాటైన డొనాల్డ్ ట్రంప్ అవెన్యూ. ఈ రకమైన గౌరవం పొందిన మొట్టమొదటి యూఎస్ ప్రెసిడెంట్ నేనే. ధన్యవాదాలు! ప్రెసిడెంట్ డొనాల్డ్ జె. ట్రంప్" అంటూ ఆయన కృతజ్ఞతలు తెలిపారు. అమెరికా రాయబార కార్యాలయం (యూఎస్ కాన్సులేట్) కు ఆనుకుని ఉన్న ఓ ప్రధాన రహదారికి తెలంగాణ ప్రభుత్వం అధికారికంగా డొనాల్డ్ ట్రంప్ అవెన్యూగా పేరు మార్చిన కొద్ది రోజులకే ట్రంప్ నుంచి ఈ స్పందన వచ్చింది. హైదరాబాద్ నగరానికి ఉన్న అంతర్జాతీయ గుర్తింపును మరింత పెంపొందించడానికి, భారత్-అమెరికా మధ్య ఉన్న బలమైన సంబంధాలను చాటిచెప్పడానికి తెలంగాణ ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. గ్లోబల్ టెక్నాలజీ కంపెనీలు, యూఎస్ డిప్లొమాటిక్ మిషన్ ఉన్న హైదరాబాద్ ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్ పరిధిలోని నానక్‌రామ్‌గూడలో ఈ అవెన్యూ ఉంది. హైదరాబాద్‌కు, యునైటెడ్ స్టేట్స్‌కు మధ్య ఉన్న బంధానికి ప్రతీకగానే ఈ నామకరణం చేసినట్లు అధికారులు పేర్కొన్నారు. అమెరికా స్వాతంత్ర్యానికి 250 ఏళ్లు పూర్తవుతున్న సందర్భంగా నిర్వహించిన వేడుకల్లో భాగంగా ఈ వారంలోనే ఈ రోడ్డు నామఫలకాన్ని ఆవిష్కరించారు. భారత్‌లో అమెరికా రాయబారి సెర్గియో గోర్ తో పాటు తెలంగాణ ప్రభుత్వ ఉన్నతాధికారుల సమక్షంలో ఈ కార్యక్రమం వైభవంగా జరిగింది. హైదరాబాద్‌లోని కీలకమైన రహదారులు, ప్రభుత్వ మౌలిక సదుపాయాలకు ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందిన ప్రముఖులు, సంస్థల పేర్లు పెట్టాలని తెలంగాణ ప్రభుత్వం భావించింది. అందులో భాగంగానే ఈ నిర్ణయం తీసుకున్నారు. గతంలో యూఎస్-ఇండియా స్ట్రాటజిక్ పార్టనర్‌షిప్ ఫోరమ్‌లో ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. హైదరాబాద్‌ను అంతర్జాతీయ స్థాయి ల్యాండ్‌మార్క్‌లతో తీర్చిదిద్దుతామని ప్రకటించారు. కాగా, ఒక అమెరికా అధ్యక్షుడికి భారత్‌లో ఈ తరహా గౌరవం దక్కడం ఇదే తొలిసారి కావడంతో, ట్రంప్ చేసిన ఈ పోస్ట్ నెట్టింట విపరీతంగా ట్రెండ్ అవుతోంది.

# సారథే ఈ సేవలకు యజమాని

గుజరాత్ : దేశ రవాణా రంగంలో సహకార విప్లవానికి నాంది పలుకుతూ కేంద్ర హోం, సహకార శాఖల మంత్రి అమిత్ షా గుజరాత్‌లో సరికొత్త రవాణా సేవలను ప్రారంభించారు. శనివారం గాంధీనగర్‌లోని మహాత్మా మందిరంలో జరిగిన ఒక ప్రత్యేక కార్యక్రమంలో భారతదేశపు మొట్టమొదటి సహకార ఆధారిత రైడ్-హెయిలింగ్ డిజిటల్ ప్లాట్‌ఫామ్ 'భారత్ టాక్సీ' సేవలను ఆయన అధికారికంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో గుజరాత్ ముఖ్యమంత్రి భూపేంద్ర పటేల్, ఉప ముఖ్యమంత్రి హర్ష్ సంఘ్వీ తో పాటు సహకార రంగానికి చెందిన ప్రముఖులు, వేలాది మంది డ్రైవర్లు పాల్గొన్నారు.

**'సారథే ఈ సేవలకు యజమాని'**

'సహకార్ సే సమృద్ధి' (సహకారం ద్వారా శ్రేయస్సు) అనే నినాదంతో, ప్రధానమంత్రి నరేంద్ర మోడీ దూరదృష్టికి అనుగుణంగా ఈ సరికొత్త ప్లాట్‌ఫామ్ రూపుదిద్దుకుంది. ఈ సందర్భంగా అమిత్ షా మాట్లాడుతూ.. ప్రైవేట్ యాప్ ఆధారిత టాక్సీ సంస్థల చేతుల్లో వాహన చోదకులు (డ్రైవర్లు), వినియోగదారులు ఇద్దరు తీవ్ర దోపిడీకి గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆ దోపిడీ వ్యాపార నమూనాకు చరమగీతం పాడటానికే 'భారత్ టాక్సీ'ని తీసుకువచ్చామని, దీంతో డ్రైవర్లే యజమానులుగా కొనసాగుతారని అమిత్ షా చెప్పుకొచ్చారు.

# తెలంగాణ సీఎంవోలో మరో వికెట్ అవుట్..

హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా : తెలంగాణ ముఖ్యమంత్రి కార్యాలయంలో భారీ ప్రక్షాళన కొనసాగుతోంది. పరిపాలనా విభాగంలో గడిచిన రెండు రోజులుగా జరుగుతున్న ఊహించని మార్పులు రాష్ట్ర రాజకీయ, బ్యూరోక్రాటిక్ వర్గాల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారాయి. సీఎంవోలో కీలక అధికారిగా ఉన్న ముఖ్యమంత్రి ప్రిన్సిపల్ సెక్రటరీ కె.ఎస్. శ్రీనివాస్ రాజును ఆ బాధ్యతల నుంచి తప్పిస్తూ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. సీఎం ప్రిన్సిపల్ సెక్రటరీగా ఉన్న శ్రీనివాస్ రాజును తెలంగాణ రియల్ ఎస్టేట్ రెగ్యులేటరీ అథారిటీ చైర్మన్ పోస్టుకు బదిలీ చేస్తూ ప్రభుత్వం తాజా ఉత్తర్వులు జారీ చేసింది. ఇప్పటివరకు సీఎంవోలో అత్యంత కీలకమైన మౌలిక వసతులు, ప్రాజెక్టుల వ్యవహారాలను పర్యవేక్షించిన ఆయనను.. అకస్మాత్తుగా 'రెరా' చైర్మన్‌గా నియమించడం వెనుక బలమైన పరిపాలనా పరమైన కారణాలు ఉన్నట్లు సచివాలయ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది.

**నిన్న అజిత్ రెడ్డి.. నేడు శ్రీనివాస్ రాజు**

నిన్నటివరకు ఇన్వెస్ట్ తెలంగాణ సీఈఓగా ఉన్నబి. అజిత్ రెడ్డిని ఆ బాధ్యతల నుంచి తొలగించి, మెట్రో రైల్ అదనపు ఎండీగా పూర్తి అదనపు బాధ్యతలు అప్పగించిన సంగతి తెలిసిందే. ఆ వేడి చల్లారక ముందే.. సరిగ్గా మరుసటి రోజే సీఎంవోలో మరో కీలక వికెట్ పడిపోవడం గమనార్హం. శ్రీనివాస్ రాజు వంటి సీనియర్ అధికారిని సీఎం కార్యాలయం నుంచి లూప్ లైన్ లాంటి 'రెరా'కు పంపడం బ్యూరోక్రాటిక్ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారింది. వరుసగా జరుగుతున్న ఈ బదిలీలు, బాధ్యతల మార్పులను గమనిస్తే.. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తన కార్యాలయాన్ని పూర్తిగా ప్రక్షాళన చేసే పనిలో పడ్డట్లు స్పష్టమవుతోంది. రాబోయే రోజుల్లో సీఎంవోలో మరికొన్ని కీలక మార్పులు చోటు చేసుకునే అవకాశం ఉందని, ఇదంతా ఒక వ్యూహం ప్రకారమే జరుగుతోందని విశ్లేషకులు భావిస్తున్నారు. ఈ వరుస పరిణామాలు సచివాలయ వర్గాల్లో పెను సంచలనానికి దారితీశాయి.

# మహా 'టెట్' పరీక్ష వాయిదా

మహారాష్ట్ర : మహారాష్ట్రలో మరో పేపర్ లీక్ ఘటన వెలుగుచూసింది. ఆదివారం జరగాల్సిన టీచర్స్ ఎలిజిబిలిటీ టెస్ట్ ప్రశ్నపత్రం పరీక్షకు 24 గంటల ముందే లీక్ కావడంతో అధికారులు అప్రమత్తమై పరీక్షను వాయిదా వేశారు. థానే జిల్లాలోని భివండీ ప్రాంతంలో పేపర్ లీక్ వ్యవహారం జరుగుతున్నట్లు అందిన రహస్య సమాచారంతో పోలీసులు దాడులు నిర్వహించారు.

**పలువురు అదుపులో.. పత్రాల స్వాధీనం**

ఈ దాడుల్లో కొందరి వద్ద నుంచి పరీక్షకు సంబంధించిన పలు కీలక పత్రాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం. ఆ పత్రాలు టెట్ అసలు ప్రశ్నపత్రంతో సరిపోలినట్లు 'మహారాష్ట్ర స్టేట్ కౌన్సిల్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ ' అధికారులు నిర్ధారించినట్లు జాతీయ మీడియా సమాచారం. ఈ వ్యవహారంతో సంబంధం ఉందన్న అనుమానంతో పలువురిని అదుపులోకి తీసుకున్న పోలీసులు.. అసలు పేపర్ ఎలా లీక్ అయింది? దీని వెనుక భారీ ముఠా ఏమైనా ఉందా? అనే కోణంలో దర్యాప్తు ముమ్మరం చేశారు.

**కొత్త తేదీలు త్వరలో..**

పేపర్ లీక్ నిర్ధారణ కావడంతో పరీక్ష పారదర్శకతను దృష్టిలో ఉంచుకుని ఆదివారం జరగాల్సిన టెట్ పరీక్షను వాయిదా వేస్తున్నట్లు విద్యాశాఖ ప్రకటించింది. త్వరలోనే కొత్త పరీక్ష తేదీని వెల్లడిస్తామని, అభ్యర్థులు అధికారిక వెబ్‌సైట్ ద్వారా వచ్చే అప్‌డేట్స్ కోసం వేచి చూడాలని సూచించింది. కాగా, ఇప్పటికే దేశంలో నీట్ యూజీ పేపర్ లీక్ ఘటన సంచలనంగా మారిన విషయం తెలిసిందే. ఈ వ్యవహారంలో అరెస్ట్ అయిన వారిలో మహారాష్ట్రకు చెందిన వారు ఉండటం విశేషం.

ఫ్లాష్ ఇండియా దినపత్రిక బుక్ చేసుకోవాలి అనుకుంటున్నారా లేదా మీ వ్యాపార ప్రకటనల కోసం మమ్మల్ని సంప్రదించండి 7730032999 flashindiadaily@gmail.com

# ఆ ప్రచారం నమ్మొద్దు..

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** ఆర్టీసీ కార్మికులకు ప్రభుత్వం ఇచ్చిన ప్రతి హామీని అమలు చేస్తోందని మంత్రి పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారు. కొంతమంది కార్మిక సంఘాల నాయకులు వాస్తవాలను వక్రీకరిస్తూ కార్మికులను, ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేయడం బాధాకరమని ఆయన అన్నారు. ఈ మేరకు కార్మిక సంఘాల డిమాండ్లు, ఆర్టీసీ విలీన ప్రక్రియపై మంత్రి ఇవాళ ప్రెస్ నోట్ విడుదల చేశారు. ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క నేతృత్వంలో మంత్రులు పొన్నం ప్రభాకర్, శ్రీధర్ బాబు, వివేక్ వెంకటస్వామి, అడ్లూరి లక్ష్మణ్ కుమార్‌తో కలిసి చీఫ్ సెక్రటరీ రామకృష్ణారావుతో పాటు సీనియర్ ఐఏఎస్ అధికారులు ఫైనాన్స్ ప్రిన్సిపల్ సెక్రటరీ సందీప్ కుమార్ సుల్తానియా, రవాణా శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ వికాస్ రాజ్, లేబర్ అండ్ ఎంప్లాయిమెంట్ ప్రిన్సిపల్ సెక్రటరీ దానా కిషోర్, ఆర్టీసీ ఎండీ నాగిరెడ్డి, ఇతర ఆర్టీసీ ఉన్నతాధికారులు, ప్రతి కార్మిక సంఘం నుంచి ఇద్దరు చొప్పున దాదాపు 30 మంది కార్మిక సంఘాల ప్రతినిధులతో సుదీర్ఘంగా 14 గంటల పాటు చర్చించి అందరి ఆమోదంతో ఏకగ్రీవ నిర్ణయాలు తీసుకున్నామని మంత్రి గుర్తు చేశారు.

**అందుకే యూనియన్ ఎన్నికలు:**

సమావేశంలో మొత్తం 32 డిమాండ్లలో 29 అంశాలు ఆర్టీసీ యాజమాన్యం పరిధిలో, మూడు అంశాలు ప్రభుత్వ పరిధిలో ఉన్నట్లు నిర్ణయించడం జరిగిందన్నారు. యాజమాన్యం పరిధిలో ఉన్న 29 అంశాల పరిష్కారానికి ఈడిల కమిటీ ద్వారా ఇప్పటికే చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. ప్రభుత్వ పరిధిలో ఉన్న మూడు కీలక అంశాలైన ఆర్టీసీ గుర్తింపు సంఘాల ఎన్నికలు, 2021 పీఆర్సీ, ఆర్టీసీ ప్రభుత్వంలో విలీనం, పీఆర్సీ విషయంలో ప్రభుత్వం ప్రకటించిన 11 శాతం జూలై నెల జీతాల నుంచే అమల్లోకి రానుందని తెలిపారు. ఆర్టీసీ కార్మికుల మొదటి డిమాండ్ ఆర్టీసీ గుర్తింపు సంఘాలు ఎన్నికలు అని ఇప్పుడు మాట మార్చి ప్రజలను,కార్మికులను పక్కదోవ పట్టించడం సరికాదన్నారు. ఆర్టీసీ విలీనానికి సంబంధించి విధివిధానాలు రూపొందించే అధికారుల కమిటీలో కార్మిక ప్రతినిధులు తప్పనిసరిగా ఉండాలని సమావేశంలో కార్మికులు ఏకగ్రీవంగా నిర్ణయించారని మంత్రి పేర్కొన్నారు. అయితే ఆ కమిటీలో ఉండే కార్మిక నాయకులు గుర్తింపు పొందిన సంఘం నుంచి ఉండాలంటే ముందుగా గుర్తింపు సంఘాల ఎన్నికలు నిర్వహించాలనే నిర్ణయం అందరి సమక్షంలో తీసుకున్నామని వెల్లడించారు.

**ఏపీలో మాదిరిగా కాకూడదనే:**

ఇందులో భాగంగానే ప్రభుత్వం ఇప్పటికే గుర్తింపు సంఘాల ఎన్నికల ప్రక్రియను ప్రారంభించిందని, లేబర్ జాయింట్ కమిషనర్ సునీతను ఎన్నికల నోడల్ అధికారిగా నియమించినట్లు తెలిపారు. ఎన్నికల షెడ్యూల్ విడుదల చేసి త్వరలోనే గుర్తింపు సంఘాల ఎన్నికలు నిర్వహించే దిశగా వెరిఫికేషన్ ప్రక్రియ కొనసాగుతుందని చెప్పారు. కార్మికుల ప్రయోజనాలను కాపాడేందుకే ముందుగా గుర్తింపు సంఘాల ఎన్నికలు నిర్వహించి, ఆ సంఘం నుంచి ప్రతినిధులను విలీన కమిటీలో చేర్చే ప్రక్రియను ప్రభుత్వం అనుసరిస్తోందన్నారు. ఆంధ్రప్రదేశ్ మాదిరి విలీనం తర్వాత ఇబ్బందులు కలగవద్దని గుర్తింపు కార్మిక సంఘాల నేతలను కమిటీలో చేర్చి విధివిధానాలు రూపొందించేలా నిర్ణయం తీసుకున్నామన్నారు. ఈ పరిస్థితుల్లో కొంతమంది కార్మిక సంఘాల నాయకులు గుర్తింపు సంఘాల ఎన్నికలు జరగకుండా, విలీన ప్రక్రియను కూడా వివాదాస్పదం చేసేలా వ్యవహరించడం సరికాదని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. ప్రభుత్వం ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చేందుకు చిత్తశుద్ధితో పనిచేస్తోందని, కార్మికులు వాస్తవాలను గుర్తించి అసత్య ప్రచారాలను నమ్మవద్దని విజ్ఞప్తి చేశారు. మాట మీద నిలబడే కాంగ్రెస్ ప్రభుత్వం విలీన ప్రక్రియ గురించి భవిష్యత్‌లో ఇబ్బందులు తలెత్తకుండా ఉండాలని గుర్తింపు సంఘం కార్మిక నేతలను కమిటీలో చేర్చి విలీన విధివిధానాలు రూపొందించాలని భావిస్తుందని దీనిని కార్మికులంతా గమనించాలన్నారు.

# ముగ్గురు సీఎంల చీకటి ఒప్పందాలేంటి?

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** కర్ణాటకలో జరిగిన తుంగభద్ర గేట్ల ప్రారంభోత్సవం సందర్భంగా ముగ్గురు సీఎంల రహస్య భేటీ వివరాలు బయట పెట్టాలని తెలంగాణ ప్రభుత్వాన్ని మాజీ మంత్రి హరీశ్ రావు డిమాండ్ చేశారు. ఈ భేటీలో చారిత్రక ఒప్పందం అంటున్న రేవంత్ రెడ్డి ఆ వివారలు ప్రజలకు చెప్పాలన్నారు. ఇవాళ తెలంగాణ భవన్ లో మీడియాతో మాట్లాడిన హరీశ్ రావు కర్ణాటకతో రేవంత్ రెడ్డి కుమ్మక్కయ్యారన్న అనుమానం కలుగుతోందన్నారు. ఈ భేటీలో తెలంగాణ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డిని బయట కూర్చొబెట్టారని, తెలంగాణ నీటిపారుదల శాఖ మంత్రిని కూడా బయటే ఉంచేంత సీక్రెట్‌అందులో ఏముంది? మన రాష్ట్రానికి చెందిన ఇంజనీర్లు, మన ఈఎన్సీని కూడా లోపలికి ఎందుకు రానివ్వలేదని ప్రశ్నించారు. ఇంజనీర్లను, నీళ్ల మంత్రిని బైట ఉంచి మీరు ముగ్గురు గంటసేపు ఏం మాట్లాడుకున్నారో? దాని వల్ల తెలంగాణకు జరిగే ప్రయోజనం ఎందో అసెంబ్లీ వేదికగా బయటపెట్టాలని డిమాండ్ చేశారు.

**అఖిలపక్షానికి డిమాండ్:**

కర్ణాటకతో ఒప్పందాలపై అఖిలపక్ష సమావేశం నిర్వహించాలని హరీశ్ రావు డిమాండ్ చేశారు. రాష్ట్ర భవిష్యత్ సీఆర్ పాటిల్ చేతిలో ఎలా పెడతారని ప్రశ్నించారు. చంద్రబాబు ఏది చెబితే కేంద్రం అదే వింటుందని, చంద్రబాబు పలుకుపడితో ఏపీ వ్యక్తిని కేంద్ర ఇరిగేషన్ అధికారిగా నియమించారని ఆరోపించారు. నదీ జలాలపై కనీస అవగాహన లేని ముఖ్యమంత్రి అజ్ఞానం.. నేడు తెలంగాణకు మరణ శాసనంగా మారిందన్నారు. కేసీఆర్ పోరాడి సాధించిన ప్రాజెక్టుల అనుమతులను గాలికి వదిలేసి.. తన రాజకీయ స్వార్థం కోసం రాష్ట్ర భవిష్యత్తును రేవంత్ రెడ్డి ఢిల్లీ పెద్దల కాళ్ల దగ్గర తాకట్టు పెడుతున్నారని కర్ణాటక, ఏపీ అక్రమ ప్రాజెక్టులతో తెలంగాణను ముంచుతుంటే.. అడ్డుకోవాల్సిన సీఎం వారితో కలిసి సంబరాలు చేసుకోవడం సిగ్గుచేటని మండిపడ్డారు. దీర్ఘకాలిక రాష్ట్ర ప్రయోజనాలను రేవంత్ రెడ్డి దెబ్బతీస్తున్నారని పోరాడి సాధించుకున్న తెలంగాణ రాష్ట్రానికి అన్యాయం జరిగితే ఊరుకునేది లేదని హెచ్చరించారు.

**ముంపు మేస్త్రివి కావొద్దు:**

నదుల అనుసంధానం పేరిట ఏపీ జలదోపిడీకి రెడ్ కార్పెట్ వేస్తూ.. తెలంగాణ సమ్మక్క సాగర్ ప్రాజెక్టును రేవంత్ బలిపెడుతున్నాడని కూలగొట్టే హైడ్రాకు 'హిట్లర్' స్ఫూర్తన్న రేవంత్ రెడ్డి.. మన నీళు ఎత్తుకుపోతుంటే ఫిడేల్ వాయించిన 'నీరో చక్రవర్తి'లా చోద్యం చూస్తున్నాడని ఎద్దేవా చేశారు. కేసీఆర్ తొమ్మిదిన్నరేళ్లలో ఏకంగా 383 టీఎంసీల అనుమతులు సాధిస్తే ఈ కాంగ్రెస్ సర్కార్ రెండున్నరేళ్లలో కనీసం ఒక్క టీఎంసీకి కూడా అనుమతి సాధించలేదన్నారు. ట్రిబ్యునల్స్ ముందు గట్టిగా వాదనలు వినిపించి, మంచి లాయర్లను పెడితే 700-800 టీఎంసీలు సాధించే అవకాశముందన్నారు. రేవంత్ రెడ్డి నువ్వు గుంపు మేస్త్రివి అయినా మాకు అభ్యంతరం లేదు కానీ తెలంగాణను ముంచే 'ముంపు మేస్త్రివి' కావద్దని సూచించారు.

# గులాబీ జెండా ఎగరడం ఖాయం

**మహేశ్వరం,ఫ్లాష్ ఇండియా :** రంగారెడ్డి జిల్లా మహేశ్వరం నియోజకవర్గ బీఆర్ఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశం శనివారం ఘనంగా జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారకరామారావు (కేటీఆర్).. ఎస్.ఐ.ఆర్ తో పాటు బీఆర్ఎస్ పార్టీ సభ్యత్వ నమోదుపై పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. మహేశ్వరంలో బీఆర్ఎస్ కార్యకర్తల జోష్ చూస్తుంటే వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీ విజయం ఖాయమనిపించడమే కాకుండా, కేసీఆర్ గారు మళ్లీ ముఖ్యమంత్రి అయినట్లు భావన కలుగుతోందని ఆయన వ్యాఖ్యానించారు. మహేశ్వరంలో మరోసారి సబిత ఇంద్రారెడ్డి గెలుపు తథ్యమని తేలిపోయిందని, అసెంబ్లీ ఎన్నికలు ఎప్పుడొచ్చినా కాంగ్రెస్ బంగాళాఖాతంలో కలవడం, బీఆర్ఎస్ గెలవడం పక్కా అని ధీమా వ్యక్తం చేశారు. ప్రస్తుతం తెలంగాణ నలుదిశలా "కాంగ్రెస్ పోవాలె.. కేసీఆర్ రావాలె" అనే ఒకే నినాదం మారుమోగుతోందని కేటీఆర్ స్పష్టం చేశారు.

**కాంగ్రెస్ పాలనలో విధ్వంసం.. రేవంత్ రెడ్డిపై 'హిట్లర్ రెడ్డి' అంటూ ధ్వజం**

రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక వికాసం పోయి విధ్వంసం, విషాదం మాత్రమే మిగిలాయని కేటీఆర్ తీవ్రంగా విమర్శించారు. కేసీఆర్ కిట్ పోయి కరెంటు కోతల కాలం వచ్చిందని, రైతు బంధు పోయి 'రాహుల్ బంధు' వచ్చిందని ఎద్దేవా చేశారు. రాష్ట్రంలో సంక్షేమ పథకాలకు పాతర వేసి కుంభకోణాల జాతర నడిపిస్తున్నారని మండిపడ్డారు. సీఎంగా రేవంత్ రెడ్డి ఉన్నప్పటికీ ప్రజలు మాత్రం కేసీఆర్ గారినే తలుచుకుంటున్నారని పేర్కొన్నారు. తెలంగాణ ఉద్యమంలో మహేశ్వరం ముద్దుబిడ్డ సిరిపురం యాదయ్య ఓయూ వద్ద రాష్ట్ర సాధన కోసం ప్రాణత్యాగం చేశారని గుర్తుచేస్తూ, ఎంతోమంది అమరవీరుల త్యాగాల స్ఫూర్తితోనే కేసీఆర్ పదేళ్ల పాటు ప్రజాసంక్షేమం, ప్రగతిపథాన్ని రెండు జోడెడ్లలా ముందుకు సాగించారన్నారు. పొరపాటునో, గ్రహపాటునో ఇప్పుడు ఒక తెలంగాణ ద్రోహి ముఖ్యమంత్రి అయ్యాడని, ఒక పిచ్చోడి చేతిలో రాళ్లు ఉంటే చుట్టుపక్కల వారికి నష్టమైతే, రాష్ట్రం ఉంటే నాలుగు కోట్ల ప్రజలకు నష్టమని వ్యాఖ్యానించారు. తనకు హిట్లరే ఆదర్శమని రేవంత్ రెడ్డి స్వయంగా ఒప్పుకున్నాడని, అందుకే ఆయన పేరు ఇక నుంచి 'హిట్లర్ రెడ్డి' అని కేటీఆర్ అభివర్ణించారు.

**420 అబద్ధాలతో గద్దెనెక్కారు.. కేసీఆర్ చేసిన అప్పులపై వివరణ**

అసెంబ్లీ ఎన్నికల్లో రేవంత్ రెడ్డి రజనీకాంత్‌ను మించిన డైలాగులు కొట్టారని, భట్టి విక్రమార్క కమల్ హాసన్‌ను మించి యాక్టింగ్ చేసి, 420 అబద్ధాలతో ప్రజలను మభ్యపెట్టి గద్దెనెక్కారని కేటీఆర్ ఆరోపించారు. వంద రోజుల్లో అమలు చేస్తామన్న గ్యారెంటీ కార్డు రెండున్నరేళ్లయినా నాలుక గీసుకోవడానికి కూడా పనికిరావడం లేదని ఎద్దేవా చేశారు. రైతుబంధు 15 వేలు చేస్తామని చెప్పి, ఇప్పుడు కనీసం యూరియా కూడా ఇవ్వలేకపోతున్నారని, రంగారెడ్డి, మల్కాజిగిరి జిల్లాల రైతులను ఈ ప్రభుత్వం పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన అప్పులపై అబద్ధాలు ప్రచారం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తంచేసిన కేటీఆర్.. తెలంగాణ వచ్చేనాటికి అప్పు 72 వేల కోట్లు ఉంటే, పదేళ్లలో కేసీఆర్ చేసిన అప్పు కేవలం 2 లక్షల 80 వేల కోట్లు మాత్రమేనని, అంటే ఏడాదికి 28 వేల కోట్లు మాత్రమేనని స్పష్టం చేశారు. కేసీఆర్ గారు అప్పు చేసి 1020 గురుకుల పాఠశాలలు పెట్టి ఆరున్నర లక్షల మంది పిల్లలకు అత్యుత్తమ విద్య అందించారని, లక్ష కోట్లతో కరెంట్ కష్టాలు తీర్చారని, కల్యాణలక్ష్మి ద్వారా 14 లక్షల మంది ఆడబిడ్డలకు పెళ్లిళ్లు చేశారని గుర్తు చేశారు. అలాగే పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టును 90 శాతం పూర్తి చేశారని, కొత్తగా కలెక్టరేట్లు, మెడికల్ కాలేజీలు తెచ్చారని వివరించారు.

**ఢిల్లీకి మూటలు.. కేటీఆర్ ఓపెన్ ఛాలెంజ్**

రెండున్నరేళ్లలో నాలుగు లక్షల కోట్ల అప్పు చేసిన రేవంత్ రెడ్డి రాష్ట్రంలో ఒక్క ఇటుక కూడా పేర్చలేదని కేటీఆర్ ధ్వజమెత్తారు. కొనుగోలు కేంద్రాల్లో రైతులకు సంచులు ఇచ్చే ముఖం కూడా ముఖ్యమంత్రికి లేదని, ఆ సంచులన్నీ ఢిల్లీకి పోతున్నాయని ఆరోపించారు. కేసీఆర్ గారు 72 వేల కోట్లు రైతుల ఖాతాల్లో వేస్తే.. రేవంత్ రెడ్డి 30 నెలల్లో 72 సార్లు ఢిల్లీకి చక్కర్లు కొట్టారని, రేవంత్ రెగ్యులర్ సీఎం కాదు 'రెన్యూవల్ సీఎం' అని ఎద్దేవా చేశారు. తెలంగాణ నుంచి వేల కోట్లు ఢిల్లీకి పోతున్నా పైసా తిరిగి రావడం లేదన్నారు. కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేస్తానంటున్న రేవంత్‌కు నిజాయితీ ఉంటే.. రాష్ట్రంలోని కోటి 67 లక్షల మంది ఆడబిడ్డలకు నెలకు 2500 చొప్పున ఐదేళ్లకు ఇవ్వాల్సిన 1.50 లక్షల రూపాయలు వేయాలని, అలా వేస్తే తాను శాశ్వతంగా రాజకీయ సన్యాసం చేస్తానని సవాల్ విసిరారు.

**ఫార్మా సిటీ రద్దుపై మాట మార్చారు.. కార్యకర్తలకు పిలుపు**

ఫ్యూచర్ సిటీ, ఫోర్త్ సిటీ పేరిట అన్నదమ్ములు విలువైన భూములను దోచుకుంటున్నారని కేటీఆర్ ఆరోపించారు. కేసీఆర్ గారు ఎంతో దార్శనికతతో, 5 లక్షల మందికి ఉద్యోగాలు వచ్చేలా ఏడేళ్లు శ్రమించి మహేశ్వరం, ఇబ్రహీంపట్నంలో రైతులను ఒప్పించి 14 వేల ఎకరాల భూమిని సేకరించి అంతర్జాతీయ ప్రమాణాలతో ఫార్మా సిటీని ప్లాన్ చేశారన్నారు. నాడు కాంగ్రెస్ నేతలు ప్రజలను రెచ్చగొట్టి, ఫార్మా సిటీ రద్దు చేసి భూములు రైతులకు ఇస్తామని చెప్పి, ఇప్పుడు ఆ భూములు వెనక్కి ఇచ్చేది లేదని మాట మార్చారని మండిపడ్డారు. రెండున్నరేళ్లలో ఇంచు భూమైనా రైతులకు ఇవ్వకుండా మొత్తం రియల్ ఎస్టేట్ దందా చేస్తున్నారని విమర్శించారు. రేవంత్ రెడ్డి ఫ్యూచర్‌కే దిక్కులేదని, రాహుల్ గాంధీకి కోపం వస్తే రేవంత్ ఫ్యూచర్ ఏమవుతుందో ఎవరికీ తెలియదన్నారు. చివరగా, కార్యకర్తలే కథానాయకులై కదంతొక్కితే ప్రతి బూత్‌లో బీఆర్ఎస్‌కే మెజారిటీ వస్తుందని, ఎస్.ఐ.ఆర్. కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ సీరియస్ గా తీసుకుని అర్హులైన ఓటర్ల పేర్లు తొలగించకుండా అప్రమత్తంగా ఉండాలని పిలుపునిచ్చారు. డిజిటల్ రూపంలో పార్టీ సభ్యత్వ నమోదును పెద్దఎత్తున విజయవంతం చేయాలని, ప్రతి కార్యకర్తకు ప్రత్యేక గుర్తింపు కార్డు ఇచ్చి గౌరవిస్తామని కేటీఆర్ స్పష్టం చేశారు.

# కాంగ్రెస్ ఫెయిల్యూర్ గవర్నమెంట్..



**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** అజారుద్దీన్ మైనారిటీ వెల్ఫేర్ శాఖ మంత్రి, ఫయూమ్ ఖురేషీ మైనారిటీ గురుకులాల వైస్ చైర్మన్‌గా ఉన్నా మైనారిటీ గురుకులాలు నిర్వీర్యం అయ్యాయని మాజీ డిప్యూటీ సీఎం మహమూద్ అలీ అన్నారు. శనివారం ఆయన తెలంగాణ భవన్‌లో మీడియాతో మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీది ఫెయిల్యూర్ గవర్నమెంట్ అని విమర్శించారు. కేసీఆర్ సీఎంగా ఉన్నప్పుడు గురుకులాలు ప్రథమ స్థానంలో నిలిచాయని తెలిపారు. గోల్కొండ మైనారిటీ జూనియర్ కాలేజీలో ఒక బాలిక ప్రెగ్నెంట్ అయ్యి డెలివరీ అయిందని.. కాలేజీ ప్రిన్సిపాల్, వార్డెన్ ఈ విషయాన్ని పట్టించుకోలేదని ఆరోపించారు. పురిట్లోనే పసి బిడ్డను చంపారని.. ఈ ఘటనపై కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. గోల్కొండ మైనారిటీ జూనియర్ కాలేజీలో జరిగిన ఘటనను ప్రభుత్వం దాచిపెట్టిందన్నారు. గతంలోనూ మైనారిటీ గురుకుల పాఠశాలలో ఒక బాలిక మరణించిందని తెలిపారు. దీనిపై సీఎం, విద్యా శాఖ మంత్రి, డీజీపీ స్పందించాలని డిమాండ్ చేశారు. గోల్కొండ మైనారిటీ జూనియర్ కాలేజీలో జరిగిన ఘటనకు బాధ్యులైన వారిపై చర్యలు తీసుకోవాలన్నారు. బాధిత కుటుంబానికి న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు.

# తెలంగాణకు ప్రత్యేక ఉపాధి హామీ చట్టం..

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** గ్రామీణ పేదల జీవనోపాధికి వెన్నెముకగా నిలిచిన మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని నిర్వీర్యం చేస్తూ, రాష్ట్రాల అధికారాలను హరిస్తున్న కేంద్ర ప్రభుత్వ ప్రతిపాదిత వీబీ-జీ రామ్-జీ చట్టం--2025ను తెలంగాణ ప్రభుత్వం ఎట్టి పరిస్థితుల్లోనూ యథాతథంగా అంగీకరించబోదని రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. శనివారం రాష్ట్ర సచివాలయంలో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అధ్యక్షతన రెండో మంత్రివర్గ ఉపసంఘం సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి మంత్రులు సీతక్క, తుమ్మల నాగేశ్వరరావు, గడ్డం వివేక్ వెంకటస్వామి, పంచాయతీ రాజ్ ప్రత్యేక కార్యదర్శి దానకిశోర్, పంచాయతీ రాజ్ రూరల్ డెవలప్మెంట్ కమిషనర్ డి.దివ్య తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడారు.. ఇది కేవలం ఉపాధి హామీ చట్టం సవరణ కాదని, భారత రాజ్యాంగంలోని సమాఖ్య స్ఫూర్తిపైనే జరుగుతున్న ప్రత్యక్ష దాడి అని తీవ్రంగా విమర్శించారు.

**సుప్రీంకోర్టు వరకు వెళ్తాం:**

రాష్ట్ర ప్రభుత్వాల అధికారాలను క్రమంగా కేంద్రీకరించి, గ్రామీణాభివృద్ధిపై రాష్ట్రాల పాత్రను నిర్వీర్యం చేయాలనే ఉద్దేశంతో కేంద్రం ఈ చట్టాన్ని తీసుకొస్తోందని ఆయన ఆరోపించారు. తెలంగాణ రైతులు, వ్యవసాయ కూలీలు, గ్రామీణ పేదల భవిష్యత్తును తాకట్టు పెట్టే చట్టాన్ని తెలంగాణ ప్రభుత్వం తలవంచి అమలు చేయదు. ప్రజల ప్రయోజనాలే మాకు పరమావధి అని ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. ఈ చట్టంలోని అనేక నిబంధనలు రాజ్యాంగ విరుద్ధంగా ఉన్నాయని న్యాయ నిపుణులు ఉపసంఘానికి వివరించారని తెలిపారు. అవసరమైతే ఈ చట్టాన్ని సుప్రీంకోర్టులో సవాలు చేసే అంశాన్ని కూడా ప్రభుత్వం తీవ్రంగా పరిశీలిస్తోందని చెప్పారు. రాష్ట్రాల హక్కులను కాపాడేందుకు అవసరమైతే దేశ అత్యున్నత న్యాయస్థానం తలుపులు తడతామన్నారు. తెలంగాణ ఒక్కటే కాదు... సమాఖ్య వ్యవస్థను విశ్వసించే ఇతర రాష్ట్రాలతో కలిసి ఉమ్మడి పోరాటానికి సిద్ధంగా ఉన్నామన్నారు.

**తెలంగాణకు ప్రత్యేక చట్టం:**


కర్ణాటక, కేరళ ముఖ్యమంత్రులతో సంప్రదింపులు జరిపి, ఉమ్మడి న్యాయపరమైన, రాజకీయ కార్యాచరణపై చర్చించాలని ఉపసంఘం నిర్ణయించినట్లు వెల్లడించారు. సమావేశంలో పాల్గొన్న దాదాపు 20 పౌరసంఘాలు కేంద్ర ప్రతిపాదనను తీవ్రంగా వ్యతిరేకించాయని చెప్పారు. తెలంగాణ రాష్ట్రం స్వంత ఉపాధి హామీ చట్టాన్ని తీసుకురావాలని వారు సూచించారని తెలిపారు. 60 రోజుల ఉపాధి పరిమితిని పూర్తిగా వ్యతిరేకిస్తూ, ప్రతి గ్రామీణ కుటుంబానికి కనీసం 200 రోజుల హామీ ఉపాధి కల్పించాలని, చట్టబద్ధ కనీస వేతనాలు చెల్లించాలని పౌరసంఘాలు ప్రభుత్వాన్ని కోరాయని మంత్రి వివరించారు. కేంద్రం ప్రతిపాదించిన 60:40 నిధుల భాగస్వామ్య విధానం తెలంగాణపై వేల కోట్ల రూపాయల అదనపు భారం మోపే ప్రమాదం ఉందని, ఈ అంశాన్ని రాష్ట్ర న్యాయశాఖ క్షుణ్ణంగా పరిశీలిస్తుందని తెలిపారు. పనితీరు బాగున్న రాష్ట్రాలను శిక్షిస్తూ, వెనుకబడిన రాష్ట్రాలను ప్రోత్సహించేలా కేంద్రం రూపొందించిన నిధుల కేటాయింపు విధానం అన్యాయమని మంత్రి విమర్శించారు.

**జూలై2 న కేబినెట్‌లో కీలక నిర్ణయం:**

ఈ అంశంపై తెలంగాణ ప్రభుత్వం ఇప్పటికే కేంద్రానికి సమగ్ర సూచనలు పంపినా వాటిని పూర్తిగా విస్మరించడం బాధాకరమని అన్నారు. తెలంగాణ ప్రజల హక్కులు, రాష్ట్ర రాజ్యాంగబద్ధ అధికారాలు, గ్రామీణ పేదల జీవనోపాధిని కాపాడటం మా బాధ్యత. కేంద్రం ఏకపక్షంగా నిర్ణయాలు తీసుకుంటే తెలంగాణ చూస్తూ ఊరుకోదని ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. ఈ అంశంపై జూలై 2న జరిగే రాష్ట్ర మంత్రివర్గ సమావేశంలో సమగ్రంగా చర్చించి తుది నిర్ణయం తీసుకుంటామని ఆయన వెల్లడించారు. అవసరమైతే రాష్ట్ర చట్టం తీసుకురావడం, సుప్రీంకోర్టును ఆశ్రయించడం, ఇతర రాష్ట్రాలతో కలిసి ఉమ్మడి కార్యాచరణ చేపట్టడం వంటి అన్ని ప్రత్యామ్నాయాలను ప్రభుత్వం పరిశీలిస్తుందని స్పష్టం చేశారు.

# మహిళా రిజర్వేషన్ల కోసం మహాసభ

**హిమాయత్‌నగర్,ఫ్లాష్ ఇండియా :** చట్టసభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఢిల్లీలోని రామ్‌లీలా మైదానంలో భారీ మహిళా మహాసభ నిర్వహించాలని తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత పిలుపునిచ్చారు. శనివారం ఎన్‌సీఆర్‌డబ్ల్యూ ఆధ్వర్యంలో హిమాయత్‌నగర్‌లో నిర్వహించిన చట్టసభల్లో మహిళా రిజర్వేషన్స్ సాధన సభలో పాల్గొని ఆమె ప్రసంగించారు. మహిళా రిజర్వేషన్ బిల్లు పార్లమెంట్ ఆమోదం పొందినప్పటికీ ఇప్పటికీ అమలు చేయకపోవడం బాధాకరమని కవిత అన్నారు. బిల్లును పోస్ట్ డేటెడ్ చెక్‌లా మార్చారని, అమలులోకి తీసుకురావడానికి కేంద్ర ప్రభుత్వం కొర్రీలు పెడుతోందని విమర్శించారు. బిల్లు అమలుకు దేశవ్యాప్తంగా మహిళల శక్తిని ప్రదర్శించాల్సిన అవసరం ఉందన్నారు. అవసరమైతే హైదరాబాద్ నెక్లెస్ రోడ్‌లోనైనా, ఢిల్లీలోని రామ్‌లీలా మైదానంలోనైనా లక్షలాది మహిళలతో భారీ ఉద్యమం చేపడదామని పిలుపునిచ్చారు. మహిళలకు రాజకీయాల్లో నిజమైన సాధికారత రావాలంటే పవర్‌ఫుల్ స్థానాల్లో ఉండే అవకాశాలు కల్పించాల్సిందేనని ఆమె పేర్కొన్నారు.మహిళలు ఒక స్థాయి వరకు ఎదిగిన తర్వాత వారిని అడ్డుకునే పరిస్థితులు ఇప్పటికీ ఉన్నాయని, అందుకే చట్టబద్ధమైన రిజర్వేషన్లు అత్యవసరమని స్పష్టం చేశారు. 33 శాతం మహిళా రిజర్వేషన్లు తప్పకుండా సాధిస్తామని, అదే సమయంలో మహిళా నాయకత్వాన్ని పెంపొందించేందుకు ప్రత్యేక కార్యక్రమాలు కూడా చేపట్టాలని సూచించారు. 2022--23లో మహిళా రిజర్వేషన్ బిల్లు కోసం జంతర్‌మంతర్ వద్ద ధర్నా నిర్వహించామని, అంతేకాకుండా 18 రాజకీయ పార్టీలను ఈ అంశంపై పార్లమెంట్‌లో మాట్లాడేలా చేసి కేంద్రంపై ఒత్తిడి పెంచామని కవిత గుర్తుచేశారు. ఆ ఒత్తిడితోనే బిల్లుకు



ఆమోదం లభించిందని, అయితే అమలు మాత్రం ఇంకా జరగలేదని అన్నారు. మహిళల ఓట్లు రాజకీయ పార్టీలకు అత్యంత కీలకమని, మహిళల్లో చైతన్యం పెరిగిన నేపథ్యంలో వారిని ఆకర్షించేందుకు ప్రత్యేక పథకాలు ప్రకటిస్తున్నారని కవిత పేర్కొన్నారు. అయితే మహిళా రిజర్వేషన్ బిల్లు అమలు చేయని పార్టీలకు ఓట్లు వేయబోమనే ఉద్యమాన్ని మహిళలు ప్రారంభించాలని ఆమె పిలుపునిచ్చారు. మహిళల కోసం ధైర్యంగా ఒక అడుగు ముందుకేసి పార్టీ పెట్టానని.. మహిళలందరూ గర్వపడేలా, కాలర్ ఎగరేసుకునేలా మంచి రాజకీయాలు చేస్తానని హామీ ఇస్తున్నానని కవిత అన్నారు.

## సంపాదకీయం

# ఉపాధి హక్కు ఆర్థిక భారం మధ్య

గ్రామీణ భారతదేశంలో పేద కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించే అతిపెద్ద సామాజిక భద్రతా కార్యక్రమాల్లో ఉపాధి హామీ పథకం ఒకటి. రోజువారీ కూలి పనులపై ఆధారపడే లక్షలాది కుటుంబాలకు ఇది కేవలం ఉపాధి పథకం మాత్రమే కాదు; ఆకలి, వలసలు, అప్పుల నుంచి రక్షించే జీవనాధారం. అలాంటి పథకం అమలులో కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన కొత్త వీబీజీ రామ్‌జీ చట్టం ఇప్పుడు తెలంగాణలో కొత్త చర్చకు దారి తీసింది. రాష్ట్ర ప్రభుత్వం చట్టాన్ని పూర్తిగా వ్యతిరేకించకుండా, అమలు చేయాల్సిన అనివార్యతను అంగీకరిస్తూనే, రాష్ట్ర ప్రయోజనాలకు భంగం కలిగించే నిబంధనల్లో మార్పులు కోరాలని నిర్ణయించడం పరిస్థితి తీవ్రతను తెలియజేస్తోంది. ఈ అంశంపై ఇప్పటికే మంత్రివర్గ ఉపసంఘం రెండు విడతలుగా సమావేశం కావడం, కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖతో జరగనున్న చర్చలపై దృష్టి పెట్టడం చూస్తే, ఇది సాధారణ పరిపాలనా నిర్ణయం కాదని స్పష్టమవుతోంది. జూలై 1 నుంచి చట్టాన్ని అమలు చేయాలని కేంద్రం స్పష్టమైన గడువు విధించిన నేపథ్యంలో తెలంగాణ ముందున్న ఎంపికలు పరిమితంగా కనిపిస్తున్నాయి.




### అమలు తప్పనిసరి ఎందుకు?

రాష్ట్ర ప్రభుత్వం ముందు ఉన్న అతిపెద్ద వాస్తవం ఏమిటంటే, ఈ చట్టాన్ని పూర్తిగా తిరస్కరించే అవకాశం లేదు. అలా చేస్తే రాష్ట్రంలోని లక్షలాది మంది గ్రామీణ కూలీలు ఉపాధి హామీ పథకం ప్రయోజనాలను కోల్పోయే ప్రమాదం ఉంది. ఇప్పటికే వ్యవసాయ ఆధారిత ఆర్థిక వ్యవస్థలో అనిశ్చితి, వాతావరణ మార్పులు, ఉపాధి కొరత వంటి సమస్యలు గ్రామీణ కుటుంబాలను ఇబ్బంది పెడుతున్నాయి. అలాంటి సమయంలో ఉపాధి హామీ పనులు ఆగిపోతే సామాజిక, ఆర్థిక ప్రభావం తీవ్రంగా ఉండే అవకాశం ఉంది. అందుకే తెలంగాణ ప్రభుత్వం "అమలు చేయాలి, కానీ రాష్ట్ర ప్రయోజనాలకు అనుగుణంగా మార్పులు చేయాలి" అనే మధ్యేమార్గాన్ని ఎంచుకోవడం రాజకీయంగానూ, పరిపాలనా పరంగానూ వ్యూహాత్మక నిర్ణయంగా కనిపిస్తోంది.

### 40 శాతం రాష్ట్ర భారం సమాఖ్య స్ఫూర్తికి విరుద్ధమా?

తెలంగాణ ప్రధాన అభ్యంతరం చట్టంలోని ఆర్థిక నిబంధనలపైనే ఉంది. కొత్త విధానంలో మొత్తం వ్యయంలో 40 శాతం రాష్ట్రాలు భరించాలని కేంద్రం నిర్ణయించడం వల్ల తెలంగాణపై సుమారు రూ. 2,500 కోట్ల అదనపు భారం పడే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు. ఇది కేవలం బడ్జెట్ సమస్య మాత్రమే కాదు; భారత సమాఖ్య వ్యవస్థలో కేంద్ర--రాష్ట్రాల ఆర్థిక సంబంధాలపై కూడా ప్రశ్నలు లేవనెత్తుతోంది. దేశవ్యాప్తంగా అమలయ్యే జాతీయ సంక్షేమ పథకాల విషయంలో కేంద్రం ఎక్కువ బాధ్యత తీసుకోవాలా? లేక రాష్ట్రాలే అధిక భారం మోయాలా? అనే చర్చ మరోసారి తెరపైకి వచ్చింది. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్రానికి పంపినా స్పందన రాకపోవడం ఈ వివాదానికి రాజకీయ కోణాన్ని కూడా జోడిస్తోంది.

### 60 రోజుల నిషేధం తెలంగాణ పరిస్థితులకు సరిపోతుందా?

అత్యంత వివాదాస్పద నిబంధన వ్యవసాయ పనులు జరిగే 60 రోజుల పాటు ఉపాధి హామీ పనులు నిలిపివేయాలన్న నిర్ణయం. కేంద్రం వాదన ప్రకారం వ్యవసాయ రంగానికి కార్మికుల కొరత రాకుండా చూడడమే దీని ఉద్దేశం కావచ్చు. కానీ తెలంగాణ అధికారులు దీనిని రాష్ట్ర పరిస్థితులకు అన్వయించడం సాధ్యం కాదని చెబుతున్నారు. ఎందుకంటే వ్యవసాయ సీజన్‌లో కూడా ఉపాధి హామీ కింద జరిగే పనులు పూర్తిగా వ్యవసాయానికి పోటీగా ఉండవు. వర్షాకాలంలో రహదారుల వెంట మొక్కలు నాటడం, వాటి సంరక్షణ, చెరువుల పునరుద్ధరణ, గ్రామీణ మౌలిక వసతుల అభివృద్ధి వంటి పనులు అదే సమయంలో కొనసాగుతుంటాయి. ఇవి గ్రామీణాభివృద్ధికి కూడా కీలకమైనవే. అందువల్ల దేశమంతటికీ ఒకే విధమైన నిబంధన అమలు చేయడం కంటే, రాష్ట్రాల పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని సౌలభ్యం ఇవ్వాలని తెలంగాణ కోరుతోంది.

### గిరిజన ప్రాంతాల వాస్తవాలు భిన్నం

ఈ చర్చలో అత్యంత కీలక అంశం గిరిజన ప్రాంతాల పరిస్థితి. ఏటూరునాగారం, మంగపేట, తాడ్వాయి, భద్రాచలం, ఆసిఫాబాద్, ఇంద్రవెల్లి, అచ్చంపేట, దేవరకొండ వంటి ప్రాంతాల్లో పెద్దఎత్తున గిరిజన కుటుంబాలు ఉపాధి హామీ పనులపైనే ఆధారపడి జీవిస్తున్నాయి. ఈ ప్రాంతాల్లో సాగుభూమి పరిమితంగా ఉంటుంది. వ్యవసాయ అవకాశాలు కూడా చాలా తక్కువ. అలాంటి పరిస్థితుల్లో వ్యవసాయ సీజన్ పేరుతో 60 రోజుల పాటు ఉపాధి పనులు నిలిపివేస్తే వారి ఆదాయం పూర్తిగా దెబ్బతినే ప్రమాదం ఉంది. ఇక్కడ తెలంగాణ ప్రభుత్వం చేస్తున్న మరో ముఖ్యమైన వాదన కూడా పరిశీలనీయమే. కొండ ప్రాంతాలు ఉన్న హిమాచల్ ప్రదేశ్ వంటి రాష్ట్రాలకు కేంద్రం 90:10 నిష్పత్తిలో నిధులు అందిస్తుంటే, తెలంగాణలోని గిరిజన ప్రాంతాలకు కూడా అలాంటి ప్రత్యేక రాయితీ ఇవ్వాలని కోరుతోంది. ముఖ్యంగా రాజ్యాంగ పరిరక్షణ పొందిన గిరిజన ప్రాంతాల్లో అధిక వ్యయాన్ని కేంద్రం భరించాలన్న డిమాండ్ సమాఖ్య స్ఫూర్తికి అనుగుణంగానే ఉందని రాష్ట్రం భావిస్తోంది.

### ఉపాధి హామీ పరిధి విస్తరించిన నేపథ్యంలో

ప్రస్తుతం ఉపాధి హామీ పథకం కేవలం కూలి పనులకే పరిమితం కాదు. గ్రామీణ మరుగుదొడ్ల నిర్మాణం, ఇందిరమ్మ ఇళ్లకు సంబంధించిన పనులు, చెరువుల పునరుద్ధరణ, హరితహారం తరహా మొక్కల సంరక్షణ వంటి అనేక అభివృద్ధి కార్యక్రమాలు కూడా ఈ పథకం పరిధిలో కొనసాగుతున్నాయి. అందువల్ల 60 రోజుల నిషేధం వల్ల కేవలం కార్మికులకే కాదు, గ్రామీణ అభివృద్ధి కార్యక్రమాల వేగంపైనా ప్రభావం పడే అవకాశం ఉంది.

### కేంద్రం రాష్ట్రం మధ్య రాజీ అవసరం

కేంద్రం కూడా తన దృక్కోణాన్ని పూర్తిగా విస్మరించలేం. ఆర్థిక క్రమశిక్షణ, పథకాల సమర్థ వినియోగం, వ్యవసాయ రంగంలో కార్మికుల లభ్యత వంటి అంశాలను దృష్టిలో పెట్టుకొని కొత్త నిబంధనలు రూపొందించి ఉండవచ్చు. అయితే భారతదేశం వంటి విభిన్న భౌగోళిక, సామాజిక పరిస్థితులు ఉన్న దేశంలో ఒకే విధానం అన్ని రాష్ట్రాలకు సమానంగా సరిపోదు. ముఖ్యంగా గిరిజన ప్రాంతాలు, ఎండబారిన మండలాలు, వర్షాధార వ్యవసాయ ప్రాంతాలకు ప్రత్యేక విధానాలు అవసరం. కాబట్టి తెలంగాణ కోరుతున్న రెండు ప్రధాన అంశాలు రాష్ట్రంపై ఆర్థిక భారం తగ్గించడం, 60 రోజుల నిబంధనలో సడలింపు కల్పించడం పరస్పర చర్చల ద్వారా పరిష్కరించదగినవే. వీబీజీ రామ్‌జీ చట్టం చుట్టూ జరుగుతున్న చర్చ ఒక రాష్ట్రం కేంద్రం మధ్య వివాదం మాత్రమే కాదు. ఇది గ్రామీణ ఉపాధి, సమాఖ్య వ్యవస్థ, ఆర్థిక బాధ్యతల పంపిణీ, గిరిజన సంక్షేమం వంటి అనేక అంశాలను తాకుతోంది. తెలంగాణ ప్రభుత్వం చట్టాన్ని పూర్తిగా తిరస్కరించడం కాకుండా, అమలు చేస్తూనే రాష్ట్ర అవసరాలకు అనుగుణమైన సవరణలు కోరడం ఆచరణాత్మక వైఖరిగా కనిపిస్తోంది. అదే సమయంలో కేంద్రం కూడా రాష్ట్రాల ప్రత్యేక పరిస్థితులను పరిగణనలోకి తీసుకొని సౌలభ్యాలు కల్పిస్తే, ఉపాధి హామీ పథకం అసలు లక్ష్యం అయిన గ్రామీణ పేదలకు భరోసా కల్పించడం మరింత సమర్థవంతంగా సాధ్యమవుతుంది. జూలై 1 అమలుకు ముందు జరిగే కేంద్ర--రాష్ట్ర సమావేశాలు ఈ విషయంలో కీలక మలుపు కావచ్చు. ఆ సమావేశాల్లో తీసుకునే నిర్ణయాలే తెలంగాణలో లక్షలాది గ్రామీణ కార్మికుల జీవనోపాధిపై ప్రత్యక్ష ప్రభావం చూపనున్నాయి.

# బీజేపీ ఎలాంటి ఎత్తుగడలు వేస్తోంది..?

నియోజకవర్గాల పునర్విభజన, మహిళా రిజర్వేషన్లకు సంబంధించిన బిల్లులను వచ్చే పార్లమెంట్ వర్షాకాల సమావేశాల్లో ఎట్టిపరిస్థితుల్లోనూ ఆమోదించుకోవాలని సంకల్పించిన ఎన్డీయే ప్రభుత్వం అందుకు వీలుగా ఎంపీల సంఖ్యను పెంచుకునే దిశలో వ్యూహాలకు పదునుపెట్టింది. అందులో భాగంగా విపక్షాల్లో చీలికలు తెచ్చి వాటిని ముక్కలు చెక్కలు చేసే యత్నాలను ముమ్మరం చేసింది. ఉద్ధవ్ థాక్రే శివసేనలో తాజా తిరుగుబాటు, సమాజ్‌వాదీ కూడా అదే బాటలో నడుస్తోందన్న లీకులు అందులో భాగమే. ఉద్ధవ్ సారధ్యంలోని శివసేన యూబీటీ ఇప్పటికే చీలిపోయింది. ఆ పార్టీకి చెందిన 9 మంది ఎంపీల్లో ఆరుగురు లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాను ఢిల్లీలో కలిశారు. తమను ప్రత్యేకవర్గంగా గుర్తించాలని కోరారు. దీనికి ఆయన వెంటనే ఆమోదం తెలిపారు. ఓం బిర్లాను కలిసిన వారిలో సంజయ్ జాదవ్, సంజయ్ దేశ్‌ముఖ్, సంజయ్ పాటిల్, నగేశ్ పాటిల్, ఓమ్రాజే నింబాల్కర్, బాలా సాహెబ్ వాక్చౌరే ఉన్నారు. ఈ నెల 19న శివసేన 60వ సంస్థాపక దినోత్సవం సందర్భంగా ఏక్‌నాథ్ శిండే శివసేనలో ఈ వర్గం విలీనమైంది. దీంతో తాము మొదలుపెట్టిన ఆపరేషన్ టైగర్ పూర్తైందని కూడా షిండే ప్రకటించారు. మరోవైపు, 37 మంది ఎంపీలున్న సమాజ్‌వాది పార్టీలోనూ చీలిక రానుందంటూ యూపీ మంత్రి ఓంప్రకాశ్ రాజ్‌భర్ చేసిన ప్రకటన కలకలం రేపింది. ఎస్పీ ఎంపీలు పెద్ద సంఖ్యలో బీజేపీలో చేరేందుకు సిద్ధంగా ఉన్నారని, వారి పేర్లతో ఎస్పీ రాజ్యసభ సభ్యుడు రాంగోపాల్ యాదవ్ కేంద్ర హోంమంత్రి అమిత్‌షాకు లేఖ రాశారని, ఆ పేర్లు కూడా తనకు తెలుసున్నారు. ఎస్పీ ఎంపీల్లో కనీసం 25 మంది బీజేపీలో చేరతారని యూపీ డిప్యూటీ సీఎం కేశవ్ ప్రసాద్ మౌర్య కూడా చెప్పారు. అయితే తమ పార్టీలో పూర్తి ఐక్యత ఉందని, అవన్నీ పుకార్లేనని ఎస్పీ అధినేత అఖిలేష్ యాదవ్ కొట్టిపారేశారు. వాస్తవంగా బీజేపీకి చెందిన చాలామంది నాయకులే తమ పక్షం వైపు రావడానికి సిద్ధంగా ఉన్నారని ఆయన చెప్పారు. ఏప్రిల్‌లో మహిళా రిజర్వేషన్ ప్యాకేజీలో భాగంగా వచ్చిన డీలిమిటేషన్‌కు సంబంధించిన రాజ్యాంగ సవరణ బిల్లు లోక్‌సభలో 54 ఓట్ల తేడాతో ఆమోదం పొందలేదు. అయితే తాజా రాజకీయ పరిణామాల తరుణంలో అదే బిల్లు మళ్లీ ప్రవేశపెడితే ఆమోదం పొందే అవకాశం ఉందని రాజకీయ వర్గాలు అంచనా వేస్తున్నాయి. ప్రస్తుతం లోక్‌సభలో బలాబలాలు చూస్తే.. మొత్తం సభ్యుల సంఖ్య 543గా ఉంది. మూడు సీట్లు ఖాళీగా ఉన్నాయి. అంటే ప్రస్తుత సభ్యుల సంఖ్య 540 మాత్రమే. మూడింట రెండొంతుల మెజార్టీ అంటే 360 మంది మద్దతు కావాలి. ఎన్డీఏకు ప్రస్తుతం 318 మంది సభ్యులున్నారు. ప్రతిపక్షానికి 184 మంది సభ్యుల బలం ఉంది. ఇతరులు 38 మంది ఉన్నారు. బడ్జెట్ సమావేశాల్లో మహిళా రిజర్వేషన్, రాజ్యాంగ సవరణ బిల్లుల ఓటింగ్ సమయంలో 528 మంది సభ్యులు హాజరయ్యారు. అప్పుడు బిల్లు ఆమోదానికి 352 ఓట్లు అవసరమయ్యాయి. చీణాకు అనుకూలంగా 298 ఓట్లు మాత్రమే రావడంతో 54 ఓట్ల తేడాతో బిల్లు ఆగిపోయింది. కానీ అప్పటికి, ఇప్పటికి పరిస్థితులు మారిపోయాయి. ప్రస్తుతం టీఎంసీ రెబల్ ఎంపీలు 20 మంది, ఉద్ధవ్ థాక్రే శివసేన ఎంపీలు ఆరుగురు కలిపి ఎన్డీఏ ఖాతాలోకి 26 ఓట్లు అదనంగా వస్తాయని అంచనా. అప్పుడు లోక్‌సభలో ఎన్డీఏ బలం 318 నుంచి 344కు పెరుగుతుంది. స్టాలిన్ నేతృత్వంలోని డీఎంకే కాంగ్రెస్‌తో విభేదాల తరుణంలో ఇండి కూటమికి దూరమైంది. ఇప్పటికే బీజేపీ డీఎంకేను ఎన్డీఏలోకి ఆహ్వానించిందనే ప్రచారం జరుగుతోంది. డీఎంకే ఎన్డీఏలో చేరకపోయినా.. లోక్‌సభలో ఎన్డీఏకు జై కొడితే.. ఆ పార్టీకి చెందిన 22 మంది ఎంపీల బలం కూడా జత కలుస్తుంది. అప్పుడు ఎన్డీఏ బలం ఏకంగా 344 నుంచి 366కు పెరుగుతుంది. ఇప్పటికే ఈ మేరకు స్టాలిన్ నుంచి హామీ ఉందని కూడా బీజేపీ వ్యూహాత్మకంగా ప్రచారం చేసుకుంటోంది. సరే ఇక్కడివరకు లోక్‌సభలో పరిస్థితి ఓకే. కానీ కీలకమైన రాజ్యసభ సంగతేంటి అనే ప్రశ్న వస్తుంది. రాజ్యసభలో రెండొంతుల మెజారిటీకి 164 మంది సభ్యుల మద్దతు అవసరం. ప్రస్తుతం ఎన్డీఏ దగ్గర 150 మంది సభ్యులు ఉన్నారు. ఇక్కడ కూడా డీఎంకేకు చెందిన 8 మంది సభ్యుల మద్దతు లభిస్తే సంఖ్య 158కు చేరుతుంది. అప్పుడు మరో ఆరుగురు సభ్యుల మద్దతు అవసరం అవుతుంది. అయితే వచ్చే సెషన్‌లో మహిళా, డీలిమిటేషన్ బిల్లులు వచ్చే సమయానికి.. ఏదో రకంగా ఈ బలం సమకూర్చుకోవచ్చనేది బీజేపీ ఆలోచనగా ఉంది. పైగా ఒక్కసారి బిల్లులు లోక్‌సభ ఆమోదం పొందితే.. రాజ్యసభలో అనుకోని విధంగా మద్దతు లభిస్తుందనే లెక్కలు కూడా లేకపోలేదు. ఇప్పటికే టీఎంసీ, శివసేన యూబీటీ నుంచి ఎంపీల్ని ఆకర్షించి మద్దతు కూడగట్టడంలో సఫలమైన బీజేపీ.. ఇప్పుడు శరద్ పవార్ ఎన్సీపీ, నవీన్ పట్నాయక్ బిజూ జనతాదళ్, పంజాబ్‌లో ఆప్ మీద కూడా కన్నేసినట్టు చెబుతున్నారు. త్వరలో ఈ ఆపరేషన్లు కూడా కొలిక్కి వచ్చే సూచనలు కనిపిస్తున్నాయి. కొన్ని చిన్న పార్టీలతో చర్చలు పూర్తయ్యాయని, పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు మొదలయ్యాక విపక్షానికి మరిన్ని షాకులిచ్చే ఉద్దేశంతో బీజేపీ ఉందనే చర్చ జరుగుతోంది. ఏదేమైనా ప్రస్తుతం హస్తిన వేదికగా రాజకీయ వ్యూహాలు జోరుగా సాగుతున్నాయి. నయానో భయానో ఎంపీల బలం పెంచుకోవటానికి బీజేపీ అన్ని ప్రయత్నాలు చేస్తోంది. కుదిరితే రాష్ట్ర స్థాయి నేతలు, పార్టీ సీఎంలు, అవసరమైతే అగ్రనేతలే నేరుగా రంగంలోకి దిగి పని పూర్తిచేయాలనే కార్యాచరణ సిద్ధమైంది. అన్నింటికీ మించి డీలిమిటేషన్ బిల్లును తిప్పికొట్టామనే ఆత్మవిశ్వాసంతో తొణికిసలాడుతున్న ప్రతిపక్ష కూటమిని నైతికంగా చావుదెబ్బ కొట్టాలనేది కాషాయ పార్టీ లక్ష్యంగా ఉంది. అందుకే ఐదు రాష్ట్రాల ఎన్నికల ఫలితాలు రాగానే రాజకీయ సమీకరణాలు మార్చే పని మొదలుపెట్టారనే అభిప్రాయాలు వస్తున్నాయి. 2029 లోక్‌సభ ఎన్నికలకు ముందే డీలిమిటేషన్ బిల్లు, మహిళా రిజర్వేషన్ బిల్లుల ఆమోదింప జేసుకోవాలన్న కృతనిశ్చయంతో ఉంది కేంద్రం. రెండింటికి పార్లమెంట్‌లో ఆమోదం పొందేలా...ప్రభుత్వం వ్యూహాత్మకంగా కార్యాచరణను సిద్ధం చేస్తోంది. నియోజకవర్గాల పునర్విభజన జరగాలంటే పలు రాజ్యాంగ సవరణలు చేయాల్సి ఉంటుంది. అలా రాజ్యాంగ సవరణ కోసం ప్రవేశపెట్టే బిల్లులకు ఉభయ సభల్లో ప్రత్యేక మెజారిటీ అవసరం. సభలో సభ్యుల హాజరు సగానికిపైగా ఉండాలి. హాజరైన వారిలో మూడింట రెండు వంతుల మంది ఆ బిల్లుకు మద్దతు తెలుపాలి. అప్పుడే ఆ బిల్లు ఆమోదం పొందుతుంది. లోక్‌సభలో ప్రస్తుతం ఉన్న 540 మంది ఎంపీలు సభకు హాజరైతే.. వారిలో 360 మంది తప్పనిసరిగా బిల్లుకు మద్దతు తెలపాలి. లోక్‌సభలో ఆమోదం పొందిన బిల్లు రాజ్యసభ ముందుకు వస్తుంది. రాజ్యసభలో ప్రస్తుతం ఉన్న 244 మంది సభ్యులు సభకు హాజరైతే.. 163 మంది బిల్లుకు మద్దతు తెలపాలి. అప్పుడే ఆ బిల్లు రాష్ట్రపతి ఆమోదం అనంతరం చట్టంగా మారుతుంది. కానీ అధికార ఎన్డీయే కూటమికి ఉభయ సభల్లో ఇప్పుడు అంత బలం లేదు. అందుకే ఆ బలం కూడగట్టానికి రకరకాల రాజకీయ వ్యూహాలకు పదును పెడుతున్నారు. ఇప్పటికే వర్షాకాల సమావేశాల్లో డీలిమిటేషన్ బిల్లును పునఃప్రవేశపెట్టేందుకు కేంద్ర హోం మంత్రిత్వ శాఖ సన్నాహాలు చేస్తోంది. మహిళా కోటా విషయానికొస్తే.. 2023లో ఆమోదించిన మహిళా రిజర్వేషన్ చట్టం ప్రకారం.. పునర్విభజన తర్వాతే 33 శాతం కోటా అమల్లోకి రావాలి. ఎస్సీ, ఎస్టీ రిజర్వ్‌డ్ స్థానాల్లో కూడా వన్-థర్డ్ కోటాను మహిళలకు కేటాయించనున్నారు. దీంతో అదే దామాషాలో ఆయా వర్గాల మహిళలకూ లబ్ధి చేకూరుతున్నట్టే. 2023లో ఆమోదం పొందిన మహిళా రిజర్వేషన్ల బిల్లుతో లోక్‌సభ, రాష్ట్ర అసెంబ్లీల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు లభిస్తాయి. నియోజకవర్గాల పునర్విభజన కాకపోవడంతో ఈ చట్టం అమల్లోకి రాలేదు. నియోజకవర్గాల పునర్విభజనకు ముందుగానే ఈ చట్టాన్ని అమలు చేయాలంటే మరో రాజ్యాంగ సవరణ తప్పనిసరి. చట్టం ఏర్పడిన తర్వాత వచ్చే మొదటి జనాభా లెక్కల సేకరణ అనంతరం చేపట్టే నియోజకవర్గాల పునర్విభజన తర్వాతే మహిళలకు రిజర్వేషన్‌ను అమలుచేయాలని చట్టం నిర్దేశిస్తోంది. నియోజకవర్గాల పునర్విభజనకు అతీతంగా ఇది అమలు చేయాలంటే ఈ చట్టంలోని సెక్షన్ 5ని ప్రభుత్వం సవరించాల్సి ఉంటుంది. ఇది పార్లమెంట్ ఉభయ సభల్లో హాజరైన సభ్యుల్లో మూడింట రెండు వంతుల మంది ఆమోదంతోనే చట్ట సవరణ చేయాల్సి ఉంటుందని... రాజ్యాంగంలోని 368(2) అధికరణ నిర్దేశిస్తోంది. లోక్ సభ నియోజకవర్గాల పునర్విభజనకు సంబంధించి కేంద్రం మరో ప్రతిపాదనను కూడా పరిశీలిస్తోంది. లోక్ సభ నియోజకవర్గాలను ప్రస్తుతం ఉన్న 543 నుంచి 824కి పెంచాలని ప్రధానమంత్రి ఆర్థిక సలహా మండలి ఇప్పటికే సూచన చేసింది. . అంటే ప్రతీ రాష్ట్రంలో ఉన్న సీట్లలో మరో యాభై శాతం పెంచే బదులుగా...మరో కొత్త ఫార్ములాతో ఈ మండలి ప్రతిపాదనలు ఉండడం ఆసక్తిని పెంచుతోంది. మూడో వంతు పార్లమెంట్ సీట్లను మాత్రమే పెంచాలని ప్రధానమంత్రి ఆర్థిక సలహా మండలి సిఫార్సు చేసినట్లుగా తెలుస్తోంది. అంటే 170 పార్లమెంట్ నియోజకవర్గాలలోనే పునర్ విభజన ఉండనుంది. 59 పార్లమెంట్ నియోజకవర్గాలను రెండుగా విభజించాలని... మరో 111 సీట్లను మూడుగా చేయాలని మండలి సూచించినట్లు ప్రచారం జరుగుతోంది. మరి ఇప్పుడు వర్షాకాల సమావేశాల్లో పార్లమెంట్ ముందుకొచ్చే బిల్లు ఇలాగే ఉంటుందా.. మరేదైనా మార్పు చేస్తారా అనేది చూడాల్సి ఉంది. దేశంలో లోక్‌సభ, శాసనసభల నియోజక వర్గాల పెంపు... జనాభా ప్రాతిపదికన కాలానుగుణంగా పునర్వ్యవస్థీకరించాలి. పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా నియోజకవర్గాల సంఖ్య కూడా కాలక్రమేణా పెరగాల్సి ఉంది. 1976లో జరిగిన రాజ్యాంగ సవరణ తర్వాత 2001 వరకు లోక్‌సభ నియోజకవర్గాల విస్తరణ నిలిపి వేశారు. మళ్లీ 2001లో రాజ్యాంగ సవరణ ద్వారా 2026 వరకు లోక్‌సభ నియోజక వర్గాల విస్తరణను ఆపేశారు. 2008లో దేశంలోని కొన్ని రాష్ట్రాల్లో నియోజకవర్గాల పునర్వ్యవస్థీకరణ జరిగి, దాని ప్రకారం 2009 నుంచి తదుపరి ఎన్నికలు జరిగాయి. కానీ సీట్ల సంఖ్య పెరగలేదు. దీంతో లోక్‌సభ సభ్యుల సంఖ్య 543గానే ఉండిపోయింది. అందుకే ఎమ్మెల్యే నియోజకవర్గాల డీలిమిటేషన్ ఎలా ఉన్నా.. ఎంపీ నియోజకవర్గాల డీలిమిటేషన్ ను మొదట ఆమోదింపజేసుకోవాలనే లక్ష్యంతో కేంద్రం కనిపిస్తోంది. అంతేకాదు వర్షాకాల సమావేశాల్లో డీలిమిటేషన్ బిల్లుతో పాటు మహిళా రిజర్వేషన్ బిల్లును ఆమోదింపజేసుకోవాలన్న లక్ష్యంతో బీజేపీ అడుగులు వేస్తోంది. ఈ సారి ఎలాగైనా రెండు బిల్లులను ఉభయ సభల్లోనూ ఆమోదం పొందేలా...సభ్యుల మద్దతు కూడగట్టేందుకు వ్యూహాలు సిద్ధం చేస్తోంది. మోడీ ప్రధాని అయ్యాక పార్లమెంట్‌లో ఏ బిల్లు ఆమోదం విషయంలోనూ ఎన్డీఏ సర్కారు ఇబ్బంది పడలేదు. అందుకే రెండు నెలల క్రితం మహిళా రిజర్వేషన్ బిల్లు, డీలిమిటేషన్ బిల్లులు వచ్చినప్పుడు కూడా సర్కారు పకడ్బందీ ప్లాన్‌తోనే వచ్చుంటుందనే చర్చ జరిగింది. కానీ అధికార పక్షానికి షాకిస్తూ ఒక్కతాటిపైకి వచ్చిన విపక్షం.. ఆ రెండు బిల్లుల్ని తిప్పికొట్టింది. దీంతో ఎక్కడైనా అతివిశ్వాసానికి పోయామా అని ఎన్డీఏలో అంతర్గత చర్చ జరిగింది. ఆ సందర్భంగా పార్లమెంట్‌లో అనుసరించిన వ్యూహం.. విపక్షాల్ని ఎందుకు ఒప్పించలేకపోయామనే ప్రశ్నలకు సమాధానాలపై సమీక్ష జరిగింది. అప్పుడు జరిగిన పొరపాట్లు మరోసారి జరగకుండా.. అన్ని జాగ్రత్తలు తీసుకుని.. ఇంకా చెప్పాలంటే ప్లాన్ బీ కూడా రెడీగా పెట్టుకుని మరీ ఈసారి కేంద్రం రంగంలోకి దిగుతోందని రాజకీయ వర్గాలు భావిస్తున్నాయి. ఇక్కడ డీలిమిటేషన్, మహిళా రిజర్వేషన్ బిల్లుల మద్దతే అసలు ఉద్దేశం కాదు. ప్రధానంగా 2/3 వ వంతు మెజార్టీ కూడగట్టడమే అసలు లక్ష్యం. అప్పుడే ఈ బిల్లులతో పాటు భవిష్యత్తులో యూనిఫామ్ సివిల్ కోడ్ అయినా.. వన్ నేషన్ వన్ ఎలక్షన్ బిల్లులైనా సాఫీగా ఆమోదం పొందుతాయనేది బీజేపీ దూరాలోచనగా ఉంది. అందుకే ఈ లక్ష్యాన్ని తేలిగ్గా తీసుకోవటానికి కాషాయ పార్టీ సిద్ధంగా లేదు. ఈసారి విపక్షానికి పైచేయి సాధించే అవకాశం లేదని ఇప్పటికే జరుగుతున్న పరిణామాలు తేటతెల్లం చేస్తున్నాయి. ఓ రకంగా విపక్షాలే స్వయంగా తొలుత బీజేపీకి ఛాన్స్ ఇచ్చాయి. వచ్చిన అవకాశాన్ని రెండుచేతులా అందిపుచ్చుకోవటమే తమ కర్తవ్యమన్నట్టుగా బీజేపీ రాజకీయ వ్యూహరచన చేస్తోంది. ఇక్కడ రాజకీయ వ్యూహం, పార్లమెంట్‌లో అనుసరించాల్సిన వ్యూహాలపై ప్లానింగ్ సమాంతరంగా జరుగుతున్న పరిస్థితి కనిపిస్తోంది.



# మనసున్న ప్రభుత్వం మంచి కార్యక్రమం

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** హెలెన్ కెల్లర్ స్ఫూర్తితో దివ్యాంగులకు మరింత అండగా తెలంగాణ ప్రభుత్వం 14 నైబర్‌హుడ్ సెంటర్లకు ఈ-ఆటోల పంపిణీ దివ్యాంగులకు జాలి కాదు... సమాన అవకాశాలు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యం మంత్రి సీతక్క దివ్యాంగుల హక్కుల కోసం జీవితాంతం పోరాడిన హెలెన్ కెల్లర్ జయంతి సందర్భంగా తెలంగాణ ప్రభుత్వం దివ్యాంగుల సంక్షేమంలో మరో కీలక అడుగు వేసిందని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి డా. ధనసరి అనసూయ సీతక్క అన్నారు. రాష్ట్రంలోని 14 నైబర్‌హుడ్ సెంటర్లకు ఈ-ఆటోలను ప్రారంభిస్తూ ఆమె మాట్లాడారు. ఈ కార్యక్రమంలో పంచాయతీరాజ్ గ్రామీణ అభివృద్ధి శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ దాన కిషోర్, సెర్ప్ సీఈఓ దివ్య దేవరాజన్, సెర్ప్ లో దివ్యాంగుల సంక్షేమ విభాగ డైరెక్టర్ ఎల్ కృష్ణమూర్తి, ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ ప్రతినిధులు పీయూష్ మిట్టల్, కైలాష్, అధికారులు, దివ్యాంగులు, వారి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు. హెలెన్ కెల్లర్ జీవితం ప్రపంచానికే స్ఫూర్తి అని మంత్రి సీతక్క అన్నారు. చిన్న వయసులోనే చూపు, వినికిడి కోల్పోయినా సంకల్పబలంతో ప్రపంచవ్యాప్తంగా కోట్లాది మందికి ఆదర్శంగా నిలిచారని పేర్కొన్నారు. ఆమె చెప్పిన "ఒంటరిగా మనం చాలా తక్కువ చేయగలం... కలిసి ఉంటే ఎంతో సాధించగలం" అనే సందేశం ఈ కార్యక్రమానికి సరిగ్గా సరిపోతుందని అన్నారు. దివ్యాంగులను జాలి చూపాల్సిన వారిగా కాకుండా సమాజ అభివృద్ధిలో సమాన భాగస్వాములుగా చూడాలన్నదే తెలంగాణ ప్రభుత్వ విధానమని మంత్రి స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో దివ్యాంగులకు విద్య, ఉపాధి, పునరావాసం, జీవనోపాధి రంగాల్లో మరిన్ని అవకాశాలు కల్పిస్తున్నామన్నారు. గత రెండు దశాబ్దాలుగా మహిళల సాధికారత కోసం విశేషంగా పనిచేస్తున్న సెర్ప్‌కు ప్రభుత్వం దివ్యాంగుల సంక్షేమ బాధ్యతలను కూడా అప్పగించిందని తెలిపారు. మహిళా సంఘ సభ్యుల దివ్యాంగ పిల్లలకు ఈ లోటు రాకుండా చూసుకునే బాధ్యత అప్పగించామన్నారు. సెర్ప్ సీఈఓ దివ్యా దేవరాజన్, డైరెక్టర్ కృష్ణమూర్తి ఆధ్వర్యంలో తక్కువ కాలంలోనే దివ్యాంగులను సంఘటితం చేసి రాష్ట్రవ్యాప్తంగా 13 వేలకుపైగా దివ్యాంగుల స్వయం సహాయక సంఘాలు ఏర్పాటు చేశారని చెప్పారు. ప్రస్తుతం 82 వేల మందికి పైగా సభ్యులు ఈ సంఘాల్లో ఉన్నారని తెలిపారు. స్త్రీనిధి ద్వారా రూ. 38.16 కోట్ల రుణాలు, గ్రామ మహిళా సంఘాల ద్వారా రూ. 4.13 కోట్ల రుణాలు, రూ. 11.62 కోట్ల పొదుపులు, 2,248 మందికి జీవనోపాధి అవకాశాలు కల్పించడం ప్రభుత్వ చిత్తశుద్ధికి నిదర్శనమన్నారు. ప్రస్తుతం 26 జిల్లాల్లో 74 నైబర్‌హుడ్ సెంటర్ల ద్వారా కమ్యూనిటీ మేనేజ్డ్ రిహాబిలిటేషన్ సర్వీసెస్ కార్యక్రమాన్ని మహిళా సంఘాల ఆధ్వర్యంలో విజయవంతంగా అమలు చేస్తున్నామని చెప్పారు. మండల మహిళా సమాఖ్యల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నైబర్హుడ్ సెంటర్ల లో దాదాపు మూడు వేల మంది దివ్యాంగ పిల్లలకు ఫిజియోథెరపీ, స్పీచ్ థెరపీ, ప్రత్యేక విద్య, కౌన్సెలింగ్, నైపుణ్యాభివృద్ధి వంటి సేవలు అందుతున్నాయని వివరించారు. తల్లిదండ్రులకు శిక్షణ, కౌన్సెలింగ్‌తో పాటు ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. ఈ-ఆటోలు కేవలం వాహనాలు కాదని, ఎన్నో కుటుంబాలకు ఆశను, దివ్యాంగులకు ఆత్మవిశ్వాసాన్ని అందించే సాధనాలని మంత్రి పేర్కొన్నారు. ఇప్పటివరకు రవాణా సమస్యల వల్ల పిల్లలను కేంద్రాలకు తీసుకురాలేకపోయిన కుటుంబాలకు ఇకపై ఇంటి వద్ద నుంచే ఉచిత రవాణా సౌకర్యం అందుబాటులోకి వస్తుందన్నారు. ముఖ్యంగా ఆటిజం, మేధోవైకల్యం తదితర వైకల్యాలు ఉన్న పిల్లలు క్రమం తప్పకుండా థెరపీ, శిక్షణ పొందేందుకు ఇది ఎంతో ఉపయోగపడుతుందని చెప్పారు. శారీరక లోపం ఉన్నవారే దివ్యాంగులు కాదని, ఇతరులను అవమానించే మనస్తత్వం, అహంకారం, మానవత్వం లేకపోవడం కూడా ఒక విధమైన వైకల్యమని అన్నారు. దివ్యాంగులను చీదరించకుండా, వారికి అవకాశాలు కల్పిస్తే వారు అద్భుత విజయాలు సాధిస్తారని చెప్పారు. కళ్లు కనిపించకపోయినా బ్రెయిలీ ద్వారా ఉన్నత లక్ష్యాలను చేరుకున్నవారు ఎందరో ఉన్నారని గుర్తు చేశారు. హెలెన్ కెల్లర్ లాగే ప్రతి దివ్యాంగుడిలో అపారమైన ప్రతిభ దాగి ఉంటుందని అన్నారు. పుట్టుకతో వచ్చిన వైకల్యాలను కూడా తల్లిదండ్రుల ప్రేమ, ప్రోత్సాహం, సరైన శిక్షణతో ఎంతోవరకు అధిగమించవచ్చని చెప్పారు. దివ్యాంగ పిల్లల పట్ల కుటుంబ సభ్యులు నిరాశ చెందకుండా మరింత శ్రద్ధ చూపాలని సూచించారు. ముఖ్యమంత్రి సహకారంతో దివ్యాంగుల సంక్షేమానికి ప్రత్యేక బడ్జెట్ కేటాయించి త్రిచక్ర వాహనాలు, జీవనోపాధి అవకాశాలు, స్వయం సహాయక సంఘాలు, నైబర్‌హుడ్ సెంటర్లు వంటి అనేక కార్యక్రమాలు అమలు చేస్తున్నామని తెలిపారు. దివ్యాంగుల పేరిటే ప్రయోజనాలు అందేలా చర్యలు తీసుకుంటూ వారికి సామాజిక భద్రత కల్పిస్తున్నామని చెప్పారు. సీఎస్ఆర్ నిధుల ద్వారా ఈ కార్యక్రమానికి సహకరించిన ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్‌కు తెలంగాణ ప్రభుత్వం తరఫున మంత్రి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

ప్రభుత్వం, కార్పొరేట్ సంస్థలు, సమాజం కలిసి పనిచేస్తే మరింత మెరుగైన ఫలితాలు సాధించవచ్చని అన్నారు. ప్రతి దివ్యాంగుడికి సేవలు వారి ఇంటి సమీపంలోనే అందేలా నైబర్‌హుడ్ సెంటర్లను మరింత బలోపేతం చేస్తామని, అవసరమైన చోట కొత్త కేంద్రాలు ఏర్పాటు చేసి సేవలను విస్తరిస్తామని మంత్రి ప్రకటించారు. దివ్యాంగుల సంక్షేమానికి సంబంధించి ప్రజలు సూచనలు ఇవ్వాలని, వాటిని ప్రభుత్వ విధానాల్లో అమలు చేసి వారి జీవన ప్రమాణాలను మరింత మెరుగుపరుస్తామని తెలిపారు. హెలెన్ కెల్లర్ జయంతి సందర్భంగా దివ్యాంగులకు జాలి కాదు... గౌరవం, సమాన అవకాశాలు, ఆదరణ ఇవ్వాలనే సంకల్పంతో ముందుకు సాగుదామని మంత్రి సీతక్క పిలుపునిచ్చారు. అదే హెలెన్ కెల్లర్‌కు మనం అందించే నిజమైన నివాళి అని అన్నారు

# ఎంబీఏ కాలేజీల మాయాజాలం..

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** రాష్ట్రంలో మేనేజ్‌మెంట్ విద్య అందిస్తున్న ఉస్మానియా పరిధిలోని కొన్ని ఎంబీఏ కాలేజీల నిర్వాకం ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. విద్యార్థులకు నాణ్యమైన శిక్షణ ఇచ్చి కార్పొరేట్ రంగానికి సిద్ధం చేయాల్సిన పలు విద్యాసంస్థలు వారి భవిష్యత్తుతో చెలగాటమాడుతున్నాయి. నిబంధనల ప్రకారం విద్యార్థులతో ఇంటర్న్‌షిప్ చేయించి, ప్రాజెక్టు రిపోర్టులు రూపొందించాల్సి ఉండగా.. క్షేత్రస్థాయిలో అవేమీ లేకుండానే ఫేక్ ప్రాజెక్ట్ సర్టిఫికెట్లను అందజేస్తూ మమ అనిపిస్తున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని పలు ప్రైవేట్ ఎంబీఏ కాలేజీలు విద్యార్థులను ఏ కంపెనీకీ పంపకుండా, ఎలాంటి శిక్షణ ఇప్పించకుండానే నకిలీ సర్టిఫికెట్లను పుట్టించేస్తున్నాయి. కొన్ని విద్యాసంస్థలు ఏకంగా బ్రోకర్లు, కొన్ని ఫేక్ కన్సల్టెన్సీలతో చేతులు కలిపి దందాను నడిపిస్తున్నట్లు తెలుస్తోంది. కూర్చున్న చోటే ప్రాజెక్ట్ రిపోర్టులు సిద్ధం చేసి, మార్కులు వేసేస్తూ విద్యార్థులను తప్పుదోవ పట్టిస్తున్నారు.

### ఆ కాలేజీల్లో సీట్ల కోత..

ఈ ఫేక్ ప్రాజెక్టుల వ్యవహారం వెనుక ఉస్మానియా యూనివర్సిటీకి చెందిన కొందరు ఉన్నతాధికారుల అండదండలు పుష్కలంగా ఉన్నాయనే విమర్శలు గట్టిగా వినిపిస్తున్నాయి. కాలేజీల తనిఖీలు, ప్రాజెక్ట్ రిపోర్టుల పరిశీలన సమయంలో అధికారులు చూసీచూడనట్లు వ్యవహరించడం వల్లే ఈ అక్రమాలు యథేచ్ఛగా సాగుతున్నాయని విద్యార్థి సంఘాలు మండి పడుతున్నాయి. కాలేజీల యాజమాన్యాల నుంచి అందుతున్న ముడుపుల వల్లే అధికారులు ఈ దందాను ప్రోత్సహిస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. కాగా నకిలీ సర్టిఫికెట్ల వ్యవహారంపై ఇటీవల ఉన్నతాధికారులకు పెద్ద ఎత్తున ఫిర్యాదులు అందాయి. దీనిపై ఓయూ అధికారులు విచారణ జరిపినట్లు తెలుస్తోంది. ప్రాథమిక విచారణలో అక్రమాలు జరిగినట్లు తేలడంతో, గ్రేటర్ పరిధిలోని దాదాపు 70 కాలేజీలుంటే పది నుంచి 15 కాలేజీల్లో సీట్లకు కోత విధించే అవకాశం ఉంది. చాలావరకు కాలేజీలు నాణ్యతా ప్రమాణాలు పాటించకపోవడం, సరైన బోధనా సిబ్బంది లేకపోవడం లేకపోవడం తదితర కారణాలతో కాలేజీల్లో సీట్లకు కోత విధిస్తున్నారు. కేవలం తనిఖీల సమయంలో మాత్రమే కాలేజీల తలుపులు తెరుచుకోవడం గమనార్హం.

### యథేచ్ఛగా నిబంధనల ఉల్లంఘనలు : సీజేఎస్ అధ్యక్షుడు డా. మాసారం ప్రేమ్‌కుమార్

నిబంధనలు ఉల్లంఘించిన కాలేజీలపై కఠిన చర్యలు తీసుకోకపోతే విద్యార్థుల కెరీర్ ప్రశ్నార్థకంగా మారుతుంది. ఓయూ అధికారులు, కాలేజీ యాజమాన్యాల మధ్య మంచి సఖ్యత ఉంది. ఒకచోట కాలేజీకి పర్మిషన్లు తీసుకుని మరొకచోట నిర్వహిస్తున్నారు. గ్రేటర్ పరిధిలో కాలేజీ ఫార్వడింగ్‌లదే హవా నడుస్తోంది. ఇలాంటి కాలేజీలపై కఠిన చర్యలు తీసుకోవాలి. గతేడాది నుంచి నేను ఫిర్యాదులు చేస్తున్నా అధికారులు కాలయాపన చేస్తున్నారు.

# 7 దశాబ్దాల నాటి భూవివాదానికి తెర



**న్యూ ఢిల్లీ :** సుమారు 74 ఏళ్లుగా నాలుగు తరాలను పట్టి పీడిస్తోన్న సుదీర్ఘ భూ వివాదానికి సుప్రీంకోర్టు ముగింపు పలికింది. 1957లో జరిగిన ఒక భూ విక్రయ ఒప్పందాన్ని సమర్థిస్తూ సర్వోన్నత న్యాయస్థానం చారిత్రాత్మక తీర్పునిచ్చింది. ఈ కేసును విచారించిన న్యాయమూర్తుల వయసుకంటే.. చట్టపరంగా జరుగుతున్న ఈ భూ పోరాటం వయసే ఎక్కువ కావడం గమనార్హం. జస్టిస్ ప్రశాంత్ కుమార్ మిశ్రా, జస్టిస్ ఎన్ వి అంజారియాలతో కూడిన ధర్మాసనం.. ఉత్తరాఖండ్ లోని హరిద్వార్ జిల్లా నర్సీపూర్ కలాన్ గ్రామంలో ఉన్న 15.5 ఎకరాల భూమికి సంబంధించిన వివాదంపై కీలక తీర్పును వెలువరించింది. 1957 జూన్ 4న నమోదైన అమ్మకపు రిజిస్ట్రేషన్ పత్రం చెల్లుబాటు అవుతుందని అత్యున్నత న్యాయస్థానం స్పష్టం చేసింది. దీంతో నాలుగు తరాలుగా ఆ కుటుంబాన్ని వెంటాడుతున్న భూ వివాదానికి పరిష్కారం లభించినట్లయింది.

### అసలు వివాదం ఏంటంటే..

1957లో నమోదైన సేల్ డీడ్ ద్వారా అప్పీలుదారుల పూర్వీకులు అప్పట్లో మైనర్లుగా ఉన్న సమయంలోనే 15.5 ఎకరాల భూమిని కొనుగోలు చేశారు. అప్పటి నుంచీ ఆ భూమిని తామే సాగుచేస్తూ వస్తున్నారు. 1984లో భూమిని తమ పేర్లపై మ్యూటేషన్ కూడా చేయించుకున్నారు. 1991లో భూ సమీకరణ.. అంటే కన్సాలిడేషన్ ప్రక్రియలో తమకు భూమిధార్ హక్కులు గుర్తించాలని కోరగా.. తొలుత కన్సాలిడేషన్ అధికారి వారి వాదనను అంగీకరించారు. అనంతరం ఇతర సహ యజమానులు అభ్యంతరాలు వ్యక్తం చేయడంతో కేసు విచారణకు వచ్చింది. 1999లో కన్సాలిడేషన్ అధికారి సేల్ డీడ్ సక్రమంగా నిరూపించలేదని, అలాగే ఉత్తరప్రదేశ్ జమీందారీ నిర్మూలన, భూ సంస్కరణల చట్టంలోని సెక్షన్ 154ను ఉల్లంఘించిందని పేర్కొంటూ వారి అభ్యర్థనను తిరస్కరించారు. అప్పీల్, రివిజన్ అధికారులతో పాటు హైకోర్టు కూడా అదే నిర్ణయాన్ని సమర్థించింది. కేవలం సాక్షి చిరునామాలో ఉన్న చిన్నపాటి వ్యత్యాసాన్ని ఆధారంగా తీసుకుని నమోదైన సేల్ డీడ్ ను తిరస్కరించడం తీవ్రమైన న్యాయపరమైన పొరపాటు అని సుప్రీంకోర్టు వ్యాఖ్యానించింది. ఈ సేల్ డీడ్ నకిలీదని, మోసం, బెదిరింపు లేదా బలవంతం ద్వారా తీసుకున్నదని ప్రతివాదులు ఎక్కడా ఆరోపించలేదని కోర్టు స్పష్టం చేసింది. చట్టబద్ధంగా నమోదైన రిజిస్ట్రేషన్ పత్రానికి చిన్నపాటి సాంకేతిక లోపాల్ని చూపించి కొట్టివేయమని సుప్రీం ధర్మాసనం పేర్కొంది. దీనిపై దిగువ కోర్టులు, కన్సాలిడేషన్ అధికారులు, హైకోర్టు ఇచ్చిన తీర్పుల్ని రద్దు చేస్తూ 1957 సేల్ డీడ్ ను చెల్లుబాటు అవుతుందని ప్రకటించింది.

# రూ.16.13 కోట్లతో శంకుస్థాపనలు..

**కూసుమంచి,ఫ్లాష్ ఇండియా :** మండలంలోని శనివారం తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి విస్తృతంగా పర్యటించారు. ఒకవైపు చిరుజల్లులు కురుస్తున్నాయి, వర్షపు చినుకుల సాక్షిగానే దుబ్బ తండా, లాల్ సింగ్ తండా, జీళ్లచెరువు గ్రామాల్లో రూ. 16.13 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టనున్న బీటీ రోడ్లు, వంతెనల నిర్మాణ పనులకు మంత్రి పొంగులేటి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో ఏర్పాటు చేసిన కార్యక్రమాల్లో మంత్రి మాట్లాడుతూ.. వర్షాకాలంలో తండాలు, పల్లె ప్రజలు బురద రోడ్లు, ఉధృతంగా ప్రవహించే వాగుల వల్ల బాహ్య ప్రపంచంతో సంబంధాలు తెగిపోకుండా ఉండేందుకే ఈ పనులను త్వరితగతిన మంజూరు చేయించామని పేర్కొన్నారు. వానలు పడుతున్న ప్రజల కోసం ప్రగతి పనులు ఆపబోమని, అధికారులు కూడా అంతే వేగంతో నాణ్యతా ప్రమాణాలతో, నిర్దేశిత గడువులోగా పనులు పూర్తి చేయాలని ఆదేశించారు.

### రూ.16.13 కోట్లతో శంకుస్థాపనలు..

మంత్రి పొంగులేటి తన పర్యటనలో భాగంగా దుబ్బ తండా గ్రామంలో జడ్పీ రోడ్డు గైగోల్లపల్లి నుంచి దుబ్బ తండా వరకు రూ. 2.10 కోట్ల అంచనా వ్యయంతో, అలాగే జడ్పీ రోడ్డు నుండి కొత్తూరు - ఎర్రగడ్డ తండా మీదుగా దుబ్బతండా వరకు రూ. 4.50 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టే బీటీ రోడ్ల నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం లాల్ సింగ్ తండా నుంచి నేరేడు వాయి వరకు రూ. 2.03 కోట్ల అంచనా వ్యయంతో నిర్మించనున్న బీటీ రోడ్డు పనులకు, జీళ్ళ చెరువు గ్రామంలో జీళ్లచెరువు మీదుగా కొండాపురం నుంచి మోటాపురం వెళ్లే ప్రధాన రహదారిపై రూ. 7.50 కోట్ల వ్యయంతో నిర్మించ తలపెట్టిన రెండు వంతెనల (బ్రిడ్జిల) నిర్మాణ పనులకు



శంకుస్థాపన చేశారు. ఈ పర్యటనలో మంత్రి వెంట జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్, పోలీస్ కమిషనర్ సునీల్ దత్, వివిధ శాఖల జిల్లా, నిజయోజక, మండల స్థాయి అధికారులు, స్థానిక ప్రజా ప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.






# మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలి

**నల్లగొండ, ఫ్లాష్ ఇండియా ప్రతినిధి :**
ప్రతిఒక్కరూ మాధకద్రవ్యాలకు దూరంగా ఉండి, ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి కృషి చేయాలని జిల్లా కలెక్టర్ బి.చంద్రశేఖర్ అన్నారు. అంతర్జాతీయ మాదకద్రవ్యాల వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం నల్లగొండ పట్టణంలో మహిళా శిశు, వికలాంగుల, వయోవృద్ధుల శాఖ మరియు జిల్లా పోలీసు శాఖ సంయుక్తంగా ప్రజల్లో మాదకద్రవ్యాలపై అవగాహన కల్పించేందుకు ఎన్.జి. కళాశాల నుండి క్లాక్ టవర్ వరకు 2 కిలోమీటర్ల రన్ ను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్, జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్, సంయుక్తంగా జెండా ఊపి ప్రారంభించి, విద్యార్థులు, యువత, పోలీసు అధికారులు మరియు ప్రజలతో కలిసి రన్‌లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ముఖ్యంగా యువత, విద్యార్థులు చేడు వ్యసనాలకు బానిసలై, తమ విలువైన జీవితాన్ని నాశనం చేసుకుంటున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు, పోలీసులు ఉన్నత అధికారులు, ప్రజాప్రతినిధులు, ప్రజాసంఘలా నాయకులు, కార్పొరేటర్లు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# జిల్లా యంత్రాంగం సన్నద్ధం కావాలి




**భద్రాద్రి కొత్తగూడెం,ఫ్లాష్ ఇండియా :** గోదావరి వరదల వల్ల ప్రజానష్టం, పంట నష్టం లేకుండా సంబంధిత అధికారులు అప్రమత్తంగా ఉండాలని తెలంగాణ వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆదేశించారు. గోదావరి పరివాహక ప్రాంతం భద్రాచలం పినపాక నియోజకవర్గాల్లో వరదల పట్ల జిల్లా యంత్రాంగాన్ని సన్నద్ధం చేశామని తెలిపారు. కొత్తగూడెం జిల్లా కలెక్టర్ కార్యాలయలో గోదావరి వరదల నేపథ్యంలో ముందస్తు ప్రణాళికపై ఈరోజు(శనివారం) జిల్లాస్థాయి సమీక్ష సమావేశం నిర్వహించారు. జిల్లా అధికారులకు పలు కీలక అంశాలపై మంత్రి తుమ్మల దిశానిర్దేశం చేశారు. ఈ సమీక్షకు ఎమ్మెల్యేలు తెల్లం వెంకట్రావు, పాయం వెంకటేశ్వర్లు, జిల్లా కలెక్టర్ అంకిత్, జిల్లా ఎస్పీ రోహిత్ రాజ్, ఐటీడీఏపీఓ రాహుల్, మేయర్ మూడ్ గణేశ్, ప్రభుత్వ శాఖల అధికారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల మాట్లాడారు. గత వరదల అనుభవాలను పరిగణలోకి తీసుకుని అన్ని ప్రభుత్వ శాఖల అధికారులు సమన్వయం చేసుకోవాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. వరదల వల్ల రహదారులు బ్లాక్ అయ్యే గ్రామాలు గుర్తించాలని సూచించారు. అత్యవసర వైద్యసేవలు, నిత్యావసర వస్తువులు రవాణాకు అడ్డంకులు లేకుండా యాక్షన్ ప్లాన్ ఉండాలని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పేర్కొన్నారు.

# ఎస్ఐఆర్ ప్రక్రియకు బీజేపీ పూర్తి సహకారం



**సికింద్రాబాద్,ఫ్లాష్ ఇండియా :** ప్రత్యేక సత్వర ఓటరు జాబితా సవరణ కార్యక్రమంలో భాగంగా బీఎల్ఓ బృందం శనివారం తార్నాకలోని తెలంగాణ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రామచందర్ రావు నివాసాన్ని సందర్శించి ఎన్యూమరేషన్ ప్రక్రియ ను నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్. రామచందర్ రావు మాట్లాడుతూ.. ప్రత్యేక సత్వర ఓటరు జాబితా సవరణ కార్యక్రమం రాజ్యాంగబద్ధమైన, చట్టబద్ధమైన ప్రక్రియ అని అన్నారు. పరిశుభ్రమైన, ఖచ్చితమైన, విశ్వసనీయమైన ఓటరు జాబితా రూపొందించడమే ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని పేర్కొన్నారు. తెలంగాణ వ్యాప్తంగా బీజేపీ కార్యకర్తలు ఎన్నికల సంఘానికి పూర్తిస్థాయిలో సహకరిస్తూ, బూత్ స్థాయిలో ఎస్ఐఆర్ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు కృషి చేస్తున్నారని తెలిపారు. స్వేచ్ఛాయుత, నిష్పక్షపాత, పారదర్శక ఎన్నికలకు విశ్వసనీయ ఓటరు జాబితా పునాది అని ఆయన పేర్కొన్నారు. ప్రజలందరూ ఎస్ఐఆర్ కార్యక్రమానికి సహకరించి తమ ఓటరు వివరాలను సరిచూసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

# తప్పులుంటే బాధ్యులు ఎవరు?

## ఎన్యూమరేషన్ ఫారాలను మీరే నింపాలంటున్న బీఎల్వోలు..

**మక్తల్,ఫ్లాష్ ఇండియా :** గత రెండు రోజులుగా బీఎల్‌వోలు ఎన్యూమరేషన్ ఫారాల ఇంటింటికి వెళ్లి పంపిణీ పూర్తి చేశారు. ఇచ్చిన ఫారాలని మీరే నింపాలని, రెండు రోజుల్లో తిరిగి ఇవ్వాలని అనడం వాటిని ఎలా నింపాలో తమకు తెలియదని అందులో ఉండే సందేహాలను ఎవరు నివృత్తి చేస్తారని ఓటర్లు ప్రశ్నిస్తున్నారు. గత మూడు దఫాలుగా తహసీల్దార్ అధ్యక్షతన బీఎల్‌వోలకు ఎన్యూమరేషన్ పై ట్రైనింగ్ ఇచ్చి ట్రైనింగ్‌లో ఇచ్చిన ఫారాలను ఓటర్ల దగ్గరుండి నింపేందుకు చొరవ తీసుకోవాలని ఆదేశాలు ఉన్నాయి. ఓ ఇంట్లో చదువురాని వారుంటే ఫారాలు ఎలా నింపుతారని సందేహం వ్యక్తం చేశారు. బీఎల్వోలకు పంపిణీ చేసిన ఫారాలను వారే ఆ ఇంటికి వెళ్లి ఫారాలను నింపాలని ఆదేశంలో ఉన్న కొందరు బీఎల్వోలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని మక్తల్ పట్టణంలో స్లమ్ ఏరియాలో వాదన వినిపిస్తోంది. తమ దగ్గర ఓటర్ లిస్ట్ లేదు. పాత ఓటర్ కార్డు లేవు. నేను ఎలా నింపాలని ప్రశ్నిస్తున్నారు. క్షేత్రస్థాయిలో ఓటరు జాబితాల ఖచ్చితత్వం కోసం మాత్రమే ప్రత్యేక ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) చేపట్టడం జరిగింది. ఎన్యూమరేషన్ ఫారాలను బీఎల్‌వోలు ఇంటికి వెళ్లి స్వయంగా ఫారాలు అందజేసి వాటిని ఎలా నింపాలో వివరించలేదని, నింపిన ఫారాలను రెండు, మూడు రోజుల్లో తిరిగి అందజేయాలని బీఎల్‌వోలు చెప్పడంతో ఓటర్లు విస్మయం చెందుతు తికమక పడుతున్నారు. ఫారాలు అందజేసే సమయంలో ఓటర్ల సందేహాలను నివృత్తి చేయాలని సూచించారు. ఎలాంటి అపోహలకు తావులేకుండా ప్రతి ఓటరు పూర్తి వివరాలతో ఫారాలు నింపే బాధ్యత బిఎల్ఓ లపై ఉందని, దీనిపై నిర్లక్ష్యం చేస్తే చర్యలు తీసుకుంటామని స్థానిక తహసీల్దార్ సతీష్ కుమార్ వివరణ ఇచ్చారు.

# ఫీజుల దోపిడీపై మోకాళ్ల నిరసన



**మిర్యాలగూడ,ఫ్లాష్ ఇండియా ప్రతినిధి :** మిర్యాలగూడ పట్టణంలో ప్రైవేటు పాఠశాలల్లో ఫీజులు మరియు పుస్తకాల అమ్మకం నిషేధించాలని డిమాండ్ చేస్తూ మిర్యాలగూడలో బీసీ యువజన సంఘం ఆధ్వర్యంలో మోకాళ్లపై కూర్చుని నిరసన తెలియచేశారు. ఈ సందర్భంగా బీసీ యువజన సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ తిరుమలగిరి అశోక్ మాట్లాడుతూ మిర్యాలగూడ పట్టణంలో విచ్చలవిడిగా ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలు ఫీజులు పెంచేసి విద్యార్థుల తల్లిదండ్రుల నుండి పెద్ద మొత్తంలో ఫీజుల రూపంలో డబ్బులు వసూలు చేస్తున్న కూడా నేటి కీ విద్యాశాఖ అధికారులు కానీ ప్రజాప్రతినిధులు కానీ ఎందుకు చర్య తీసుకోవడం లేదు పెద్ద మొత్తంలో ఫీజులు పెంచేసి విద్యార్థులు తల్లిదండ్రుల దగ్గర నుండి డబ్బే లక్ష్యంగా దోపిడీ చేస్తున్న యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలని పెద్ద ఎత్తున నిరసనలు తెలుపుతున్న కూడా ఎందుకు స్పందించడం లేదు,విద్యార్థులను ప్రైవేటు పాఠశాలలో చదివించాలి అంటే భూములు బంగారం అమ్ముకొని చదివించుకునే పరిస్థితి మన మిర్యాలగూడలో ఏర్పడదని ఆయన అన్నారు. అంతేకాక పాఠశాలలోనే విద్యార్థులు పుస్తకాలు మరియు యూనిఫామ్ తీసుకోవాలని తల్లిదండ్రులను ఒత్తిడికి గురి చేస్తూ పుస్తకాల పేరుతో పెద్ద మొత్తంలో డబ్బులు వసూళ్లు లక్ష్యంగా యాజమాన్యాలు పనిచేస్తుంటే విద్యాశాఖ అధికారులు ప్రజాప్రతినిధులు చూసి చూడనట్టు వదిలేయడం విద్యార్థుల తల్లిదండ్రులు తీవ్ర ఆర్థిక వేదనకు గురవుతా ఉన్నారు. ప్రభుత్వం స్పందించి మిర్యాలగూడ ప్రైవేటు పాఠశా లలు ఫీజుల నియంత్రణ చర్యలు తీసుకోకపోతే మాత్రం పెద్ద ఎత్తున ఆందోళనలను చేస్తామని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బిసి సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జక్కానాగేశ్వరరావు,గిరిజన విద్యార్థి సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు లావూరి రవీందర్ నాయక్,బీసీ యువజన సంఘం జిల్లా నాయకులు పట్టేటి రమేష్, బీసీ యువజన సంఘం నియోజకవర్గ నాయకులు మునగాల శైలేందర్,పట్టణ నాయకులు లక్ష్మణ్,రాంబాబు మై తోటి పాల్గొన్నారు



## తాగునీటి సమస్యను తీర్చగలరు...

**మిర్యాలగూడ,ఫ్లాష్ ఇండియా ప్రతినిధి :** మిర్యాలగూడ పట్టణం లోని హౌసింగ్ బోర్డ్ లో గత కొన్ని రోజులుగా నీటి సమస్య ఉన్నది. ప్రతి రోజు త్రాగునీరు రావటం లేదని ప్రజలకు తీవ్రఇబ్బంది కలుగుతుందని 15వ వార్డు కౌన్సిలర్ శ్రీజ వార్డు సభ్యుల తో కలసి మిర్యాలగూడ మున్సిపాలిటీ కమిషనర్ నర్రా శ్రీజ రెడ్డి కి శనివారం వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ శ్రీజ మాట్లాడుతూ మా వార్డు ప్రజల సమస్యను తీర్చగలరని కమిషనర్ ని కోరడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమం లో గోవర్ధన్ సింగ్,సాయి మాధవ్, అరుణ,లతీఫ్ తతిదరులు పాల్గొన్నారు.

# బీమాతో భరోసా



**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వము ఉద్యోగుల సంక్షేమాన్ని ఉద్యోగుల భద్రతకు భరోసా ఇస్తూ ఉచిత ప్రమాద బీమా రక్షణను కల్పించడం పట్ల తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ ఉద్యోగులు హర్షం వ్యక్తం చేశారు. రెగ్యులర్ ఉద్యోగులతో పాటు కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ ఉద్యోగులందరికీ ఒక రూపాయి అదనపు భారం లేకుండా ఉచిత ప్రమాద బీమా రక్షణ కల్పించడం పట్ల వారు సీఎం రేవంత్ రెడ్డి ఉప ముఖ్యమంత్రి బట్టి విక్రమార్క క్రీడా శాఖ మంత్రి వాకిటి శ్రీహరి ల చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఎల్బీ స్టేడియం లో జరిగిన ఈ కార్యక్రమంలో స్పోర్ట్స్ అథారిటీ అధికారులు ఉద్యోగులు , సిబ్బంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా తెలంగాణ ఉద్యోగుల సంఘం రాష్ట్ర సహాధ్యక్షులు కాలేరు సురేష్ మాట్లాడుతూ, ఉచిత ప్రమాద బీమా వల్ల ఉద్యోగుల కుటుంబాలకు మనో ధైర్యాన్ని ఇస్తుందని ఈ పథకం కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ ఉద్యోగులకు వర్తింపజేయడం వల్ల ఎందరో చిన్న ఉద్యోగులు వారి కుటుంబాలు సంతోషం వ్యక్తం చేస్తున్నాయని తెలిపారు. ఎన్నో ఏళ్ల నుంచి వివిధ శాఖల్లో పని చేస్తూ రెగ్యులర్ కు నోచుకోని కాంట్రాక్ట్ ఉద్యోగులకు ఇండ్ల స్థలాలు కేటాయించాలని హెల్త్ ఇన్సూరెన్స్ పథకం వర్తింపజేయాలని ఆయన ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.



## బిబికా ఆలం కు దాట్టి సమర్పించిన బండారు దత్తాత్రేయ

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** మొహరం సందర్బంగా బిబికా ఆలం ఊరేగింపు లో మిరాలమండి దగ్గర జి. హన్మంత్ రావు జయహోభారతీయం అధ్యక్షులు ఏర్పాటు చేసిన వేదిక పై నుంచి ముఖ్య అతిథి గా విచ్చేసిన మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ బిబి కాఆలంకు దాట్టి సమర్పించిన్నారు . జీ. హన్మంత్ రావు జయహోభారతీయం అధ్యక్షులు, మునుర్ కాపు సంఘం కార్పొరేషన్ వైస్ ఛైర్మెన్ మరియు ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ ప్రధాన కార్యదర్శి అల్లం భాస్కర్ , తెలుగు దేశం పార్టీ హైదరాబాద్ పార్లమెంట్ కో. ఆర్డినేటర్ నాగు నాగేష్ , పీస్ ఆర్మీ అధ్యక్షులు సయ్యద్ మహామ్మద్ అలీ బిబి కాఆలంకు దాట్టి సమర్పించిన్నారు. ఈ కార్యక్రమం లో బి. వై. శ్రీకాంత్, ఇదయత్ అలీ మీర్జా,హాశంఉసేన్, ఫిరాసత అలీ, శ్రీదర్ యాదవ్, మాణిక్యం మరియు ఇతరులు పాల్గొన్నారు.

# పండుటాకులకు "ఆత్మీయ" నీడ





**వికారాబాద్,ఫ్లాష్ ఇండియా :** డే కేర్ సెంటర్ పండుటాకులకు చల్లని నీడలా మారింది. జీవితంలో ఎన్నో ఆటుపోట్లను ఎదుర్కొంటూ ఆయా రంగాలలో ఎంతో అనుభవం గడించిన వృద్ధుల తమ అనుభవాలను కష్టసుఖాలను పంచుకునేందుకు వేదికవుతున్నది. ఇక్కడికి వచ్చే వారిలో ప్రధానంగా ప్రభుత్వ మాజీ ఉద్యోగులు, కార్మికులు, వ్యాపార సంస్థల్లో పని చేసిన వారు, వ్యవసాయంలో ఆరితేరిన వారు, ఒకప్పటి కవులు, రచయితలు, కళాకారులు ఉంటున్నారు. వీరు రోజంతా కబుర్లు చెప్పుకుంటూ కాలక్షేపం చేస్తారు. ఇక్కడికి వచ్చి సమ వయస్కులతో గడపటం వల్ల తమ కష్టాలను మరిచిపోతున్నామని చెబుతున్నారు. డే కేర్ సెంటర్ పండుటాకులకు చల్లని నీడలా మారింది. జిల్లా కేంద్రంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన భవనములో అన్ని రకాల దినపత్రికలు, క్రీడా పరికరాలు అందుబాటులో ఉండటంతో పాటు సమ వయస్కులతో కబుర్లు చెప్పుకునే అవకాశం ఉండటంతో వృద్ధులకు మంచి కాలక్షేపమవుతుంది. అంతేకాదు పిల్లల ఆదరణ కరువైన పెద్దల్లో మనోధైర్యం నింపుతుంది. జీవితంలో ఎక్కువ సమయము పిల్లల ఉన్నతికే పాటుపడ్డారు. ప్రస్తుతము వృద్ధాప్యానికి చేరారు. వీరిలో చాలామంది పరిస్థితి దయనీయంగా మారింది. వృద్ధులను పిల్లలు పట్టించుకోకపోవడంతో నిరాదరణకు గురవుతున్నారు. ఇది ఆందోళనకర పరిణామం. కొందరు ఉద్యోగం, ఉపాధి కోసం విదేశాలలో ఉంటే, ఇక్కడ ఉంటున్నటువంటి తల్లిదండ్రులకు ఒంటరితనం తప్పడం లేదు. ఇలాంటి వయోవృద్ధుల ఇబ్బందులను దూరం చేయాలనే లక్ష్యముతో డే కేర్ సెంటర్లు ఏర్పాటుకు ప్రభుత్వము నిర్ణయించింది. జిల్లాకు ఒకటి చొప్పున మంజూరు చేసినారు. రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో వికారాబాద్ లో ఈ కేంద్రాన్ని నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా వికారాబాద్ జిల్లా రెడ్ క్రాస్ సొసైటీ చైర్మన్ సాయి చౌదరి మాట్లాడుతూ ఇంట్లో ఒంటరిగా జీవనం సాగిస్తున్న వారికి డే కేర్ సెంటర్ తో ప్రయోజనం చేకూరుతుందని, కొందరు కుమారులు, కుమార్తెల వద్ద ఉంటున్నారని, కుటుంబీకులు ఉద్యోగాలకు, వారి పిల్లలు పాఠశాలలకు వెళితే సాయంత్రం వరకు ఇంట్లో ఒంటరిగా ఉండాల్సిన పరిస్థితి. డే కేర్ సెంటర్ కు వెళితే అక్కడ సాయంత్రం వరకు కాలక్షేపము చేసేందుకు వీలు ఉంటుందని సాయి చౌదరి తెలిపారు. డే కేర్ సెంటర్లలో చేరాలంటే ముందుగా పేర్ల నమోదు చేసుకోవలసి ఉంటుంది. ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా చేరేందుకు అర్హత కల్పిస్తారు. సెంటర్లో వంటగది ఉంటుంది. నమోదైన వారికి ఒక పూట భోజనము అందిస్తామని, ఉదయము పూట రాగి జావ గాని, పండ్లు గాని, టీ గాని, బిస్కెట్లు గాని, ఉప్మా వంటివి అందిస్తున్నామని సాయి చౌదరి తెలిపారు. విశాలమైన హాలుతోపాటు, క్యారమ్స్ వంటి ఆట వస్తువులను ఏర్పాటు చేస్తామ,ని ఆధ్యాత్మిక, సాహిత్య, దినపత్రికలతో కూడిన గ్రంథాలయం ఉంటుందని సాయి చౌదరి తెలిపారు. కావున వయోవృద్ధులు ఈ సౌకర్యాన్ని వినియోగించుకోవలసిందిగా కోరారు.

# సర్ కార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో ప్రతి బిఎల్ఏ కీలక పాత్ర పోషించాలి..



**మిర్యాలగూడ,ఫ్లాష్ ఇండియా ప్రతినిధి :** మిర్యాలగూడ సర్ కార్యక్రమం ఇంచార్జ్ షాబీర్ అలీ,మిర్యాలగూడ శాసనసభ్యులు బత్తుల లక్ష్మారెడ్డి తో కలిసి వేములపల్లి మండల కేంద్రంలో మండలానికి చెందిన సర్పంచులు,ఇంచార్జులు మరియు బూత్ లెవల్ ఏజెంట్లు (బిఎల్ఎ)లకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి మాట్లాడుతూ భారత ఎన్నికల సంఘం చేపట్టిన సర్ కార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో ప్రతి బిఎల్ఎ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. ఓటరు జాబితా సవరణ ప్రక్రియలో ఎలాంటి పొరపాట్లు జరగకుండా ప్రతి ఇంటిని సందర్శించి,అర్హులైన ప్రతి ఓటరు వివరాలు నమోదు అయ్యేలా చర్యలు తీసుకోవాలని కోరారు. సర్ కార్యక్రమం ఇంచార్జ్ షాబీర్ అలీ కార్యక్రమం అమలు విధానం, చేపట్టాల్సిన చర్యలు,దరఖాస్తుల స్వీకరణ,అవసరమైన పత్రాలు మరియు క్షేత్రస్థాయిలో పాటించాల్సిన విధివిధానాలపై బిఎల్ఎ లకు సమగ్ర అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు,కాంగ్రెస్ పార్టీ నాయకులు,మండల ఇంచార్జులు,సర్పంచులు, బిఎల్ఎ లు మరియు పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.



## పని ప్రదేశాల్లో మహిళలకు భద్రత కల్పించాలి

**గండిపేట,ఫ్లాష్ ఇండియా :** తెలంగాణ పోలీస్ అకాడమీలో శనివారం 112 మంది ప్రొబేషనరీ డీఎస్పీలకు "పని ప్రదేశాల్లో మహిళల భద్రత -- పిఓఎస్హెచ్( ప్రివెన్షన్ ఆఫ్ సెక్సువల్ హరాస్మెంట్) చట్టం అమలు, మహిళలు ఎదుర్కొనే సమస్యలు" అంశంపై ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అకాడమీ డైరెక్టర్ అభిలాష్ బిస్త్ ఆహ్వానం మేరకు సీఐడీ డీజీపీ చారు సిన్హా ముఖ్య అతిథిగా హాజరై పోష్ చట్టం ప్రాముఖ్యతను వివరించారు. మహిళలపై లైంగిక వేధింపులు కేవలం ప్రత్యక్ష చర్యల రూపంలోనే కాకుండా, మాటలు, ప్రవర్తన, సంకేతాలు వంటి పలు రూపాల్లో ఉండవచ్చని పేర్కొన్నారు. అలాంటి సంఘటనలను సకాలంలో గుర్తించి చట్టపరమైన రక్షణ వ్యవస్థలను వినియోగించుకోవాలని సూచించారు. అనంతరం విమెన్ సేఫ్టీ వింగ్ కౌన్సిలర్ ఇషా శర్వాణి మహిళలు ఉద్యోగ జీవితంలో ఎదుర్కొనే మానసిక, సామాజిక, వృత్తిపరమైన సవాళ్లు, లైంగిక వేధింపుల వివిధ రూపాలు, వాటిని ఎదుర్కొనే మార్గాలపై అవగాహన కల్పించారు. సురక్షితమైన, గౌరవప్రదమైన కార్యాలయ వాతావరణం కల్పించడంలో పోలీసు అధికారుల పాత్ర అత్యంత కీలకమని వక్తలు పేర్కొన్నారు. కార్యక్రమానికి డీఎస్పీ సతీష్ లైజన్ అధికారిగా వ్యవహరించారు.

# విద్యుత్ సరఫరాలో నిర్లక్ష్యం వహించకండి




**జగిత్యాల,ఫ్లాష్ ఇండియా :** నియోజకవర్గంలో విద్యుత్ సరఫరాను క్రమబద్ధీకరించాలని, ఎక్కడికక్కడ నిలిచిపోయిన విద్యుత్ లైన్ల మరమ్మత్తులను త్వరితగతిన పూర్తి చేయాలని ఎమ్మెల్యే సంజయ్ కుమార్ అధికారులను ఆదేశించారు. శనివారం జిల్లా కేంద్రంలోని విద్యుత్ ప్రగతి భవన్‌లో ఆయన అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామాల్లో తాగునీటి సరఫరా, ఖరీఫ్ పంట సాగుకు ఇబ్బంది కలగకుండా ఉదయం 3 గంటల వరకే త్రీఫేస్ కరెంటును అందుబాటులో ఉంచాలని స్పష్టం చేశారు. మెడికల్ కాలేజీ రోడ్డు పనులకు అడ్డంగా ఉన్న కరెంట్ పోల్స్‌ను వెంటనే తొలగించాలని, ఏడాది కాలంగా నిర్లక్ష్యం వహించడంపై అధికారులపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. అలాగే ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు ఆటంకంగా ఉన్న విద్యుత్ లైన్లను మార్చాలని, వర్షాకాలంలో ప్రజలకు విద్యుత్ సమస్యలు తలెత్తకుండా చూడాలని పేర్కొన్నారు. పొలాల్లో, గ్రామాల్లో వంగిపోయిన, విరిగిపోయిన స్తంభాలను వెంటనే మార్చాలని అధికారులకు సూచించారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ 200 యూనిట్ల ఉచిత విద్యుత్ పథకం అందేలా చూడాలన్నారు. ఇది ఉద్యోగుల ఫ్రెండ్లీ ప్రభుత్వమని, ప్రజలకు ఎలాంటి విద్యుత్ ఇబ్బందులు రాకుండా అధికారులు బాధ్యతగా పనిచేయాలని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. ఈ సమావేశంలో విద్యుత్ శాఖ ఎస్ఈ సుదర్శనం, డీఈ గంగారం, ఏడీఈలు జవహర్ నాయక్, సిందూర్ శర్మ, ఎస్ఏఓ శ్రీనివాస్, ఏఈలు తదితరులు పాల్గొన్నారు.




# క్రికెట్ మాత్రమే కాదు..

ఎఫ్ఐహెచ్ ప్రో లీగ్ లో భారత పురుషుల హాకీ జట్టు తమ చిరకాల ప్రత్యర్థి పాకిస్థాన్ పై ఘన విజయం సాధించింది. లండన్ లోని లీ వ్యాలీ హాకీ అండ్ టెన్నిస్ సెంటర్‌లో శుక్రవారం జరిగిన మ్యాచ్‌లో భారత్ 7-1 తేడాతో పాకిస్థాన్‌ను చిత్తుచిత్తుగా ఓడించింది. మ్యాచ్ ప్రారంభంలో వెనుకబడినప్పటికీ.. ఆ తర్వాత భారత ఆటగాళ్లు అద్భుతంగా పుంజుకుని వార్ వన్ సైడ్ లా మ్యాచ్‌ను భారత్ ఆధీనంలోకి తీసుకున్నారు.మ్యాచ్ ప్రారంభంలోనే ఇరు జట్లు దూకుడుగా ఆడాయి. తొలి 90 సెకన్లలోనే భారత జట్టుకు పెనాల్టీ కార్నర్ లభించినా దానిని గోల్‌గా మలచలేకపోయింది. మరోవైపు 13వ నిమిషంలో పాకిస్థాన్‌కు లభించిన పెనాల్టీ కార్నర్‌ను కెప్టెన్ అబూ బకర్ మహ్మద్ గోల్‌గా మార్చడంతో తొలి క్వార్టర్ ముగిసే సమయానికి పాకిస్థాన్ 1-0 ఆధిక్యంలో నిలిచింది.

ఇక రెండో క్వార్టర్‌లో భారత్ ఆట తీరులో గేర్ మార్చింది. 20వ నిమిషంలో లభించిన పెనాల్టీ కార్నర్‌ను హర్మన్‌ప్రీత్ సింగ్ కొట్టగా.. సుఖ్‌జీత్ సింగ్ చాకచక్యంగా డిఫ్లెక్ట్ చేసి గోల్ సాధించాడు. దీంతో స్కోరు 1-1తో సమమైంది. ఆ తర్వాత 26వ నిమిషంలో మరో పెనాల్టీ కార్నర్‌ను కెప్టెన్ హర్మన్‌ప్రీత్ సింగ్ అద్భుత డ్రాగ్ ఫ్లిక్‌తో గోల్‌గా మలచి భారత్‌కు 2-1 ఆధిక్యం అందించాడు. హాఫ్‌టైమ్ తర్వాత భారత జట్టు పూర్తి ఆధిపత్యం చెలాయించింది. వరుసగా వచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకుంటూ గోల్స్ వర్షం కురిపించింది. పెనాల్టీ స్ట్రోక్‌ను హార్దిక్ సింగ్ గోల్‌గా మలచగా..

ఆ తర్వాత జుగ్‌రాజ్ సింగ్ అద్భుత గోల్‌తో స్కోరును 4-1కు చేర్చాడు. 41వ నిమిషంలో సుఖ్‌జీత్ అందించిన పాస్‌ను అభిషేక్ గోల్‌గా మలచి భారత్ ఆధిక్యాన్ని 5-1కు పెంచాడు. ఆ తర్వాత రాజ్ కుమార్ పాల్ మరో గోల్ నమోదు చేశాడు. చివరి క్వార్టర్‌లో కూడా భారత దూకుడు కొనసాగడంతో 54వ నిమిషంలో దిల్‌ప్రీత్ సింగ్ గోల్ సాధించి భారత్ విజయాన్ని 7-1తో ఖరారు చేశాడు. భారత్ తరఫున సుఖ్‌జీత్ సింగ్, హర్మన్‌ప్రీత్ సింగ్, హార్దిక్ సింగ్, జుగ్‌రాజ్ సింగ్, అభిషేక్, రాజ్ కుమార్ పాల్, దిల్‌ప్రీత్ సింగ్ చెరో ఒక్కో గోల్ సాధించారు.

మిడ్‌ఫీల్డ్‌లో అద్భుత ప్రదర్శన కనబరిచిన హార్దిక్ సింగ్‌కు 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్' అవార్డు లభించింది. ఈ విజయంతో భారత్ పూర్తి మూడు పాయింట్లు ఖాతాలో వేసుకుంది. ఇదే టోర్నీలో జూన్ 23న కూడా పాకిస్థాన్‌పై 4-3 తేడాతో గెలిచిన భారత జట్టు, మరోసారి తమ ఆధిపత్యాన్ని నిరూపించింది.

# ప్రపంచంలోనే తొలి బ్యాటర్‌గా ఘనత..




ఐర్లాండ్‌తో బెల్‌ఫాస్ట్‌లో జరిగిన తొలి టీ20 మ్యాచ్‌లో భారత యువ ఓపెనర్ అభిషేక్ శర్మ తన మెరుపు బ్యాటింగ్‌తో సరికొత్త అంతర్జాతీయ రికార్డును లిఖించాడు. టీ20 క్రికెట్ చరిత్రలో 20 లేదా అంతకంటే తక్కువ బంతుల్లో ఐదు హాఫ్ సెంచరీలు (50) సాధించిన ప్రపంచంలోని మొట్టమొదటి పూర్తిస్థాయి సభ్యదేశ బ్యాటర్‌గా అభిషేక్ సరికొత్త చరిత్ర సృష్టించాడు. ఈ మ్యాచ్‌లో కేవలం 19 బంతుల్లోనే అతడు తన అర్ధశతకాన్ని పూర్తి చేసుకుని ఈ అరుదైన మైలురాయిని అందుకున్నాడు. టీ20 క్రికెట్‌లో దిగ్గజాలైన యువరాజ్ సింగ్, డేవిడ్ వార్నర్, ఫిల్ సాల్ట్, కొలిన్ మున్రో, దసున్ శనక, ఫిన్ అలెన్ వంటి ఆటగాళ్లు తమ కెరీర్‌లో కేవలం మూడుసార్లు మాత్రమే ఇంత వేగంగా హాఫ్ సెంచరీలు చేయగా, 25 ఏళ్ల అభిషేక్ శర్మ ఏకంగా ఐదుసార్లు ఈ ఘనత సాధించి వారందరినీ వెనక్కి నెట్టేసాడు.భారత ఇన్నింగ్స్ 8వ ఓవర్లో డీప్ మిడ్-వికెట్ వైపు ఒక నియంత్రిత పుల్ షాట్ ఆడి అభిషేక్ ఈ మైలురాయిని చేరుకోగానే, భారత డ్రెస్సింగ్ రూమ్ మొత్తం లేచి నిలబడి చప్పట్లతో అభినందించింది. అభిషేక్ సైతం థంబ్స్-అప్ చూపిస్తూ అభివాదం చేశాడు. ఐర్లాండ్‌పై అంతర్జాతీయ టీ20ల్లో అత్యంత వేగంగా నమోదైన మూడో హాఫ్ సెంచరీగా కూడా అభిషేక్ ఇన్నింగ్స్ రికార్డుకెక్కింది. 2014లో స్టీఫన్ మైబర్గ్ (17 బంతులు), 2023లో లిట్టన్ దాస్ (18 బంతులు)ల తర్వాత స్థానంలో అభిషేక్ (19 బంతులు) నిలిచాడు. 2025లో మలహైడ్‌లో ఐర్లాండ్‌పైనే ఫిల్ సాల్ట్ 20 బంతుల్లో చేసిన హాఫ్ సెంచరీ రికార్డును అభిషేక్ అధిగమించాడు.అయితే, ఈ రికార్డు సెలబ్రేషన్స్ ఎక్కువసేపు సాగలేదు. హాఫ్ సెంచరీ పూర్తయిన మూడు బంతులకే అభిషేక్ శర్మ అవుటయ్యాడు. మొత్తం 20 బంతులు ఆడిన అతను 7 ఫోర్లు, 2 సిక్సర్ల సాయంతో సరిగ్గా 50 పరుగులు చేసి పెవిలియన్ చేరాడు. ఐర్లాండ్ పేసర్ లియామ్ మెక్‌కార్తీ వేసిన బంతిని పుల్ చేయబోయి టైమింగ్ మిస్ అవ్వడంతో మ్యాథ్యూ హంఫ్రీస్ చేతికి చిక్కాడు. మెక్‌కార్తీకి అంతర్జాతీయ టీ20ల్లో ఇదే తొలి వికెట్ కావడం విశేషం. అయినప్పటికీ, పవర్‌ప్లేలో అత్యంత ప్రమాదకరమైన బ్యాటర్‌గా ఎందుకు గుర్తింపు తెచ్చుకున్నాడో అభిషేక్ ఈ ఇన్నింగ్స్‌తో మరోసారి నిరూపించాడు.ఇక మ్యాచ్ విషయానికి వస్తే.. టాస్ గెలిచి బౌలింగ్ ఎంచుకున్న భారత్ ఆరంభంలోనే ఐర్లాండ్‌ను కోలుకోలేని దెబ్బతీసింది. మోకాలి గాయం కారణంగా ఐపీఎల్, ప్రపంచకప్‌లకు దూరమై.. ఈ మ్యాచ్‌తో పునరాగమనం చేసిన పేసర్ హర్షిత్ రాణా అద్భుతంగా బౌలింగ్ చేశాడు. పిచ్‌పై ఉన్న అదనపు బౌన్స్, సీమ్‌ను చక్కగా వాడుకుంటూ ఓపెనర్ రాస్ అడైర్, ప్రమాదకరమైన టిమ్ టెక్టర్‌లను పెవిలియన్‌కు పంపాడు. అర్ష్‌దీప్ సింగ్ కూడా పవర్‌ప్లేలోనే హ్యారీ టెక్టర్‌ను అవుట్ చేయడంతో 36 పరుగులకే 3 వికెట్లు కోల్పోయి ఐర్లాండ్ పీకల్లోతు కష్టాల్లో పడింది. అయితే, ఆ దశలో కెప్టెన్ లోర్కాన్ టక్కర్, గారెత్ డెలానీలు జట్టును అద్భుతంగా ఆదుకున్నారు. ఆరంభంలో తడబడినా టక్కర్ కేవలం 35 బంతుల్లోనే అర్ధశతకం (50) సాధించగా, డెలానీ ధాటిగా ఆడుతూ భారత బౌలర్లపై విరుచుకుపడ్డాడు. ముఖ్యంగా ప్రసిద్ధ్ కృష్ణ బౌలింగ్‌లో డెలానీ వరుసగా మూడు సిక్సర్లు బాదడంతో ఐర్లాండ్ భారీ స్కోరు వైపు దూసుకెళ్లింది. డెలానీ 32 బంతుల్లో 49 పరుగులు చేసి తృటిలో హాఫ్ సెంచరీ చేజార్చుకున్నాడు.ఈ మ్యాచ్‌లో భారత బౌలర్లు ప్రసిద్ధ్ కృష్ణ, వాషింగ్టన్ సుందర్ తీవ్రంగా నిరాశపరిచారు. ప్రసిద్ధ్ వేసిన యార్కర్లు కాస్తా ఫుల్ టాస్‌లుగా మారడంతో ఐర్లాండ్ బ్యాటర్లు భారీగా పరుగులు రాబట్టారు. అతను తన 4 ఓవర్లలో వికెట్లేమీ తీయకుండా 57 పరుగులు సమర్పించుకున్నాడు. ఇక 16వ ఓవర్ వేసిన సుందర్ ఏకంగా 19 పరుగులు ఇవ్వగా, ఆ తర్వాతి ప్రసిద్ధ్ ఓవర్లో డెలానీ 27 పరుగులు పిండుకున్నాడు. ఈ రెండు ఓవర్లలోనే 46 పరుగులు రావడంతో ఐర్లాండ్ కోలుకుంది. అయితే, డెత్ ఓవర్లలో మళ్లీ బౌలింగ్‌కు వచ్చిన హర్షిత్ రాణా హాఫ్ సెంచరీ చేసిన టక్కర్‌ను అవుట్ చేసి తన కెరీర్ బెస్ట్ గణాంకాలను (3/24) నమోదు చేశాడు. అక్షర్ పటేల్ సైతం తన చివరి ఓవర్లో రెండు వికెట్లు తీసి ఐర్లాండ్‌ను నియంత్రించడంతో ఆ జట్టు నిర్ణీత ఓవర్లలో 9 వికెట్లకు 182 పరుగులు చేసింది. మరోవైపు.. 183 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన భారత్‌కు ఓపెనర్ అభిషేక్ శర్మ మెరుపు ఆరంభాన్నిచ్చాడు. సంజూ శామ్సన్ త్వరగానే అవుట్ అయినా, అభిషేక్ మాత్రం ఐర్లాండ్ బౌలర్లను చీల్చిచెండాడుతూ కేవలం 19 బంతుల్లోనే హాఫ్ సెంచరీ పూర్తి చేశాడు. అంతర్జాతీయటీ20ల్లో ఒక పూర్తిస్థాయి సభ్యదేశం తరఫున 20 లేదా అంతకంటే తక్కువ బంతుల్లో ఐదుసార్లు హాఫ్ సెంచరీ మార్కును అందుకున్న ఏకైక బ్యాటర్‌గా అభిషేక్ రికార్డు సృష్టించాడు. అతని ధాటికి భారత్ పవర్‌ప్లేలోనే 3 వికెట్లకు 68 పరుగులు చేసింది. అయితే, మరో ఎండ్‌లో వికెట్లు పడటం భారత్‌కు శాపంగా మారింది. ఇషాన్ కిషన్ కేవలం ఒక పరుగుకే డెబ్యూ బౌలర్ మాట్ హాలార్డ్‌కు వికెట్ సమర్పించుకోగా, కెప్టెన్ శ్రేయాస్ అయ్యర్ కూడా క్రీజులో ఇబ్బంది పడుతూ 3 పరుగులకే అదే హాలార్డ్ బౌలింగ్‌లో అవుటయ్యాడు. కాసేపటికే 20 బంతుల్లో 50 పరుగులు చేసిన అభిషేక్ శర్మను లియామ్ మెక్‌కార్తీ అవుట్ చేయడంతో మ్యాచ్ ఐర్లాండ్ వైపు తిరిగింది.అభిషేక్ అవుట్ అయిన తర్వాత భారత ఇన్నింగ్స్ పూర్తిగా కుప్పకూలింది. 8వ ఓవర్లో 80 పరుగులకు 4 వికెట్లు కోల్పోయిన స్థితిలో రన్ రేట్ అదుపులోనే ఉన్నా.. మిడిల్ ఆర్డర్ ఘోరంగా విఫలమైంది. తిలక్ వర్మ రివర్స్ స్వీప్‌కు ప్రయత్నించి 19 పరుగులకే అవుట్ కాగా, వాషింగ్టన్ సుందర్ (9) కూడా నిరాశపరిచాడు. తన పుట్టినరోజు నాడే మ్యాచ్ ఆడుతున్న శివమ్ దూబే రెండు సిక్సర్లతో 25 పరుగులు చేసి ఆశలు రేపినా.. మరో అరంగేట్ర బౌలర్ జై ముంద్రా బౌలింగ్‌లో అవుట్ కావడంతో భారత్ ఆశలు అడుగంటాయి. అక్షర్ పటేల్ 15 పరుగులు చేసినా రన్ రేట్ ఒత్తిడిని అధిగమించలేకపోయాడు. చివరికి హర్షిత్ రాణా ఒక సిక్స్ కొట్టి కాస్త మెరిసినా.. హంఫ్రీస్ బౌలింగ్‌లో మిగిలిన వికెట్లు పడటంతో భారత్ 18.5 ఓవర్లలో 148 పరుగులకే ఆలౌట్ అయింది. అభిషేక్ ఇచ్చిన అద్భుతమైన ఫౌండేషన్‌ను ఉపయోగించుకోవడంలో మిగతా బ్యాటర్లు విఫలం కావడంతో భారత్ ఘోర పరాజయాన్ని చవిచూసింది. ఇక ఆదివారం జరిగే రెండో మ్యాచ్‌లో గెలిచి సిరీస్ సమం చేయాలని భారత్ భావిస్తుండగా, ఐర్లాండ్ మాత్రం సిరీస్ క్లీన్‌స్వీప్‌పై కన్నేసింది.

# బిజినెస్

## మళ్లీ ట్రంప్ టారిఫ్స్ రచ్చ..




అంతర్జాతీయ వాణిజ్య రంగంలో మరోసారి అలజడి రేగింది. అమెరికా టెక్ దిగ్గజాలను టార్గెట్ చేస్తూ డిజిటల్ సర్వీసెస్ పన్ను విధించాలని భావిస్తున్న దేశాలకు అమెరికా ప్రెసిడెంట్ ట్రంప్ అత్యంత కఠినమైన హెచ్చరిక జారీ చేశారు. అమెరికన్ కంపెనీలపై ఎలాంటి డిజిటల్ పన్నులు వేసినా, సదరు దేశాల నుంచి అమెరికాకు దిగుమతి అయ్యే అన్ని రకాల వస్తువులపై తక్షణమే 100 శాతం టారిఫ్ విధిస్తామని ప్రకటించారు. ఈ మేరకు తన సోషల్ మీడియా ప్లాట్‌ఫారమ్ ట్రూత్ సోషల్ ద్వారా ట్రంప్ ఈ సంచలన ప్రకటన చేశారు.కొన్ని యూరోపియన్ దేశాలు అమెరికాకు చెందిన గూగుల్, ఆపిల్, అమెజాన్, మెటా లాంటి టెక్ సంస్థలను లక్ష్యంగా చేసుకుని డిజిటల్ సర్వీస్ పన్నులను అమలు చేయడానికి సిద్ధమవుతున్నాయి. ఈ నేపథ్యంలో ట్రంప్ స్పందిస్తూ.. అనేక యూరోపియన్ దేశాలు అమెరికన్ కంపెనీలపై డిజిటల్ సర్వీసెస్ పన్నును త్వరలోనే అమలు చేయాలని చర్చలు జరుపుతున్నాయి. కొన్ని దేశాలు దీనికి చాలా దగ్గరగా కూడా వచ్చాయి. అయితే ఏ దేశమైనా సరే ఇలాంటి పన్ను విధిస్తే.. ఆ దేశం నుంచి అమెరికా వచ్చే ప్రతి వస్తువుపైనా వెంటనే 100% సుంకం ఎదుర్కోవాల్సి వస్తుందని ట్రంప్ స్పష్టం చేశారు.ఈ ప్రతిపాదిత టారిఫ్ ఎంత శక్తివంతమైనదంటే, సదరు దేశాలతో అమెరికాకు ఉన్న ప్రస్తుత, భవిష్యత్తు వాణిజ్య ఒప్పందాలన్నింటినీ ఇది అధిగమిస్తుందని ట్రంప్ పేర్కొన్నారు. ఒప్పందాలు ఇప్పటికే కుదిరినా.. సంతకాలు చేసినా, చేయకపోయినా.. ఈ 100% సుంకం వెంటనే అమల్లోకి వస్తుందని ఆయన తేల్చి చెప్పారు. తన దూకుడు వాణిజ్య విధానాల ద్వారా అమెరికా వ్యాపార ప్రయోజనాలను కాపాడటంలో ట్రంప్ ఎంత కఠినంగా ఉంటారో ఈ నిర్ణయం మరోసారి నిరూపించింది.నిజానికి అంతర్జాతీయ టెక్ సంస్థలు తమ దేశాల్లో భారీగా ఆదాయాన్ని ఆర్జిస్తున్నాయని.. అందుకే అవి స్థానికంగా ఎక్కువ పన్నులు చెల్లించాలని యూరోపియన్ దేశాలు వాదిస్తున్నాయి. కానీ ఈ పన్నులు కేవలం అమెరికన్ కంపెనీలనే వివక్షతో టార్గెట్ చేస్తున్నాయని వాషింగ్టన్ మొదటి నుంచి తీవ్రంగా విమర్శిస్తోంది. తాజా హెచ్చరికతో అమెరికాకు తన యూరోపియన్ మిత్రదేశాల మధ్య ఆర్థిక సంబంధాలు మరింత ఉద్రిక్తంగా మారే అవకాశం కనిపిస్తోంది. ఒకవేళ యూరప్ దేశాలు వెనక్కి తగ్గకపోతే, ప్రపంచవ్యాప్తంగా సరికొత్త ట్రేడ్ వార్ మొదలవడం ఖాయంగా కనిపిస్తోంది.




# బిఎస్ఎన్ఎల్ మాస్టర్ స్ట్రోక్.!

ప్రభుత్వ టెలికాం సంస్థ బిఎస్ఎన్ఎల్ గ్రామీణ ప్రాంతాల వినియోగదారులను లక్ష్యంగా చేసుకుని మరో చవకైన బ్రాడ్ బ్యాండ్ ప్లాన్‌ను అందుబాటులోకి తీసుకొచ్చింది. కేవలం రూ.259 ధరతో కొత్త బ్రాడ్‌బ్యాండ్ ప్లాన్‌ను తీసుకవచ్చింది బిఎస్ఎన్ఎల్. తక్కువ ఖర్చుతో ఇంటర్నెట్ సేవలను అందించాలని లక్ష్యంగా పెట్టుకుంది. భారత్‌నెట్ కార్యక్రమంలో భాగంగా గ్రామాలు, మారుమూల ప్రాంతాలకు నాణ్యమైన ఇంటర్నెట్ కనెక్టివిటీ అందించేందుకు ఈ ప్లాన్‌ను తీసుకవచ్చారు.

**రూ.259 బ్రాడ్‌బ్యాండ్ ప్లాన్:**

బిఎస్ఎన్ఎల్ కొత్త బ్రాడ్‌బ్యాండ్ ప్లాన్‌లో వినియోగదారులకు 25Mbps వేగంతో అన్‌లిమిటెడ్ డేటా, దేశవ్యాప్తంగా అన్‌లిమిటెడ్ వాయిస్ కాలింగ్ సౌకర్యం లభిస్తుంది. అంతేకాకుండా వినోదం కోసం వేవ్స్ ఓటీటీ సబ్‌స్క్రిప్షన్‌ను కూడా ఉచితంగా అందిస్తోంది. ముఖ్యంగా ఈ ప్లాన్‌లో ఇన్‌స్టాలేషన్ ఛార్జీలు లేవు. దీంతో మొదటిసారి బ్రాడ్‌బ్యాండ్ కనెక్షన్ తీసుకునే గ్రామీణ వినియోగదారులకు ఇది మరింత ప్రయోజనకరంగా మారనుంది. ఆన్‌లైన్ చదువులు, వర్క్ ఫ్రం హోమ్, వీడియో కాల్స్, ఓటీటీ వినోదం వంటి అవసరాలకు ఈ ప్లాన్ బాగా ఉపయోగపడుతుంది.

**రూ.51 ప్రీపెయిడ్ ప్లాన్:**

బ్రాడ్‌బ్యాండ్ ప్లాన్‌తో పాటు కొత్త మొబైల్ వినియోగదారుల కోసం ప్రత్యేకంగా రూ.51 ప్రీపెయిడ్ రీచార్జ్ ప్లాన్‌ను కూడా ప్రకటించింది. కొత్తగా బిఎస్ఎన్ఎల్ సిమ్ కొనుగోలు చేసిన వారికి మాత్రమే ఈ ఆఫర్ వర్తిస్తుంది. ఈ ప్లాన్‌లో 28 రోజుల వ్యాలిడిటీతో పాటు దేశవ్యాప్తంగా అన్‌లిమిటెడ్ వాయిస్ కాలింగ్, రోజుకు 2GB హైస్పీడ్ డేటా, రోజుకు 100 SMSలు అందించనున్నారు. అదనంగా ఉచిత అంతర్జాతీయ రోమింగ్ ప్రయోజనాలు కూడా కల్పిస్తున్నారు. ఇది ప్లాన్ ఒక ప్రమోషనల్ ఆఫర్. ఇది 2026 జూన్ 30 వరకు మాత్రమే అందుబాటులో ఉంటుంది. అంతకుముందు కూడా కంపెనీ కేవలం రూ.1 రీచార్జ్ ప్లాన్‌ను ప్రవేశపెట్టి 28 రోజుల వ్యాలిడిటీ, అన్‌లిమిటెడ్ కాలింగ్, డేటా ప్రయోజనాలను అందించింది.

# మైండ్ బ్లోయింగ్ ఫీచర్లతో రాబోతున్న కొత్త సిరీస్ !




గూగుల్ పిక్సెల్ సిరీస్‌లో సరికొత్త ఫోన్లు త్వరలోనే మార్కెట్లోకి రాబోతున్నాయి. దీనికి సంబంధించి ఇంటర్నెట్‌లో చాలా లీకులు చక్కర్లు కొడుతున్నాయి. ముఖ్యంగా గూగుల్ తెస్తున్న కొత్త ఫోల్డబుల్ ఫోన్ 'గూగుల్ పిక్సెల్ 11 ప్రో ఫోల్డ్' పై భారీ అంచనాలు ఉన్నాయి.గూగుల్ కొత్త పిక్సెల్ 11 సిరీస్‌లో మొత్తం నాలుగు మోడళ్లను తీసుకురానుందని తెలుస్తోంది. అవి పిక్సెల్ 11, పిక్సెల్ 11 ప్రో, పిక్సెల్ 11 ప్రో XL, పిక్సెల్ 11 ప్రో ఫోల్డ్. కంపెనీ అధికారికంగా ఎలాంటి వివరాలు చెప్పకపోయిన.. లీకైన సమాచారం ప్రకారం ఈ ఫోన్లలో అదిరిపోయే డిస్‌ప్లే, ఫ్లాగ్‌షిప్ ఫీచర్లు ఉండబోతున్నాయి.

**డిస్‌ప్లే & హార్డ్‌వేర్ ఫీచర్లు**

ఈ ఫోన్ లోపల 8 అంగుళాల పెద్ద స్క్రీన్, అలాగే 6.4 అంగుళాల కవర్ స్క్రీన్ ఉంటాయి. ఈ రెండు స్క్రీన్స్ కూడా 120Hz లేదా 144Hz రిఫ్రెష్ రేట్‌తో స్మూత్‌గా పనిచేస్తాయి. దీని స్క్రీన్ బ్రైట్‌నెస్ చాలా ఎక్కువగా (3,000 నుండి 3,600 నిట్స్ వరకు) ఉంటుంది. అంటే ఎండలో చూసినా కూడా స్క్రీన్ చాలా స్పష్టంగా కనిపిస్తుంది.గూగుల్ సొంతంగా తయారు చేసిన పవర్‌ఫుల్ టెన్సర్ G6 (Tensor G6) ప్రాసెసర్ చిప్‌సెట్‌తో ఈ ఫోన్ పనిచేస్తుంది. దీనికి 16GB RAM ఉంటుంది. స్టోరేజ్ విషయానికి వస్తే 256GB నుండి 1TB వరకు ఆప్షన్స్ ఉంటాయి. ఇందులో 30W ఫాస్ట్ ఛార్జింగ్ సపోర్ట్ చేసే 5,050mAh బ్యాటరీ ఉండబోతోంది.

**కెమెరా సిస్టమ్**

ఫోటోగ్రఫీకి గూగుల్ ఫోన్లు చాలా ఫేమస్. ఈ ఫోల్డబుల్ ఫోన్ వెనుక భాగంలో 48 మెగాపిక్సెల్ మెయిన్ కెమెరా, 10.8 మెగాపిక్సెల్ టెలిఫోటో కెమెరా (5X ఆప్టికల్ జూమ్ సపోర్ట్‌తో), 10.5 మెగాపిక్సెల్ అల్ట్రా-వైడ్ కెమెరా మూడు కెమెరాలు ఉంటాయి. సెల్ఫీల కోసం ముందు వైపు 10 మెగాపిక్సెల్ కెమెరా ఉంటుంది.

**లాంచ్ ఎప్పుడు? ఇండియాలో ధర ఎంతంతంటే**

గూగుల్ పిక్సెల్ 11 సిరీస్ ఫోన్లన్నీ 2026 ఆగస్టు లేదా సెప్టెంబర్ నెలల్లో విడుదలయ్యే అవకాశం ఉంది. ఇండియాలో ఈ ప్రీమియం ఫోల్డబుల్ ఫోన్ ధర రూ. 1,59,999 నుండి రూ. 1,81,999 మధ్యలో ఉండవచ్చని మార్కెట్ వర్గాల టాక్. అయితే గూగుల్ సంస్థ ఈ వివరాలను ఇంకా అధికారికంగా ప్రకటించలేదు. కానీ లీకైన ఫీచర్లను బట్టి చూస్తే, 2026లో రాబోయే అత్యంత పవర్‌ఫుల్ ఫోల్డబుల్ ఫోన్లలో ఇదొక్కటిగా నిలవడం ఖాయం.




# అసలు సాధ్యమయ్యే పనేనా?

భారతీయ సినీ చరిత్రలో సంచలనం సృష్టించిన 'బాహుబలి' ఫ్రాంచైజీ అభిమానులకు అదిరిపోయే అప్డేట్ వచ్చేసింది. ఎంతోకాలంగా ఊహాగానాలకే పరిమితమైన 'బాహుబలి 3' ప్రాజెక్ట్‌కు ఇప్పుడు అధికారికంగా గ్రీన్ సిగ్నల్ వచ్చింది. నెట్‌ఫ్లిక్స్ రూపొందించిన 'Baahubali: The Torch Bearer' డాక్యుమెంటరీలో ప్రభాస్, రానా, అనుష్క స్వయంగా 'బాహుబలి 3' ప్రకటించారు. అయితే ఈ సినిమా ఎప్పుడు ప్రారంభమవుతుంది? విడుదల ఎప్పుడు ఉంటుందనే.. విషయాలపై ఇప్పటివరకు ఎలాంటి అధికారిక ప్రకటన వెలువడలేదు. అయినప్పటికీ, 'బాహుబలి 3' అధికారికంగా కన్ఫర్మ్ కావడంతో అభిమానుల్లో భారీ ఉత్సాహం నెలకొంది. సోషల్ మీడియాలో ఎక్కడ చూసిన బాహుబలి థర్డ్ పార్ట్ గురించే చర్చ జరుగుతోంది. మరి బాహుబలి 3 ఇప్పట్లో సాధ్యమేనా? అంటే, అసాధ్యంగానే కనిపిస్తోంది. ఎందుకంటే.. ప్రభాస్ ముందు భారీ ప్రాజెక్ట్స్ ఉన్నాయి. ఫౌజీ, స్పిరిట్, కల్కి 2, సలార్ 2 లైన్‌లో ఉన్నాయి. ఈ సినిమాలు కంప్లీట్ కావడానికి కనీసం రెండేళ్లైనా పడుతుంది. మరోవైపు రాజమౌళి, మహేష్ బాబు వారణాసితో బిజీగా ఉన్నాడు. ఈ సినిమా వచ్చే ఏడాది ఏప్రిల్ 7న రిలీజ్‌కు షెడ్యూల్ చేయబడింది. దీని తర్వాత రాజమౌళి స్టెప్ ఏంటనేది ఇప్పుడే చెప్పలేం. ఒకవేళ బాహుబలి 3 ఆలోచన చేస్తే.. ప్రభాస్ అప్పటికి కాస్త ఫ్రీ అవుతాడు కాబట్టి ఉండే ఛాన్స్ ఉంది. కానీ,
రానా పెద్దగా సినిమాలు చేయడం లేదు. అనుష్క పూర్తిగా సినిమాలకు దూరమైపోయింది. మిగతా క్యాస్టింగ్‌ను సెట్ చేయడం అంత ఈజీ కాదు. ఈ లెక్కన చూస్తే.. బాహుబలి 3 ఉంటుందని ఖచ్చితంగా చెప్పలేం. ప్రస్తుతానికి మాత్రం ఈ అనౌన్స్మెంట్ ఫ్యాన్స్‌కు ఫుల్ కిక్ ఇస్తోంది. మరి రాజమౌళి ప్లాన్ ఏంటో తెలియాలంటే.. ఇంకొన్నాళ్లు వెయిట్ చేయాల్సిందే!

# తుఫాను ముందు వచ్చే నిశ్శబ్దం..

వైవిధ్యమైన, కంటెంట్ ఉన్న కథలను ఎంచుకుంటూ వరుస హిట్స్‌తో దూసుకుపోతున్నారు యంగ్ హీరో అడివి శేష్. ఇటీవల 'డెకాయిట్' సినిమాతో ప్రేక్షకుల ముందుకు వచ్చిన ఆయన విజయాన్ని అందుకున్నారు. ఆ తర్వాత కొంత రెస్ట్ తీసుకున్నారు. ఇక ఇప్పుడు మరో ప్రాజెక్ట్‌ను పట్టాలెక్కించేందుకు కష్టపడుతున్నారు. ఆయన కెరీర్‌లో భారీ విజయాన్ని అందుకున్న స్పై థ్రిల్లర్ 'గూఢచారి' సినిమాకు సీక్వెల్‌గా 'గూఢచారి-2' తెరకెక్కుతున్న విషయం తెలిసిందే. ఇప్పటికే ఇందుకు సంబంధించిన అధికారిక ప్రకటన కూడా రావడంతో పాటుగా షూటింగ్‌ను కూడా ప్రారంభించారు చిత్రబృందం. అంతేకాకుండా పలు అప్డేట్స్ కూడా విడుదల చేసి అంచనాలను పెంచారు. తాజాగా ఈ సినిమాకు సంబంధించిన ఒక క్రేజీ అప్‌డేట్‌ను అడివి శేష్ సోషల్ మీడియా ద్వారా పంచుకుని అందరినీ సర్‌ప్రైజ్ చేశారు. జూలై నెల నుండి ఈ సినిమా సరికొత్త, భారీ షెడ్యూల్ ప్రారంభం కాబోతున్నట్లు ఆయన ప్రకటించారు. ఈ అప్‌డేట్‌తో పాటు తన కొత్త లుక్‌కు సంబంధించిన కొన్ని ఫోటోలను కూడా అడివి శేష్ రిలీజ్ చేశారు. ఇందులో ఆయన క్లీన్ షేవ్ లుక్‌లో ఎంతో యంగ్‌గా, ఫిట్‌గా కనిపిస్తున్నారు. ఒక పర్‌ఫెక్ట్ స్పై బాడీని తీసుకురావడం కోసం ఆయన జిమ్‌లో గట్టిగానే వర్కవుట్స్ చేస్తున్నారు. అలాగే సినిమాలోని ఇతర నటీనటులతో



కలిసి షూటింగ్ కోసం ప్రిపేర్ అవుతున్న ఫోటోలను కూడా పంచుకున్నారు. ఈ ఫోటోలకు 'తుఫాను ముందు వచ్చే ప్రశాంతత.. జూలైలో +2 షూటింగ్ మొదలవుతోంది' అంటూ అడివి శేష్ పెట్టిన క్యాప్షన్ ఫ్యాన్స్‌లో జోష్ నింపింది. అయితే ఈ క్రేజీ పాన్ ఇండియా సినిమాలో టాలెంటెడ్ బ్యూటీ వామికా గబ్బి హీరోయిన్‌గా నటిస్తోంది. అలాగే బాలీవుడ్ స్టార్ నటుడు ఇమ్రాన్ హష్మీ ఓ పవర్‌ఫుల్ పాత్రలో కనిపించనున్నారు. దీంతో ఈ సినిమాపై టాలీవుడ్‌లోనే కాకుండా దేశవ్యాప్తంగా భారీ క్రేజ్ ఏర్పడింది. వినయ్ కుమార్ సిరిగినీడి ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తున్నారు. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ, అభిషేక్ అగర్వాల్ ఆర్ట్స్ బ్యానర్లపై అత్యంత ప్రతిష్టాత్మకంగా, భారీ బడ్జెట్‌తో ఈ సినిమాను నిర్మిస్తున్నారు.

# ఆ నెలలోనే విడుదల?



టాలీవుడ్ హీరో విజయ్ దేవరకొండ ప్రస్తుతం రణబాలి చిత్రంతో పాటు రౌడీ జనార్ధన అనే మూవీలో కూడా హీరోగా నటిస్తున్నాడు. ఇక రౌడీ జనార్ధన సినిమా విషయానికి వస్తే ఈ మూవీలో కీర్తి సురేష్ హీరోయిన్ గా నటిస్తుండగా రవి కిరణ్ కోలా దర్శకత్వం వహిస్తున్నాడు. శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ బ్యానర్ పై ప్రముఖ నిర్మాత దిల్ రాజు ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నాడు. ఈ మూవీ నుండి కొంత కాలం క్రితం అదిరిపోయే యాక్షన్ వీడియోను మేకర్స్ విడుదల చేశారు. అందులోని విజయ్ లుక్, డైలాగ్స్ అద్భుతమైన రేంజ్ లో ఉండడంతో ఒక్కసారిగా ఈ సినిమాపై అంచనాలు భారీగా ఏర్పడ్డాయి. ఇప్పటివరకు ఈ సినిమా విడుదలపై పెద్దగా ఎలాంటి న్యూస్ బయటకు రాలేదు. తాజాగా ఈ మూవీ విడుదలకు సంబంధించిన ఓ వార్త వైరల్ అవుతుంది. ప్రస్తుతం అందుతున్న సమాచారం ప్రకారం ఈ సినిమాను డిసెంబర్ బరిలో నిలపాలని నిర్మాత దిల్ రాజు ఆలోచిస్తున్నట్లు, అందుకు అనుకూలంగా ప్రణాళికలను రచిస్తున్నట్లు తెలుస్తోంది. అన్ని అనుకున్నట్లు జరిగితే మరి కొంత కాలంలోనే అందుకు సంబంధించిన అధికారిక ప్రకటన కూడా వెలువడే అవకాశం ఉన్నట్లు వార్తలు వస్తున్నాయి. మరి ఈ సినిమాను ఎప్పుడు విడుదల చేస్తారు అనేది చూడాలి. టాలీవుడ్ సీనియర్ నటుడు రాజశేఖర్ ఈ చిత్రంలో విలన్ పాత్రలో కనిపించనుండగా, విశాల్ మిశ్రా సంగీతం అందిస్తున్నాడు.

# అదే మనల్ని సక్సెస్ వైపు నడిపిస్తుంది

సినిమా ఇండస్ట్రీలో ఒక నటిగా ఉండటంలో ఉండే లాభాలు ఏంటి? నష్టాలు ఏంటి? అనే ప్రశ్నపై స్పందిస్తూ.. "ఒక నటిగా నేను చేసే ఒక్కో క్యారెక్టర్ ద్వారా ఒక్కో కొత్త జీవితాన్ని జీవించే అవకాశం నాకు దొరుకుతుంది. నిజ జీవితంలో మనం చేయలేని ఎన్నో విషయాలను, ఎమోషన్స్‌ను కెమెరా ముందు పాత్రల ద్వారా అనుభవించవచ్చు. ప్రతి కొత్త ప్రాజెక్ట్ మనకు లైఫ్‌లో ఏదో ఒక కొత్త విషయాన్ని నేర్పిస్తుంది" అని త్రిప్తి ఆనందం వ్యక్తం చేశారు. అలాగే కెరీర్‌లో ఎదురయ్యే ఫెయిల్యూర్స్ మానసిక ఆరోగ్యంపై ఎలాంటి ప్రభావం చూపిస్తాయనే విషయంపై త్రిప్తి స్పందిస్తూ.. "కచ్చితంగా కెరీర్‌లో చాలా కష్టమైన రోజులు వస్తాయి. మనం ఒకటి ఆశిస్తే ఇండస్ట్రీలో ఇంకొకటి జరుగుతుంది. అలాంటప్పుడు మన సామర్థ్యంపై మనకే అనుమానం రావడం చాలా కామన్. కానీ, ఆ కష్ట కాలమే మనకు ఓపికను, మనపై మనకు నమ్మకాన్ని నేర్పిస్తుంది. వెనక్కి తిరిగి చూసుకుంటే.. నన్ను ఒక స్ట్రాంగ్ పర్సన్‌గా మార్చడానికి ఆ ఫెయిల్యూర్స్ ఎంతగానో హెల్ప్ చేశాయి. అందుకే నేను అందరికీ ఒకటే చెప్తాను.. కష్టాలు వచ్చినప్పుడు అస్సలు భయపడకుండా, తలదించుకుని మన పని మనం సిన్సియర్‌గా చేసుకుంటూ పోవాలి. అదే మనల్ని సక్సెస్ వైపు నడిపిస్తుంది" అంటూ త్రిప్తి దిమ్రి క్లారిటీ ఇచ్చారు



# అధికారం కోసం కన్నతండ్రినే ఢీకొట్టిన కూతురు!




ఓటీటీ లవర్స్ ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తోన్న మోస్ట్ అవేటెడ్ తెలుగు ఒరిజినల్ క్రైమ్ థ్రిల్లర్ 'ఇసకపట్నం' అఫీషియల్ ట్రైలర్‌ను ప్రముఖ ఓటీటీ దిగ్గజం అమెజాన్ ప్రైమ్ వీడియో విడుదల చేసింది. ఒక కల్పిత పోర్ట్ టౌన్ బ్యాక్‌డ్రాప్‌లో సాగే రా అండ్ రస్టిక్ పొలిటికల్ గ్యాంగ్ వార్ డ్రామా ఇది. రక్తాన్ని ఉడికించే యాక్షన్, మైండ్ గేమ్‌లు, కుటుంబ విభేదాల కలబోతగా వస్తోన్న ఈ సిరీస్ ట్రైలర్ ప్రస్తుతం సోషల్ మీడియాను షేక్ చేస్తోంది. ఈ సిరీస్‌లో వెర్సటైల్ నటుడు సముద్రఖని 'నాయుడు' అనే అత్యంత పవర్‌ఫుల్ రోల్‌లో నటించగా.. టాలెంటెడ్ బ్యూటీ ఐశ్వర్య రాజేష్ ఆయన కూతురు 'భారతి' పాత్రలో నటించారు. ఇసకపట్నం అనే పోర్ట్ టౌన్‌లో రాజకీయాలు, అండర్ వరల్డ్ నేరాలు, వందల కోట్ల వ్యాపారాలపై ఏకఛత్రాధిపత్యం చెలాయించే నాయుడికి.. చివరకు తన సొంత కూతురే ఒక పెద్ద సింహస్వప్నంగా మారుతుంది. తన జీవితాన్ని, తన ఊరిని తండ్రి గుప్పిట్లోంచి కాపాడుకోవడానికి, తండ్రి అరాచకాలకు అడ్డుకట్ట వేయడానికి భారతి తిరుగుబాటు చేయడమే ఈ సిరీస్ మేజర్ హైలైట్. ట్రైలర్‌లో తండ్రీకూతుళ్ల మధ్య వచ్చే డైలాగ్స్, మైండ్ గేమ్స్ నెక్స్ట్ లెవెల్‌లో ఉన్నాయి. టాలెంటెడ్ డైరెక్టర్ గ్యారీ బీహెచ్ అత్యంత ప్రతిష్టాత్మకంగా తెరకెక్కించిన ఈ సిరీస్ మొత్తం 7 ఎపిసోడ్లతో రాబోతోంది. ప్రశాంత్ రాఘతి అందించిన అద్భుతమైన కథకు, తాజుద్దీన్ సయ్యద్ రాసిన పవర్‌ఫుల్ సంభాషణలు తోడయ్యాయి. ప్రముఖ నిర్మాణ సంస్థ 'తమడా మీడియా ప్రొడక్షన్స్' బ్యానర్‌పై రాహుల్ తమడా, సైదీప్ రెడ్డి బొర్రా ఎక్కడా కాంప్రమైజ్ కాకుండా ఈ సిరీస్‌ను భారీ బడ్జెట్‌తో నిర్మించారు. ఈ సిరీస్‌లో కమెడియన్ సునీల్ సరికొత్త రోల్‌లో కనిపించబోతుండగా.. నరేష్ అగస్త్య, మెరిన్ ఫిలిప్, సుధాకర్ కోమాకుల, రాజీవ్ కనకాల, మైమ్ గోపీ, రోహిణి, బెనర్జీ, జ్వాల కోటి, రవి వర్మ, రాజా చెంబోలు వంటి భారీ తారాగణం కీలక పాత్రల్లో మెరవనున్నారు.



# 'వారణాసి'పై బిగ్ అప్‌డేట్




టాలీవుడ్ సూపర్ స్టార్ మహేశ్ బాబు, దర్శక ధీరుడు ఎస్.ఎస్.రాజమౌళి కాంబినేషన్‌లో రాబోతున్న భారీ పాన్ వరల్డ్ ప్రాజెక్ట్ 'వారణాసి'. ప్రస్తుతం షూటింగ్ శరవేగంగా జరుగుతోన్న ఈ సినిమాకు సంబంధించి తాజాగా బిగ్ అప్డేట్ ఇచ్చాడు డైరెక్టర్ రాజమౌళి. ఇటీవల ఫ్రాన్స్‌లో జరిగిన 'ఆన్సీ ఇంటర్‌నేషనల్ యానిమేషన్ ఫెస్టివల్'లో పాల్గొన్న ఆయన.. "వారణాసి' సినిమా షూటింగ్ మరో నాలుగు నెలల్లో, అంటే ఈ ఏడాది సెప్టెంబర్ లేదా అక్టోబర్ మొదటి వారానికల్లా కంప్లీట్ అవుతుంది. సినిమాకు ప్రధాన ఆకర్షణగా నిలవబోయే భారీ యాక్షన్ సీక్వెన్స్‌ల చిత్రీకరణతో పాటు వారణాసిలోని ముఖ్యమైన భాగాల షూటింగ్ కూడా ఇప్పటికే పూర్తి అయింది. ప్రస్తుతం కేవలం కథను అనుసంధానం చేసే చిన్న చిన్న సన్నివేశాలను మాత్రమే తెరకెక్కిస్తున్నాం. ఈ కథ ఐమాక్స్ స్క్రీన్‌పై చూస్తేనే అద్భుతమైన అనుభూతిని ఇస్తుందని మేము ముందుగానే భావించాము. అయితే ఈ ఫార్మాట్ కోసం కథలో ఎలాంటి ప్రధాన మార్పులు చేయలేదు. సాంకేతిక పరమైన సర్దుబాట్లు మాత్రమే చేశాము. 'అనోమార్ఫిక్ ఫ్రేమింగ్' పద్ధతిని ఉపయోగించి దృశ్యాలను చిత్రీకరించాము. దీని కోసం మొదట్లో కొంచెం ఇబ్బంది పడ్డా తర్వాత ఈజీగా సాగింది' అంటూ రాజమౌళి చేసిన కామెంట్స్‌తో సినిమాపై హైప్ పెరిగింది.

# తలైవా 173లో ఆఫర్...

సూపర్ స్టార్ రజినీకాంత్ తన 173వ చిత్రంతో అభిమానులను అలరించేందుకు సిద్ధమవుతున్నారు. 'డ్రాగన్' ఫేమ్ అశ్వత్ మారిముత్తు దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రానికి తాజాగా 'ధర్మన్' అనే పవర్ ఫుల్ టైటిల్‌ను ఫిక్స్ చేస్తూ పోస్టర్ రిలీజ్ చేసిన విషయం తెలిసిందే. ఇందులో రజినీకాంత్ 'ది డెడ్లీ డాక్టర్' అవతారంలో కనిపించనున్నట్లు తెలుపుతూ.. న్యాయాన్ని గెలిపించే ఓ వైద్యుడిగా ఆయన పాత్ర చాలా వైవిధ్యంగా, పవర్‌ఫుల్‌గా ఉండబోతుందని హిట్ ఇచ్చారు మేకర్స్. దీంతో సినిమాపై భారీ ఎక్స్‌పెక్టేషన్స్ నెలకొన్నాయి. కమల్ హాసన్ తన రాజ్‌కమల్ ఫిల్మ్స్ ఇంటర్నేషనల్ బ్యానర్‌పై ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న ఈ సినిమాకు అనిరుధ్ రవిచందర్ సంగీతం అందిస్తుండగా.. ప్రస్తుతం ఈ చిత్రం ప్రీ ప్రొడక్షన్ పనుల్లో బిజీగా ఉంది. ఇక త్వరలో సెట్స్ పైకి వెళ్లేందుకు సిద్ధంగా ఉన్న 'ధర్మన్'కు సంబంధించి తాజాగా మరో అప్డేట్ కోలీవుడ్ వర్గాల్లో గట్టిగా వినిపిస్తుంది. ఈ చిత్రంలో ఇప్పటికే సీనియర్ నటి సిమ్రాన్, యంగ్ బ్యూటీ రాశి ఖన్నా భాగం అయినట్లు తెలుస్తుండగా.. తాజాగా మీనాక్షి చౌదరి కూడా ఈ ప్రాజెక్టులో భాగం అయిందని సమాచారం. ప్రస్తుతం డైరెక్టర్ అశ్వత్ మారిముత్తు తమిళ స్టార్ శింబుతో 'కూ=51' కోసం వర్క్ చేస్తున్నాడు. ఇందులో మీనాక్షి చౌదరిని హీరోయిన్‌గా లాక్ చెయ్యగా.. ఇప్పుడు రాబోయే తలైవా 173లో కూడా ఎంపిక చేశారట. ప్రస్తుతం ఇందుకు సంబంధించిన పోస్టులు వైరల్ అవుతుండగా.. అఫీషియల్ అనౌన్స్‌మెంట్ రావాల్సి ఉంది.

Edited, Printed, Published & Owned by **KOMARAJU SRINIVASULU** and Printed at **Ramu Graphics**, Shop No:5,Near Clock Tower Church Compound, Nalgonda District (T.S.), Published From: KOMARAJU SRINIVASULU, Village: Anthaiah Gudem, Post: Duppalapally, Mandal: Thipparthy-508247, Dist. Nalgonda, (T.S) **Editor: KOMARAJU SRINIVASULU. Cell: 7730032999, E-mail: flashindiadaily@gmail.com, www.flashindianews.com, RNI No. APTEL/2010/33229**